వంద ఫీట్ల రహదారులపై హైడ్రామా

- పొలాలకు వెళ్లేందుకే విశాల రహదారుల నిర్మాణమట
- రైతులు కోరితేనే నిర్మాణ సంస్థ పనులు చేపట్టిందట
- పొలాలకు వెళ్లేందుకు వంద ఫీట్ల రోడ్డుందుకు?
- ప్రశ్నించిన ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీత
- రెండు రోజుల్లో పీవోటీ కింద స్వాధీనం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): దశాబ్దాలుగా ఆ రెండు గ్రామాల సరిహద్దుల్లో ఉన్న భూములకు రైతులు వెళుతున్నారు. గుట్టలుపోను... చదును ఉన్న చోట సాధ్యమైనంత వ్యవసాయం చేస్తున్నారు. డొంక మార్గమో... రైతులు సమిష్టిగా వదులుకున్న దారో... నిన్నటిదాకా వాళ్లకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. కానీ పొలాలకు వెళ్లేందుకు అకస్మాత్తుగా వాళ్లకు వంద ఫీట్ల రహదారి కావాలని కోరిక పుట్టింది. వెంటనే ఒక నిర్మాణ సంస్థను ఆశ్రయించారు. వారు రైతుల కోరిక మేరకు వాళ్ల భూముల్లోనే వంద ఫీట్ల విశాలమైన రహదారులు నిర్మిస్తున్నారు. మరి.. ఇంతకీ ఆ రైతులు తమకున్న అర ఎకరమో, ఒకటో, రెండో ఎకరాలను రహదారి నిర్మాణానికి ఇస్తే ఇంకా వాళ్లకు భూములెక్కడివి? భూములే నిర్మాణంలో పోయిన తర్వాత రహదారి ఎందుకు?? రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం -అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల సరిహద్దున 'అసైన్డ్ భూముల్లో వెంచర్' వ్యవహారంలో తాజాగా తెరపైకి వచ్చిన హైడ్రామా ఇది. అసైన్డ్ భూముల నుంచి దర్జాగా రోడ్ల నిర్మాణం చేపడుతున్న వైనంపై 'నమస్తే తెలంగాణ'లో కథనం రావడంతో కొందరు రైతులు తెర మీదకొచ్చారు. తమ భూముల్లోకి వెళ్లేందుకు రోడ్డు కావాలని ఒక నిర్మాణ సంస్థను కోరితే వాళ్లు వంద ఫీట్ల రోడ్డు వేస్తున్నారే తప్ప తమ భూములు ఎవరూ ఆక్రమించలేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇతరులు వాళ్ల పొలాలకు వెళ్లేందుకు రైతులు తమ భూములను త్యాగం చేయడం... అందునా ఒక నిర్మాణ సంస్థ ఎలాంటి లాభాపేక్ష లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టడం బహుశా చరిత్రలో ఇక్కడే జరిగింది కాబోలు.

ఆ నిర్మాణాలు ఎందుకో?

వాస్తవానికి ఇబ్రహీంపట్నం మండలంలోని నాగన్‌పల్లి గ్రామ సరిహద్దున ఉన్న సర్వేనంబరు 189లోని అసైన్డ్ భూముల మీదుగానే ఇబ్రహీంపట్నం మండలంలోని అనాజ్‌పూర్ గ్రామ పరిధిలోని భూముల్లోకి వెళ్లాల్సి ఉంటుంది. గతంలో ఇలా వెళ్లేందుకు అనేక మార్గాలు ఉన్నాయి. ఇప్పుడు తాము రహదారి నిర్మాణం కోసం భూములు ఇచ్చామని నాగన్‌పల్లికి చెందిన కొందరు రైతులు మంగళవారం మీడియా ముందు చెప్పగా... అందులో ఉన్న వారికి గరిష్ఠంగా రెండు, రెండున్నర ఎకరాల భూమి మాత్రమే ఉంది. మరి రహదారి నిర్మాణం కోసం ఉన్న భూమి ఇస్తే వాళ్లు పోయేది ఎవరి భూముల్లోకి? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఈ రహదారి నిర్మాణం దాటిన తర్వాత నాగన్‌పల్లికి చెందిన భూములు లేవు. అవన్నీ అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన భూములు. దీంతో తమ భూముల్లోకి వెళ్లేందుకే రోడ్డు నిర్మాణమని చెబుతున్న రైతుల మాటల్లో వాస్తవం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా సదరు నిర్మాణ సంస్థ రోడ్డు నిర్మాణంతో పాటు సెక్యూరిటీ వారి కోసమో, ఇతర కార్యాలయ అవసరాల నిమిత్తమో... గదుల నిర్మాణాన్ని కూడా చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు పొలాలకు వెళ్లేందుకైతే మరి ఈ గదుల నిర్మాణం ఎందుకోసమో మాత్రం అటు రైతులు, ఇటు నిర్మాణ సంస్థ మాత్రం వెల్లడించకపోవడం గమనార్హం.

పీవోటీ కింద తీసుకుంటాం: తహసీల్దార్


ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూములను నిర్మాణ సంస్థకు లీజు ప్రాతిపదికన ఇవ్వడంతో పాటు అందులో రహదారుల నిర్మాణం చేపడుతుండటంతో ఇబ్రహీంపట్నం రెవెన్యూ అధికారులు నాగన్‌పల్లి గ్రామ రైతులకు గతంలోనే నోటీసులు జారీ చేశారు. పీవోటీ కింద ఆ భూములను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని అందులో పేర్కొన్నట్టు తెలిసింది. ఒకవైపు యథేచ్ఛగా రోడ్ల నిర్మాణం చేపడుతున్నా పనులను నిలువరించని అధికారులు నోటీసుల గడువు పూర్తి కాగానే పీవోటీ కింద భూములను స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేస్తున్నారు. నిర్మాణ సంస్థ ద్వారా తమ భూముల్లో రోడ్లు వేయిస్తున్నామని నాగన్‌పల్లికి చెందని కొందరు రైతులు మంగళవారం ప్రకటించిన విషయం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీత దృష్టికి తీసుకువెళ్లగా... పొలాలకు వెళ్లేందుకు వంద పీట్ల రోడ్లు ఎందుకు? అని ప్రశ్నించారు. ఎలాంటి నిర్మాణం చేపట్టాలన్నా ప్రభుత్వ అనుమతి ఉండాలని, అలాంటి అనుమతి ఆ రోడ్లకు లేదని చెప్పారు. అసైన్డ్ భూముల్లో నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వదని ఆమె కుండబద్దలు కొట్టారు. కాగా ఈ నెల 7వ తేదీన అధికారులు రైతులకు నోటీసులు ఇచ్చిన దరిమిలా గడువు ఈ నెల 22తో ముగియనుంది.



నాగన్‌పల్లిలోని సర్వే నంబర్ 189లో గల ప్రభుత్వ భూమిలో నుంచి అక్రమంగా వెంచర్‌లోకి వేసిన రోడ్డు

ఇందిరాసాగర్ చెరువుకు ఉరి!





ఇందిరాసాగర్ చెరువు వద్ద ముమ్మరంగా సాగుతున్న పనులు పక్కన ఇందిరా సాగర్ చెరువు మ్యాప్

మొదటిపేజీ తరువాయి...

శాపంగా మారాయి. భారీ యంత్రాలతో గుట్టలన్నింటినీ పిండి చేస్తున్న రియల్టర్లు మట్టి, రాళ్లను అందులోకి జార విడుస్తుండటంతో ముమ్ముందు వరద వచ్చే మార్గమే మూసుకుపోయే ప్రమాదముందనే ఆందోళన వ్యక్తమవుతుంది. ఇదీ... రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం-అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల సరిహద్దున 'అసైన్డ్ భూముల్లో వెంచర్' వ్యవహారంలో కొత్త కోణం. హైడ్రా పరిధిలోనే ఇదంతా జరుగుతున్నా... సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవడంతో బహిరంగంగానే ఇందిరాసాగర్‌కు ఉరితాడు బిగుసుకుంటుంది.

512 ఎకరాల ఆయకట్టు

రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని నాగన్‌పల్లి.. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని అనాజ్‌పూర్ గ్రామాల సరిహద్దుల్లో ఓ భారీ వెంచర్ రూపుదిద్దుకుంటుందనేది బహిరంగమే. సుమారు 250-300 ఎకరాల (ఇతరుల భూములు కలుపుకున్నా) విస్తీర్ణంలో ఉన్న పట్టా భూముల ఆధారంగా దీనిని ఏర్పాటు చేస్తున్నారు. వాస్తవానికి ఈ భూముల్లోకి రావాలంటే గ్రామాల్లో పూర్వం నుంచి ఉండే చిన్న చిన్న డొంకలు, దారులు ఉన్నాయి. కానీ ఆ భూమిని పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్న దరిమిలా విశాల రహదారులు నిర్మిస్తున్నారు. ఇందుకోసం నాగన్‌పల్లి పరిధిలోని అసైన్డ్ భూములను లీజు ప్రాతిపదికన తీసుకొని అందులో వంద ఫీట్ల రహదారులు, ఇతర నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ శాఖ నోటీసులు జారీ చేసినా పనులు మాత్రం ఆగడం లేదు. ఈ నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ' ఆ పనులు మరింత లోతుగా పరిశీలించినపుడు ఇందిరాసాగర్‌కు వాటిల్లుతున్న ముప్పు బయటపడింది. 1981లో రంగారెడ్డి జిల్లా ఏర్పడగా.. అంతకు ఏడాది ముందే ఇందిరాసాగర్ నిర్మాణం పూర్తయింది. మూడు గ్రామాల పరిధిలో 512 ఎకరాల ఆయకట్టుకు ఈ చెరువు ద్వారా సాగునీరు అందుతుంది. దీంతో పాటు చుట్టుపక్కల గ్రామాల పరిధిలో భూగర్భజలాలూ పెరగడంతో తాగునీరు అందుతుంది. ఈ చెరువుకు సుదూర ప్రాంతం నుంచి గొలుసుకట్టు ద్వారా వరద నీరు రావడం విశేషం. మహేశ్వరం మండలంలోని రావిర్యాల పెద్ద చెరువు నుంచి ప్రారంభమయ్యే పులిందర్‌వాగు క్రమంగా దిగువన ఉన్న మంగళపల్లి వద్ద చెక్‌డ్యాం.. ఆపై శేరిగూడ వద్ద మరో చెక్‌డ్యాం మీదుగా తట్టిఖాన వద్ద వాగులోని చెక్‌డ్యాంను దాటి ఇందిరాసాగర్‌కు చేరుకుంటుంది. ఇలా సుమారు వంద ఫీట్ల కాల్వ (వాగు) మార్గం ద్వారా భారీ ఎత్తున వరద వస్తుంది. ఇందిరాసాగర్ నుంచి దిగువన అనాజ్‌పూర్ చెరువుకు వరద చేరుకుని... అది మత్తడి దుంకితే దిగువన ఉన్న మూసీలోకి నీరు చేరుతుంది. ఈ క్రమంలో 2015లో కేసీఆర్ ప్రభుత్వం మిషన్ కాకతీయ కింద రూ.61 లక్షలతో ఇందిరాసాగర్ అభివృద్ధి, మరమ్మతు పనులను కూడా చేపట్టడంతో అదో పర్యాటక ప్రాంతంగా మారింది.

'రియల్' పనులతో ముప్పు...

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామ పరిధిలోని సర్వేనెంబర్లు 261, 260-281 వరకు 586 ఎకరాల భూములు ఉన్నాయి. ఇందులో పలు సంస్థలకు చెందిన పట్టా భూములతో పాటు ప్రభుత్వం రైతులకు పంపిణీ చేసిన సీలింగ్ పట్టా భూములు కూడా ఉన్నాయి. ఇందులో ప్రధానంగా 279, 280, 281 సర్వేనెంబర్ల మీదుగానే నాగన్‌పల్లి నుంచి దిగువన ఉన్న అనాజ్‌పూర్ పరిధిలోని ఇందిరాసాగర్‌కు వరద నీరు వెళ్లే మార్గం ఉంది. ఇది సుమారు వంద ఫీట్ల మేర వెడల్పుతో ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో కేవలం ఈ మార్గమే 18.12 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. నిబంధనల ప్రకారం బఫర్ జోన్ కూడా ఉంటుంది. అయితే పక్కనే ఉన్న భూములను అభివృద్ధి చేయడంలో భాగంగా గుట్టలన్నింటినీ భారీ యంత్రాలతో చదును చేస్తున్నారు. ఈ క్రమంలో పెద్ద పెద్ద బండరాళ్లు, భారీ ఎత్తున మట్టిని బఫర్‌జోన్, వరద వెళ్లే మార్గంలో పోస్తున్నారు. ఈ పనులు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి. ముమ్ముందు ఇంకా అనేక గుట్టలను తవ్వాల్సి ఉండటంతో ఇందిరాసాగర్‌కు ప్రమాదఘంటికలు మోగుతున్నాయి. ఈ మార్గం మూసుకుపోతే వందల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారడంతో పాటు భూగర్భజలాలకూ నష్టం వాటిల్లుతుంది. దిగువన ఉన్న అనాజ్‌పూర్ చెరువుకు కూడా వరద నీరు వచ్చే మార్గముండదు. వాస్తవానికి నీటిపారుదల శాఖ అధికారులు ఇప్పటికే స్పందించి ఇందిరాసాగర్, వరద నీరు వచ్చే మార్గం, బఫర్‌జోన్ పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ ఎవరూ అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కాగా అనాజ్‌పూర్ గ్రామ పరిధిలోని పలు సర్వేనెంబర్ల పరిధిలో 586 ఎకరాలు ఉండగా... అందులో సుమారు 146.35 ఎకరాల మేర సీలింగ్ భూములు ఉన్నాయి. అయితే ఇదంతా ఒకేచోట లేదు. పలు సర్వేనెంబర్లలో కొంత, కొంత ఉంది. ఈ నేపథ్యంలో పట్టా భూముల అభివృద్ధిలో భాగంగా సీలింగ్ భూములు ఉన్న గుట్టలను కూడా చదును చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కోర్టుకు వ్యవసాయ బదిలీల వివాదం

హైదరాబాద్, ఆగస్టు 13(నమస్తే తెలంగాణ): వ్యవసాయ శాఖలో బదిలీల వివాదం కోర్టుకు చేరింది. బదిలీల్లో తమకు అన్యాయం జరుగుతున్నదంటూ కొంతమంది అధికారులు కోర్టును ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే 42 మంది ఉద్యోగులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసినట్టు తెలిసింది. సీనియార్టీ జాబితా తప్పుల తడకగా ఉందంటూ కొందరు, బదిలీకి అవకాశం ఉన్నప్పటికీ బదిలీ చేయడం లేదంటూ మరికొందరు ఇలా ఒక్కొక్కరూ ఒక్కో కారణంతో కోర్టును ఆశ్రయిస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగానే వ్యవసాయ శాఖలో బదిలీల గందరగోళం కొనసాగుతూనే ఉన్నది. బదిలీల ప్రక్రియ ప్రారంభమై 40 రోజులు గడుస్తున్నప్పటికీ నేటికి పూర్తి కాలేదు. దీంతో ఉద్యోగుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

ఫీజుల నియంత్రణకు తీసుకున్న చర్యలేమిటి?

- సమగ్రంగా కౌంటర్లు దాఖలు చేయండి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంపై సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీచేసింది. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు 1994 లో జారీచేసిన జీవో-1, 2023లో జారీచేసిన ప్రొసీడింగ్స్ అమలు గురించి తెలపాలని కోరింది. ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం, ఐసీడీఎస్ పథకం అమలుపై కూడా పూర్తి వివరాలు నివేదించాలని ఆదేశించింది. జీవో 1 అమలుపై హైదరాబాద్‌కు చెందిన కే అఖిల్‌శ్రీ గురుతేజ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాదే, జస్టిస్ శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ప్రతివాదులైన కేంద్ర, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖలు, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, జిల్లా విద్యాశాఖాధికారులు, ఆహార భద్రతా కమిషనర్ తదితరులకు నోటీసులు ఇచ్చింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

అసిస్టెంట్‌కు ఎర.. చిక్కిన సొర

మొదటిపేజీ తరువాయి...

నుంచి సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి రంగారెడ్డి అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి ఫోన్ చేశాడు. 'సార్ మనం అనుకున్న డబ్బులు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పుడే లెక్కించా. రూ.8 లక్షలు బరాబర్ ఉన్నాయి. ఇప్పుడేం చేయాలి?' అని అడిగాడు. మరి కొన్ని గంటల్లో ఆ నోట్ల కట్టలు ఇంటికి వస్తాయంటూ సంబురపడ్డ అదనపు కలెక్టర్.. పెద్ద అంబర్‌పేట ఓఆర్ఓర్ వద్దకు ఆ డబ్బులను తీసుకొని రా అని హుకుం జారీచేశాడు. అదే రోజు సమయం రాత్రి 10:41 గంటలు. ఏసీబీ టీంతో మదన్‌మోహన్‌రెడ్డి అక్కడికి చేరుకున్నాడు. లొకేషన్‌కు వచ్చానని ఫోన్‌చేశాడు. ఈలోపు ఏసీబీ టీం కొంత దూరాన మాటువేసింది. తీరా భూపాల్‌రెడ్డి రానే వచ్చారు. మదన్‌మోహన్‌రెడ్డి నుంచి డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వెంటనే పట్టుకున్నారు. దీంతో అదనపు కలెక్టర్ బండారం మొత్తం బయటపడింది.



అసిస్టెంట్ కలెక్టర్ భూపాల్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న ఏసీబీ

నిషేధిత జాబితాలోని భూమిని తొలగించేందుకు రూ.8 లక్షలు డిమాండ్ చేసి రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి ఏసీబీకి అడ్డంగా దొరికిపోయారు. రంగారెడ్డి జిల్లా గుర్రంగూడకు చెందిన జక్కిడి ముత్యంరెడ్డికి సంబంధించిన 14 గుంటల భూమి నిషేధిత జాబితాలో చేరింది. ఆ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలంటూ తహసీల్దార్‌కు అర్జీ పెట్టుకున్నారు. తహసీల్దార్ పరిశీలన తర్వాత ఆర్డీవో ఆమోదం పొందాక.. సదరు ఫైలు గత జూన్ 26న రంగారెడ్డి జిల్లా అదనపు(రెవెన్యూ) కలెక్టర్ భూపాల్‌రెడ్డి పరిశీలనకు వచ్చింది. నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు అదనపు కలెక్టర్ రూ.8 లక్షలు అడుగుతున్నారని.. ఈ-సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి లంచం డిమాండ్ చేశారు. ఒక్క పైసా తగ్గినా పనికాదని కరాఖండీగా చెప్పటంతో బాధితుడు వారం క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో ఆ అవినీతి అధికారులను పట్టుకొనేందుకు ఏసీబీ పక్కా స్కెచ్ వేసింది. వల వేసి అదనపు (రెవెన్యూ) కలెక్టర్ భూపాల్‌రెడ్డి, ఈ-సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డిని పట్టుకున్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి ఏసీబీ కోర్టుకు తరలించారు.

రాత్రంతా హైడ్రామా

పెద్ద అంబర్‌పేట్ ఓఆర్ఆర్ వద్ద రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నాక వారిద్దరిని అదే రాత్రి కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు ఏసీబీ అధికారులు తరలించారు. రాత్రంతా కార్యాలయంలోనే ఉంచి సోదాలు నిర్వహించారు. పలు రికార్డులను పరిశీలించారు. ఆ తర్వాత మంగళవారం తెల్లవారుజామున నాగోల్‌లోని భూపాల్‌రెడ్డి ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.16 లక్షల నగదుతోపాటు పలు కీలకపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయ పనివేళలో కలెక్టరేట్‌లో మరోసారి సోదాలు నిర్వహించారు. సోదాలు జరుగుతున్నంత సేపు కలెక్టరేట్ దరిదాపుల్లోకి జిల్లా స్థాయి అధికారులెవరూ రాలేదు.

14 రోజుల రిమాండ్

నాంపల్లి కోర్టులు: అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డిని ఏసీబీ అధికారులు మంగళవారం నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టగా.. ధరణి వెబ్‌సైట్‌లో ప్రొహిబిటెడ్ లిస్ట్ నుంచి 14 గుంటల భూమిని తొలగించాలని కోరడంతో ఈ పని కోసం జాయింట్ కలెక్టర్ ఆదేశానుసారం తాను రూ.8 లక్షలు డిమాండ్ చేశానని సీనియర్ అసిస్టెంట్ వెల్లడించారు. కోర్టు వారిద్దరికి 14 రోజుల రిమాండ్ విధించింది. నిందితులను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

జీఎస్టీ అధికారులపై కేసు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : నగరంలో ఉన్న జీఎస్టీ కమిషనరేట్‌లో లంచం ఆరోపణలపై ఇద్దరు అధికారులపై సీబీఐ కేసు నమోదు చేసింది. జీఎస్టీ డిపార్టుమెంట్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు ఒక పని విషయంలో రూ.5 లక్షల లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు బాధితుడు సీబీఐకి ఫిర్యాదులో చేశాడు. ఈ మేరకు హైదరాబాద్‌లోని రెండు చోట్ల సీబీఐ సోదాలు నిర్వహించగా నేరారోపణ పత్రాలు లభించాయి.

కాంగ్రెస్‌లో 'యూత్' రగడ!

- రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపికలో వర్గపోరు
- రెండు వర్గాల నేతల నడుమ తీవ్ర పోటాపోటీ
- రంగంలోకి కాంగ్రెస్ సీనియర్ నేతల వారసులు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో మరో కొత్త రగడ మొదలైంది. యూత్ కాంగ్రెస్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడి నియామకానికి పోటాపోటీ రాజకీయం నడుస్తున్నది. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉండటంతో ఆ పోస్టుకు ప్రాధాన్యం పెరిగింది. ఇటు రాష్ట్ర స్థాయిలో, అటు జిల్లా స్థాయిలో నేతలను పార్టీ నేతలు రెండు వర్గాలుగా చీల్చినట్టు చర్చ జరుగుతున్నది. గతంలో రాష్ట్ర స్థాయి నేతల నిర్ణయంతో అధ్యక్షుల ఎంపిక పూర్తికాగా ఇప్పుడు పలువురు నేతలు ఏకంగా ఢిల్లీ స్థాయిలో పైరవీలు చేస్తున్నట్టు ప్రచారం. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి ఇటీవల శాట్ చైర్మన్‌గా నియమితులయ్యారు. దీంతో తన అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. దీంతో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపికకు కాంగ్రెస్ చర్యలు చేపట్టింది. యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ బంధువు పొన్నం తరుణ్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి కూతురు ఆంక్షారెడ్డి, ఎల్బీనగర్ కాంగ్రెస్ నేత జక్కిడి ప్రభాకర్‌రెడ్డి కుమారుడు శివచరణ్ రెడ్డి తదితరులు పోటీలో నిలిచారు. వీరితోపాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సామ్రాట్ వంశీ, దీపక్ ప్రగ్య కూడా పోటీ పడుతున్నారు. ఈ పదవికి పలువురు సీనియర్ నేతల వారసులు, అనుయాయులు రంగంలోకి దిగడంతో తీవ్ర పోటీ నెలకొన్నది. ఎవరికి వారు తమ అనుయాయులను అధ్యక్షుడిగా చేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే సీనియర్ నేతలు కూడా రెండుగా చీలినట్టు తెలిసింది. జిల్లాల్లో అయితే ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య ఈ అంశం చిచ్చుపెట్టినట్టు తెలుస్తున్నది. కీలక నేతల మధ్య కూడా వైరం నడుస్తున్నది. పీసీసీకి త్వరలోనే కొత్త అధ్యక్షుడిని కాంగ్రెస్ అధిష్ఠానం నియమించనున్నది. ఈ నేపథ్యంలో వచ్చే కొత్త అధ్యక్షుడు వారికి నచ్చిన వారిని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమిస్తారనే ప్రచారమూ జరుగుతున్నది.



తెలంగాణ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా వెంకటస్వామి

తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా యడవెల్లి వెంకటస్వామిని ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) నియమించింది. మరో ఎనిమిది రాష్ట్రాలలో కూడా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులను నియమించింది. ఈ మేరకు మంగళవారం ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటన విడుదల చేశారు. బీహార్‌కు జయశంకర్‌ప్రసాద్, చండీగఢ్‌కు సికిందర్ బూర, ఢిల్లీకి అశిష్ లంబా, హిమాచల్‌ప్రదేశ్‌కు అభినందన్ ఠాకూర్, జార్ఖండ్‌కు బినయ్ ఓరాన్, మణిపూర్‌కు జాయ్‌సన్ కేహెచ్, ఒడిశాకు ఉదిత్‌నారాయన్ ప్రధాన్, పశ్చిమబెంగాల్‌కు ప్రియాంక చౌదరీని నియమించారు.

కొత్త పంచాయతీలు 223

- 12,991కి చేరిన పంచాయతీలు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్తగా 223 గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్తగా 223 గ్రామ పంచాయతీలను చేయాలని ప్రతిపాదిస్తూ అసెంబ్లీ, మండలి బిల్లును ఆమోదించాయి. ఆ బిల్లును అప్పటి గవర్నర్ తమిళిసై పెండింగ్‌లో పెట్టారు. గత గవర్నర్ ఆమోదం తెలపడంతో కొత్త పంచాయతీలపై ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పంచాయతీల ప్రకారం జీపీల్లో ఎన్నికలు జరగనున్నాయి. కొత్త పంచాయతీల స మాచారాన్ని పంచాయతీరాజ్‌శాఖ అధికారులు జిల్లాలకు చేరవేశారు. ఇప్పటి వరకు 12,769 గ్రామ పంచాయతీలుండగా కొత్తగా 223 పంచాయతీలను ఏర్పాటు చేశారు. మొత్తంగా 12,992 పంచాయతీలకు చేరాయి. వీటిలో ములుగు జిల్లా కేం ద్రాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గ్రామాల సంఖ్య 12,991కు చేరింది.

రాజగోపాల్‌రెడ్డిని మంత్రి అనే అనుకోండి

- ఆర్టీసీ అధికారులతో మంత్రి పొన్నం
- అన్న అంటే నేను మంత్రినే: రాజగోపాల్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 13(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎవరికివారే మంత్రి అన్నట్టుగా పరిస్థితి తయారైంది. చివరకు అసలు మంత్రులు కూడా ఇతర ఎమ్మెల్యేలను వీరిని మంత్రులుగా భావించండి అంటూ అధికారులతో చెప్తున్న పరిస్థితి కనిపిస్తున్నది. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మధ్య ఆర్టీసీ అధికారుల సమక్షంలో సాగిన ఎపిసోడ్ ఇందుకు తాజా ఉదాహరణ. రాజగోపాల్‌రెడ్డి రెండు రోజుల క్రితం తన నియోజకవర్గంలో ఆర్టీసీ బస్సుల సమస్యపై మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి చెప్పిన అంశాలను పరిష్కరించాలని అధికారులకు సూచిస్తూ, 'రాజగోపాల్‌రెడ్డిని మంత్రి అని అనుకొనే పని చేయండి..' అని పొన్నం వ్యాఖ్యానించారు. దీనిపై రాజగోపాల్‌రెడ్డి స్పందిస్తూ.. 'నన్ను అన్న మంత్రి అన్నడంటే.. నేను మంత్రినే' అని చెప్పారు. దీంతో అక్కడ రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవిపై చర్చ జరిగింది. త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో తనకు మంత్రి పదవి వస్తుందనేది రాజగోపాల్‌రెడ్డి ఆశ.

ఆస్తి కోసం తండ్రిపై కూతురి దాడి

- భర్త, మరికొందరితో కలిసి కాళ్లు విరగ్గొట్టిన తనయ

కృష్ణ కాలనీ, ఆగస్టు13: ఆస్తి కోసం కన్న తండ్రిపైనే దాడి చేసి కాళ్లు విరగ్గొట్టింది ఓ కూతురు. ఈ ఘటన మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కారల్‌మార్క్స్ కాలనీలో వెలుగుచూసింది. సింగరేణి విశ్రాంత కార్మికుడు వేల్పుల మల్లేశ్.. లక్ష్మారెడ్డిని దత్తత తీసుకొని తన చిన్న కూతురు మహేశ్వరితో వివాహం చేశాడు. దీంతో మల్లేశ్ మొత్తం ఆస్తిని కూతురు, అల్లుడు తీసుకున్నారు. కొన్ని ఫిక్స్‌డ్ బాండ్లు, 2 గుంటల భూమి మాత్రమే మల్లేశ్ వద్ద ఉండగా.. అవి కూడా తమకే ఇవ్వాలని, లేదంటే చంపుతామని కొంతకాలంగా బెదిరిస్తున్నారు. సోమవారం సాయంత్రం కూతురు, అల్లుడితోపాటు మరో నలుగురు వచ్చి మల్లేశ్‌ను కదలకుండా పట్టుకొని రెండు కాళ్లు విరిగేలా తీవ్రంగా కొట్టారు. లేవలేని స్థితిలో ఉండటంతో జిల్లా కేంద్రంలోని 100 పడకల దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ తమ నాన్న మెట్ల మీదికి వెళ్లి అడ్డం పడ్డాడని కూతురు చెప్పగా.. పరీక్షించిన వైద్యులు మల్లేశ్‌కు రెండు కాళ్లు విరిగాయని, ఎవరో తీవ్రంగా కొట్టడంతోనే ఇలా జరిగిందని చెప్పడంతో అక్కడి నుంచి జారుకుంది. భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో మల్లేశ్ ఫిర్యాదు చేయడంతో కూతురు మహేశ్వరి, అల్లుడు లక్ష్మారెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు.



భూపాలపల్లి దవాఖానలో చికిత్స పొందుతున్న వేల్పుల మల్లేశ్

ఒత్తిడితెచ్చి నమోదుచేసే అభియోగాలు చెల్లవు

- అప్రూవర్లు, సాక్షుల వాంగ్మూలాల వీడియోలు ఇవ్వండి
- ఎమ్మెల్సీ కవిత కేసులో న్యాయవాది వాదనలు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం విధానం కేసుకు సంబంధించి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిర్దోషి అని ఆమె తరపు న్యాయవాది మోహిత్‌రావు వాదించారు. మంగళవారమిక్కడ రౌస్ ఎవెన్యూ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఎదుట కవితను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరు పరిచారు.


ఈ సందర్భంగా కవిత కస్టడీ పొడిగింపుపై వాదనలు జరిగాయి. కవిత తరపు న్యాయవాది మోహిత్‌రావు తన వాదనలు వినిపిస్తూ.. అప్రూవర్లు, సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాన్ని పరిగణనలోకి తీసుకొని కవితపై సీబీఐ, ఈడీలు కేసులు నమోదు చేశాయని చెప్పారు. సెక్షన్ 50 పీఎంఎల్ఏ కింద సాక్షులపై ఒత్తిడి తెచ్చి తప్పుడు వాంగ్మూలాలను నమోదు చేశారని ఆరోపించారు. సాక్షులు, అప్రూవర్ల వాంగ్మూలాన్ని నమోదు చేసే సమయంలో చిత్రీకరించిన వీడియో, ఆడియోలను ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. శరత్ చంద్రారెడ్డి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కవితపై ఈడీ ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. శరత్ చంద్రారెడ్డితో కవితకు ఆర్థిక లావాదేవీలు జరిగాయని ఈడీ ఆరోపిస్తున్నదని, వారిద్దరికీ అనేక సంవత్సరాలుగా పరిచయం ఉన్నదని, ఆమెతో ఆర్థిక లావాదేవీలు కూడా ఉన్నాయని మోహిత్‌రావు చెప్పారు. ఆర్థిక లావాదేవీలన్నీ బ్యాంకు ద్వారానే జరిగాయని, దీంట్లో గోప్యత ఏమీ లేదని తెలిపారు. వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి విచారణను సెప్టెంబర్ రెండో తేదీకి వాయిదా వేసింది.



50వ వార్షికోత్సవం సందర్భంగా సంగీత మొబైల్స్ రిటైల్ స్టోర్‌లో వివో 40, వివో 40 ప్రొ స్మార్ట్‌ఫోన్లను రాష్ట్ర మార్కెట్లోకి విడుదల చేస్తున్న ప్రముఖ నటి అనన్య నాగళ్ల. చిత్రంలో సంగీత మొబైల్స్ తెలంగాణ బిజినెస్ హెడ్ రాజేశ్ కట్ల, తదితరులు

కొనుగోళ్లకు దూరంగా..

79 వేల దిగువకు సెన్సెక్స్
ఒక్కరోజే 693 పాయింట్లు పతనం
208 పాయింట్లు దిగజారిన నిఫ్టీ
అమ్మకాల ఒత్తిడిలో మదుపరులు
రూ.4.52 లక్షల కోట్ల సంపద ఆవిరి



న్యూఢిల్లీ, ఆగస్టు 13: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలకు లోనయ్యాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 692.89 పాయింట్లు లేదా 0.87 శాతం క్షీణించి 79 వేల స్థాయికి దిగువన 78,956.03 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 759.54 పాయింట్లు పడిపోయింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 208 పాయింట్లు లేదా 0.85 శాతం కోల్పోయి 24,139 వద్ద స్థిరపడింది. విదేశీ మదుపరుల పెట్టుబడుల ఉపసంహరణల మధ్య హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్బీఐ, ఐటీసీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ విలువ అత్యధికంగా 3 శాతానికిపైగా పడింది.

రంగాలవారీగా..

కమోడిటీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌ను ఇన్వెస్టర్లు దూరం పెట్టారు. 1.84 శాతం నుంచి 1.45 శాతం మేర కోల్పోయాయి. మెటల్, సర్వీసెస్, క్యాపిటల్ గూడ్స్ షేర్లూ మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి. 1.37 శాతం నుంచి 0.84 శాతం మేర పడిపోయాయి. అలాగే బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 1.16 శాతం, మిడ్‌క్యాప్ 0.98 శాతం తగ్గాయి. నిజానికి ఈక్విటీ మార్కెట్లు ఉదయం ఆరంభంలో స్వల్ప నష్టాలతోనే మొదలయ్యాయి. అయితే సమయం గడుస్తున్నకొద్దీ నష్టాలు పెరుగుతూపోయాయి. జూలై నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఆకర్షణీయ స్థాయిలో తగ్గుముఖం పట్టినా.. జూన్ నెలలో పారిశ్రామికోత్పత్తి సూచీ పతనం కావడం.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

గ్లోబల్ మార్కెట్లలో..

అంతర్జాతీయ మార్కెట్ల విషయానికొస్తే.. ఆసియా ప్రధాన మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఐరోపాలోని కీలక సూచీలైన జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ కూడా లాభాల్లోనే కదలాడుతున్నాయి. సోమవారం అమెరికా మార్కెట్లు మిశ్రమంగా ముగిసిన విషయం తెలిసిందే. ఈ ఒక్కరోజే విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) రూ.4,680.51 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు.

మార్కెట్ విలువ క్షీణత

వరుస నష్టాల్లో కదలాడుతున్న స్టాక్ మార్కెట్లలో మదుపరుల సంపద క్రమేణా ఆవిరైపోతున్నది. ఈ ఒక్కరోజే రూ.4.52 లక్షల కోట్లు హరించుకుపోయింది. బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.4,52,565.44 కోట్లు క్షీణించి రూ.4,45,30,265.42 కోట్ల (5.30 ట్రిలియన్ డాలర్లు)కు తగ్గింది. సోమవారం కూడా భారీ నష్టాలనే అందుకున్నా.. ఆఖర్లో సూచీలు కోలుకున్నాయి. దీంతో నష్ట తీవ్రత స్వల్పంగానే ఉన్నది.

నష్టాల్లోనే అదానీ గ్రూప్ షేర్లు

అదానీ గ్రూప్ అక్రమాల వ్యవహారంలో సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బచ్‌పై అమెరికా షార్ట్-సెల్లర్ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ చేసిన ఆరోపణల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లలో అదానీ సంస్థల షేర్లు నష్టాలను ఎదుర్కొంటున్నాయి. బీఎస్ఈలో మంగళవారం కూడా 10 షేర్లలో 7 నష్టాలకే పరిమితం కావాల్సి వచ్చింది. అదానీ టోటల్ గ్యాస్ (1.94 శాతం), అదానీ గ్రీన్ ఎనర్జీ (1.38 శాతం), అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ (0.70 శాతం) షేర్లు మాత్రమే లాభాల్లో ముగిశాయి. అదానీ విల్మర్ (2.37 శాతం), అదానీ ఎంటర్‌ప్రైజెస్ (1.92 శాతం), అంబుజా సిమెంట్స్ (1.86 శాతం), అదానీ పోర్ట్స్ (1.24 శాతం), ఏసీసీ (0.54 శాతం), అదానీ పవర్ (0.20 శాతం), ఎన్డీటీవీ (0.20 శాతం) నష్టపోయాయి. సోమవారం కూడా 8 షేర్లు నష్టపోయిన సంగతి విదితమే.

బీవోబీ మాన్‌సూన్ డిపాజిట్ స్కీం

399 రోజుల కాలపరిమితి డిపాజిట్లపై 7.25 శాతం వడ్డీ ఆఫర్

న్యూఢిల్లీ, ఆగస్టు 13: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) డిపాజిట్‌దారులకు ప్రత్యేక స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది. మాన్‌సూన్ ధమాఖా పేరుతో ప్రవేశపెట్టిన ఈ స్కీం కింద అత్యధిక వడ్డీని ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. 399 రోజుల కాలపరిమితితో డిపాజిట్ చేసినవారికి 7.25 శాతం వడ్డీను చెల్లించనున్నది. అలాగే 333 రోజుల కాలపరిమితి కలిగిన మరో డిపాజిట్ స్కీంపై కూడా 7.15 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. దీంతోపాటు ఈ నెల 13 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల డిపాజిట్లపై వడ్డీరేట్లలో పలు మార్పులు చేసింది. ఏడు రోజుల నుంచి 10 ఏండ్లలోపు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేటు 4.25 శాతం నుంచి 7.25 శాతం మధ్యలో చెల్లిస్తున్నది. సీనియర్ సిటిజన్లకు మరో అర శాతం అధనంగా 4.75 శాతం మొదలుకొని 7.75 శాతం గరిష్ఠ స్థాయిలో ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. రూ.3 కోట్ల లోపు డిపాజిట్లకు మాత్రమే ఈ ఆఫర్ వర్తించనున్నదని పేర్కొంది. అలాగే ఇప్పటికే ఫెడరల్ బ్యాంక్, పీఎన్‌బీ, కర్ణాటక బ్యాంక్, యూబీఐలు తమ వడ్డీరేట్లలో మార్పులు చేశాయి కూడా.

వెంటనే స్పామ్ కాల్స్‌పై వేటేయండి!

టెలికం కంపెనీలకు ట్రాయ్ ఆదేశం



న్యూఢిల్లీ, ఆగస్టు 13: స్పామ్ కాల్స్‌తో ఇబ్బందులు పడుతున్న వారికి భారీ ఊరట లభించినట్లు అయింది. వీటిని నియంత్రించడానికి టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ ఇప్పటికే నడుం బిగించగా..తాజాగా వీటికి సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేసింది. రిజిస్టర్ కానీ టెలి మార్కెట్ సేవలు అందిస్తున్న సంస్థల నుంచి వచ్చే కాల్స్‌ను వెంటనే నిలిపివేయాలని టెలికం సంస్థలకు ట్రాయ్ స్పష్టంచేసింది. ప్రమోషనల్, ప్రీ రికార్డెడ్, కంప్యూటర్ జనరేటెడ్ కాల్స్‌ను వెంటనే నిలిపివేసేతే ఆదేశాలు అమలు చేయాలని, దీనిపై క్రమం తప్పకుండా నివేదిక అందచేయాలని ఆదేశించింది. ప్రతినెల 1న, 16వ తేదీన ఇందుకు సంబంధించి డాటాను సమర్పించాలని సూచించింది. స్పామ్ కాల్స్‌పై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ట్రాయ్ ఈ ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై రెండేండ్ల పాటు యాక్సెస్‌ను నిలిపివేస్తామని, బ్లాక్ లిస్ట్‌లో పెడతామని హెచ్చరించింది. స్పామ్ కాల్స్‌పై గత వారం బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా, టాటా టెలి సర్వీసెస్ తదితర టెలికం కంపెనీల చీఫ్ రెగ్యులేటరీ ఆఫీసర్లతో ట్రాయ్ చీఫ్ సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో తాజా ఆదేశాలు వెలువడటం గమనార్హం.

73 వేల దిశగా పసిడి

న్యూఢిల్లీ, ఆగస్టు 13: బంగారం ధరలు మరింత ప్రియమవుతున్నాయి. అంతర్జాతీయంగా, దేశీయంగా ఆభరణాలకు డిమాండ్ నెలకొనడంతో పుత్తడి ధర బుధవారం కూడా భారీగా పెరిగి రూ.73 వేల దిశగా పయనిస్తున్నది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధరూ.500 అధికమై రూ.72,850 పలికింది. అయినప్పటికీ వెండి ధర రూ.83,500 వద్ద ఫ్లాట్‌గా ముగిశాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. ఇటు హైదరాబాద్‌లో పుత్తడి ధర రూ.1,040 ఎగబాకి రూ.71,620 పలికింది.

బిజినెస్ క్లాస్‌కు పెరుగుతున్న డిమాండ్

ఇప్పటికే ఆఫర్ చేస్తున్న ఎయిర్ ఇండియా, విస్తారా..త్వరలో ఇండిగో



న్యూఢిల్లీ, ఆగస్టు 13: భారత్‌లో బిజినెస్ క్లాస్‌లో విమాన ప్రయాణం చేసే వారి సంఖ్య నానాటికి పెరుగుతున్నది. ప్రయాణ సౌలభ్యం కోసం బిజినెస్ క్లాస్‌లో ప్రయాణించేందుకు చాలా మంది మొగ్గు చూపిస్తున్నారు. దీంతో ఈ తరగతి ప్రయాణికులను ఆకట్టుకోవడానికి విమాన రంగ సంస్థల మధ్య తీవ్ర పోటీ నెలకొన్నది. ఇప్పటికే ఎయిర్ ఇండియా, విస్తారా సంస్థలు ఈ బిజినెస్ క్లాస్ ప్రయాణ సేవలు అందిస్తుండగా..తాజాగా దేశీయ విమానయాన దిగ్గజం ఇండిగో కూడా వీటికి పోటీకి సిద్ధమైంది. నవంబరు నుంచి 'ఇండిగోస్ట్రెచ్' పేరిట బిజినస్ క్లాస్ సేవలు అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు ప్రకటించింది. ఢిల్లీ నుంచి దేశంలోని వివిధ మెట్రో నగరాలకు ప్రయాణించే 12 విమానాల్లో మొదట బిజినెస్ క్లాస్ సీట్లను ఏర్పాటు చేయనుంది.

ఆకట్టుకున్న అపోలో

హైదరాబాద్, ఆగస్టు 13: అపోలో హాస్పిటల్స్ ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను రూ.రూ.5,068 కోట్ల ఆదాయంపై రూ.305 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. 2023-24 ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.4,418 కోట్ల ఆదాయంపై రూ.167 కోట్ల లాభాన్ని గడించింది. నికర లాభం 83 శాతం వృద్ధిని కనబరిచినట్లు అపోలో గ్రూపు చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి తెలిపారు. కంపెనీ షేరు ధర 1.26 శాతం బలపడి రూ.6,586.55 వద్ద ముగిసింది.

JOS ALUKKAS

జోస్ ఆలుకాస్‌లో 60 ఏండ్ల వేడుకలు

- **6 కోట్ల విలువైన బహుమతులు**

త్రిస్సూర్, ఆగస్టు 13: దేశీయ రిటైల్ నగల వ్యాపారంలో అగ్రగామి సంస్థ జోస్ ఆలుక్కాస్.. 60 ఏండ్ల వేడుకలకు వేదికైంది. 1964లో కేరళలోని త్రిస్సూర్‌లో మొదలైన ఈ సంస్థ.. తెలంగాణ, ఏపీసహా దక్షిణాది రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున విస్తరించింది. గల్ఫ్‌లోనూ వ్యాపార కార్యకలాపాలు చేస్తున్నది. ఈ క్రమంలోనే ఇప్పుడు 60వ వార్షికోత్సవాలను జరుపుకొంటున్నది. ఇందులో భాగంగా తమ కస్టమర్లకు రూ.6 కోట్ల విలువైన బహుమతులను అందిస్తున్నది. వీటిలో 6 ఎంజీ ఆస్టర్ కార్లతోపాటు వివిధ రకాల గృహోపకరణాలు, బంగారు నాణేలూ ఉన్నాయి. అంతేగాక వజ్రాభరణాలపై 20 శాతం, ప్లాటినం నగలపై 7 శాతం తగ్గింపునూ పొందవచ్చు. ఆకర్షణీయ రీతిలో డైమండ్ జ్యుయెల్లరీ ఎక్స్ఛేంజ్ ఆఫర్ కూడా అందుబాటులో ఉన్నది.

హీరో లాభం 1,032 కోట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 13: ద్విచక్ర వాహన సంస్థ హీరో మోటోకార్ప్ లాభాలు టాప్‌గేర్‌లో దూసుకుపోయాయి. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను పన్నులు చెల్లించిన తర్వాత రూ.1,032 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.701 కోట్లతో పోలిస్తే 47 శాతం వృద్ధిని కనబరిచింది. అమ్మకాలు భారీగా పుంజుకోవడం వల్లనే ఆకర్షణీయమైన లాభాలు నమోదుచేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.8,851 కోట్ల నుంచి రూ.10,211 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది.

రెయిన్‌బో ప్రాఫిట్ డౌన్

హైదరాబాద్, ఆగస్టు 13: రెయిన్‌బో హాస్పిటల్స్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రవేశపెట్టింది. జూన్ త్రైమాసికానికిగాను కంపెనీ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 4 శాతం తగ్గి రూ.40 కోట్లకు పరిమితమైంది. ఆదాయం మాత్రం 15 శాతం ఎగబాకి రూ.330 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. గత త్రైమాసికంలో కొత్తగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలలో ఆసుపత్రులను ప్రారంభించడం కొత్తగా 280 పడకలు అందుబాటులోకి రానున్నాయి.

ప్రభుత్వ దవాఖానలకు సుస్తీ



కామారెడ్డి ఏరియా దవాఖానలో ఓపీ రోగుల అవస్థలు

- రాష్ట్ర వ్యాప్తంగా ఇదే దుస్థితి
- విజృంభిస్తున్న విష జ్వరాలు
- పేదలకు అందని మెరుగైన వైద్యం
- బెడ్లు లేక అవస్థలు..

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 13: సర్కార్ వైద్యం పేదలకు అందని ద్రాక్షగా మారింది. రాష్ట్రంలోని ఏ దవాఖాన చూసిన ఏమున్నది గర్వకారణం అన్నట్టు ఉన్నది. వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తున్నది. ఉన్న వైద్యులు, సిబ్బంది సైతం సమయపాలన పాటించక పోవడంతో రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. యంత్రాలు పనిచేయక పేదలకు సరైన సేవలు అందడం లేదు. ఇన్‌పేషంట్లు పెరుగుతున్నా అందుకు అనుగుణంగా బెడ్లు లేకపోవడంతో ఒకే బెడ్డుపై ఇద్దరికి వైద్యం అందించాల్సిన దుస్థితి నెలకొన్నది. నిర్వహణ సరిగా లేక దవాఖానల్లోని మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. ఆవరణల్లో సైతం ఎక్కడి చెత్త అక్కడే అన్నట్టుగా ఉన్నది. ఉత్తర తెలంగాణ ప్రజలకు గుండెకాయ వంటి వరంగల్ ఎంజీఎం దవాఖానను సమస్యల జబ్బు వెంటాడుతున్నది. వైద్యులు, సిబ్బంది, యంత్రాలు అందుబాటులో ఉన్నా నిర్దేశిత టెస్ట్‌లు జరగటం లేదు. మందులు, ఇంజక్షన్లు, వీల్‌చైర్లు, ట్రాలీల కొరత ఉన్నది. కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అత్యవసర సేవలు కలగానే మిగిలాయి. మానుకోట జిల్లాలో సగటున ప్రతి నాలుగిండ్లకు ఒక జ్వర బాధితుడు ఉన్నాడంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ జిల్లాలోని ఏజెన్సీ మండలాలైన గంగారం, కొత్తగూడ, బయ్యారం, గార్ల ఏజెన్సీ మండలాల్లో ఇంటికో జ్వర బాధితుడు ఉన్నాడు. ఆదిలాబాద్ రిమ్స్‌లో నర్సుల కొరత ప్రధాన సమస్యగా మారింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్ర దవాఖానలో అధునాతన సీటీ స్కానింగ్ యంత్రం వచ్చి నెలలు గడుస్తున్నా టెక్నీషియన్ లేక సేవలు ప్రారంభించలేదు. జనగామ జిల్లా దవాఖానలో కడుపునొప్పితో వెళ్తే డాక్టర్లు స్కానింగ్ కోసం బయటకు పంపుతున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ప్రధాన దవాఖానల్లో వైద్య సేవలు అధ్వానంగా మారాయి. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొన్నది.



సూర్యాపేట జిల్లా కేంద్ర దవాఖానలో ఒక్కో బెడ్‌పై ఇద్దరు రోగులకు చికిత్స

గ్రూప్-1 మెయిన్‌కు సర్వం సిద్ధం!

- అక్టోబర్ 21 నుంచి 27 వరకు పరీక్షలు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 మెయిన్ పరీక్షల నిర్వహణకు టీజీపీఎస్సీ సర్వం సిద్ధం చేస్తుంది. వివిధ ప్రభుత్వ శాఖలోని 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి జూన్ 9న ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించింది. జూలై మొదటి వారంలో 1:50 నిష్పత్తి ప్రకారం 32 వేల మంది అభ్యర్థులను మెయిన్‌కు ఎంపిక చేసింది. అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్ పరీక్షలు నిర్వహించనున్నది. 32 వేల మందికి పరీక్షలు నిర్వహించడానికి ప్రశ్నాపత్రాల రూపకల్పన, ఆన్సర్ షీట్ల తయారీలో అధికారులు నిమగ్నమయ్యారు. పరీక్షలను జీహెచ్‌ఎంసీ పరిధిలో నిర్వహించే అవకాశాలున్నాయి. ఓ వర్గానికి చెందిన నిరుద్యోగులు మాత్రం జీవో 29, ఇతర అంశాలపై న్యాయపోరాటాలు చేయనున్నట్టు తెలిసింది.

డీఎస్సీ 'కీ' విడుదల

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ పరీక్షల ప్రాథమిక కీతో పాటు రెస్పాన్స్‌షీట్లను అధికారులు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. 20లోగా అభ్యంతరాలు తెలపాలని సూచించారు. ప్రాథమిక కీ, రెస్పాన్స్ షీట్ల కోసం https:// tgdsc. aptonline. in/tgdsc వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎండీఎస్ కన్వీనర్ కోటా భర్తీకి వెబ్ ఆప్షన్స్

వరంగల్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): ఎండీఎస్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీ మొదటి విడత వెబ్ ఆప్షన్స్ ఈ నెల 13న మధ్యాహ్నం 3 నుంచి 15వ తేదీ మధ్యాహ్నం 3 వరకు నమోదు చేసుకోవాలని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ (http:// knruhs.telangana.gov.in) సందర్శించాలని వారు సూచించారు.

16న యూఎస్ ఎడ్యుకేషన్ ఫెయిర్

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): అమెరికా చదువుల సమాచారాన్ని అందించేందుకు అమెరికా ఎడ్యుకేషన్ ఫెయిర్ మాదాపూర్ ఐటీసీ కోహినూర్‌లో 16న సాయంత్రం 4:30 నుంచి రాత్రి 9:30 వరకు నిర్వహించనున్నారు. ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో యూజీ, పీజీ, డాక్టరేట్ ప్రోగ్రామ్‌కు సంబంధించిన సమాచారాన్ని పొందవచ్చని హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్ వర్గాలు వెల్లడించాయి. యూఎస్‌లోని 80 అక్రిడిటేడ్ వర్సిటీలు, కాలేజీల ప్రతినిధులు హాజరవుతారని, 17న చెన్నై, 18న బెంగళూరు, 19న కోల్‌కతా, 21న అహ్మదాబాద్, 22న పూణే, 24న ముంబై, 25న ఢిల్లీల్లో ఎడ్యుకేషన్ ఫెయిర్ జరుగతాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం https:// bit.ly/EdUSAFair24Emb లింకును సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్

- 2032 నాటికి 27వేల మెగావాట్లకు పీక్ డిమాండ్
- ప్రతి ఏటా 6% పెరుగుతున్న విత్యుత్తు అవసరాలు
- రోజువారీ వినియోగం 1.20 లక్షల మిలియన్ యూనిట్లకు చేరవచ్చు
- సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ అంచనా



భవిష్యత్తు డిమాండ్ ఇలా..

సంవత్సరం	భవిష్యత్తు డిమాండ్ అంచనా (మిలియన్ యూనిట్లు)	పెరుగుదల శాతం	పీక్ డిమాండ్ అంచనా (మెగావాట్లు)	పెరుగుదల శాతం
2023-24	77,053	0000	15,704	0000
2024-25	82,316	6.21%	16,877	7.47%
2025-26	87,414	6.19%	18,138	7.47%
2026-27	92,967	6.35%	19,529	7.67%
2027- 28	98,578	6.04%	20,968	7.37%
2028-29	1,0,4383	5.89%	22,488	7.25%
2029-30	1,10,971	6.31%	24,215	7.68%
2030-31	1,15,862	4.41%	25,639	5.88%
2031-32	1,20,549	4.05%	27,059	5.54%

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): కొత్త జిల్లాల ఏర్పాటు.. అభివృద్ధి విస్తరణ, పారిశ్రామికీకరణ వేగవంతం కావడంతో రాష్ట్రంలో ఏటా విద్యుత్తుకు డిమాండ్ పెరుగుతున్నది. భవిష్యత్తులోను సాలీనా ఆరు శాతం విద్యుత్తు డిమాండ్ పెరుగనుంది. 2032 నాటికి రాష్ట్రంలో విద్యుత్తు పీక్ డిమాండ్ 27 వేల మెగావాట్లకు చేరుతుందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) అంచనా వేసింది. 2023 -24లో పీక్ డిమాండ్ 15,704 మెగావాట్లుండగా, ఈ ఏడాది అది 16,877 మెగావాట్లకు చేరుతుందని సంస్థ అంచనా వేసింది. ఈ మేరకు మంగళవారం రిపోర్ట్ ఆన్ రిసోర్స్ అడిక్వసీ ప్లాన్ ఫర్ తెలంగాణ-2031-32 పేరుతో ఓ నివేదికను విడుదల చేసింది. రాష్ట్రంలో విద్యుత్తు అవసరాలు రానురాను పెరుగుతాయని, ఈ మేరకు రాష్ట్రంలో విద్యుత్తు సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరముందని సంస్థ సూచించింది. విద్యుత్తు డిమాండ్ తీవ్రంకానున్న నేపథ్యంలో కరెంట్ ఉత్పత్తిని రెట్టింపు చేయాల్సి ఉంది. దీనిని ముందుగా గమనించిన గత కేసీఆర్ ప్రభుత్వం నాలుగు వేల మెగావాట్ల సామర్థ్యం గల యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను చేపట్టింది. గతంలోనే భద్రాద్రి పవర్ ప్లాంట్‌ను అత్యంత వేగంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. అంతేకాకుండా సౌర విద్యుత్తు వినియోగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించింది.

సౌర విద్యుత్తుకు ప్రోత్సాహం

ప్రస్తుతానికి రాష్ట్రంలో స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 15,751 మెగావాట్లుగా ఉంది. దీంట్లో 7,558 మెగావాట్లు (48శాతం) థర్మల్ విద్యుత్తు కాగా, 2,448 మెగావాట్లు (15.5%) జల విద్యుత్తు. ఇక సోలార్ 5,228 మెగావాట్లు (33.2%) న్యూక్లియర్ 216 మెగావాట్లు (1.4%) బయోమాస్ 173 మెగావాట్లు (1.1%), విండ్ 128 (0.8%)గా ఉంది.

- రాష్ట్రంలో ప్రస్తుతం రోజువారీ వినియోగం 82 వేల మిలియన్ యూనిట్లు ఉండగా, ఇది రాబోయే రోజుల్లో లక్ష మిలియన్ యూనిట్లకు చేరనున్నది. 2031 -32కు వచ్చేసరికి ఇది. 1.20 లక్షల మిలియన్ యూనిట్లకు చేరనుంది.
- 2023 -24 నుంచి 2029 -30 వరకు ఏటా విద్యుత్తు డిమాండ్ 6 శాతం పెరగనుండగా, ఆ తర్వాత 4 శాతానికి తగ్గనుంది. ఇక పీక్ డిమాండ్ ఏటా 7శాతం పెరిగి, ఆ తర్వాత 6 శాతానికి చేరనుందని సీఈఏ అంచనావేసింది.
- రాష్ట్రంలో అత్యధిక డిమాండ్ డిసెంబర్ మాసం నుంచే మొదలవుతున్నది. 2022-23 సంవత్సరంలో ఫిబ్రవరి, మార్చి మాసాల్లో 14వేల మెగావాట్లకు తాకగా, ఏప్రిల్లో 12వేల మెగావాట్లకు చేరింది.
- రోజులో పగలు, రాత్రి విద్యుత్తు డిమాండ్ సరళిని పరిశీలిస్తే రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు నమోదుకాగా, మధ్యాహ్నం పూట దాదాపు ఎలాంటి మార్పులు లేవు.
- విద్యుత్తు డిమాండ్‌ను అధిగమించాలంటే విండ్, హైడల్ విద్యుత్తు, పునరుత్పాదక ఇంధనం ఉత్పత్తిని పెంచాలి. 2023-24లో వీటి ద్వారా 19,228 మిలియన్ యూనిట్లు అందగా, దీనిని 37,253 మిలియన్ యూనిట్లకు పెంచాలని సీఈఏ అంచనావేసింది.

మేనేజ్‌మెంట్ సీట్లకు రెక్కలు

- సీట్ల కన్వర్షన్‌కు అనుమతినివ్వని సర్కార్
- మేనేజ్‌మెంట్ సీట్ల కోసం వెతుకులాట
- 15లక్షలకు వరకు కాలేజీల డిమాండ్



హైదరాబాద్, ఆగస్టు 13(నమస్తే తెలంగాణ): బీటెక్ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల కోసం రగడ తారాస్థాయికి చేరింది. బీటెక్‌లో 9వేల సీట్ల కన్వర్షన్‌కు 90 కాలేజీలు దరఖాస్తు చేసుకున్నాయి. ఇవన్నీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్(సీఎస్ఈ) కోర్సుకు సంబంధించినవే. ఈఈఈ, సివిల్, మెకానికల్ కోర్సుల్లో సీట్లను తగ్గించుకుని, సీఎస్ఈలో పెంచుకునేందుకు సిద్ధపడ్డాయి. ఇందుకు జేఎన్టీయూ ఎన్‌వోసీ ఇవ్వగా, ఏఐసీటీఈ ఆమోదం తెలిపింది. సీట్ల కన్వర్షన్‌కు ప్రభుత్వం నో చెప్పడంతో పరిస్థితి డోలాయమానంలో పడింది. ఏఐసీటీఈ లెక్కల్లో ఈ సీట్లు సీఎస్ఈకి మారినట్టు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు అనుమతినివ్వకపోవడంతో వాటికి గండిపడింది. ఈ సీట్లల్లో 30 శాతం యాజమాన్యకోటాలో భర్తీ చేసుకునే అవకాశం ఉండటంతో కాలేజీల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అడ్వాన్స్ స్వీకరించాయి. ఆఖరున సర్కారు సీట్ల కన్వర్షన్‌కు అనుమతినివ్వకపోవడంతో మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు గండిపడింది. దీంతో అడ్వాన్స్ తీసుకున్న వారికి సీట్లు కేటాయించని పరిస్థితి నెలకొన్నది. ఫలితంగా కొన్ని కాలేజీలు సీటు ధరను పెంచాయి. పేరుమోసిన కాలేజీల్లో సీఎస్ఈ సీటు రూ. 20 లక్షలు, మరికొన్ని కాలేజీల్లో రూ.15 లక్షలకు చేరింది. ఇబ్రహీంపట్నం సమీపంలో ఓ కాలేజీలో ముందు ఒక ఫీజు చెప్పి ఆ తర్వాత రూ.14 లక్షలు చెప్పడంతో తల్లిదండ్రులు సీటు వదులుకున్నారు. దుండిగల్‌లోని ఓ కాలేజీలో తల్లిదండ్రులు యజమాన్యంతో గొడవకు దిగారు. కాలేజీల యాజమాన్యాలకు అనుకూలంగా మంగళవారం హైకోర్టులో తీర్పురావడం కాస్త ఉపశమనంగా చెప్పవచ్చు.

జీఆర్ఎస్ ఆన్‌లైన్ కోర్సు ప్రారంభం

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): గ్రామ్ రోజ్‌గార్ సేవక్ (జీఆర్ఎస్) ఆన్‌లైన్ కోర్సును కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రారంభించారు. రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్ఐఆర్డీ)లో మంగళవారం జరిగిన జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ 66వ జనరల్ కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. న్యూఢిల్లీకి చెందిన జేఎన్‌యూ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపీఏ), పీహెచ్‌డికి సంబంధించి రెండు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. రూరల్ టెక్నాలజీ పార్కును సందర్శించి పీఎంఏవై-జీ మోడల్ హౌస్‌ను ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. పార్కులోని మడ్‌బ్లాక్ తయారీ యూనిట్‌ను సందర్శించారు.

25 ఇసుక రీచ్‌లకు ఎన్జీటీ గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్(ఎన్జీటీ) ఆదేశాలతో కొంతకాలం క్రితం మూతపడిన 25 ఇసుక రీచ్‌లకు మోక్షం లభించింది. మంగళవారం ఎన్జీటీలో జరిగిన విచారణ సందర్భంగా ఈ రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు అనుమతిస్తూ ట్రిబ్యూనల్ తీర్పు వెలువరించినట్టు అధికారులు తెలిపారు. పర్యావరణానికి హాని చేకూరుతుందనే కారణంతో కొంతకాలం క్రితం గోదావరి నదీ పరివాహకంలో కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల పరిధిలోని 25 ఇసుక రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలను ఎన్జీటీ నిషేధించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 76 రీచ్‌లకుగాను 19 రీచ్‌లలో మాత్రమే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. తాజాగా ఎన్జీటీ అనుమతితో మరో 25రీచ్‌లు అందుబాటులోకి రానున్నాయి. అయితే నదిలో నీటి ప్రవాహం కారణంగా ఈ 25 రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు కొంత సమయం పడుతుందని వారు తెలిపారు. ఇటీవల టెండర్లు ఖరారైన మేడిగడ్డ ప్రాజెక్టులోనూ నీటి ప్రవాహం కారణంగా ఇసుక తవ్వకాలు ఇంకా ప్రారంభం కాలేదు.

వాట్సాప్ ద్వారా ఇసుక బుకింగ్!

టీజీఎండీసీ సన్నాహాలు.. అక్రమాల అడ్డుకట్టకు ఇసుకరీచ్‌ల వద్ద డ్రోన్లతో నిఘా



హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): ఇసుక సరఫరాలో అక్రమాలపై టీజీఎండీసీ దిద్దుబాటు చర్యలకు దిగింది. వాట్సాప్ ద్వారా ఇసుక బుకింగ్ చేసుకునేలా కొత్త సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇసుక సరఫరాలో అక్రమాలను అరికట్టేందుకు రీచ్‌లు, స్టాక్‌యార్డ్‌ల వద్ద డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేయాలని, లారీలకు జీపీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిశ్చయించింది. ఇసుక సరఫరాలో అక్రమాలపై ఇటీవల లారీ యజమానులు టీజీఎండీసీ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఇసుక సరఫరాలో అక్రమాలను సమూలంగా నిర్మూలించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని టీజీఎండీసీ నిర్ణయించింది. అందులోభాగంగానే వాట్సాప్ ద్వారా సులభంగా ఇసుక బుకింగ్ చేసుకొనేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. జీపీఎస్, డ్రోన్ల ద్వారా ఆన్‌లైన్‌లో ఇసుక సరఫరా ప్రక్రియను వీక్షించడమే కాకుండా రికార్డుచేసే వీలు కలుగుతుందని వెల్లడించాయి. సాఫ్ట్‌వేర్, డ్రోన్లు, జీపీఎస్ ప్రక్రియను రెండు నెలల్లోగా పూర్తిచేస్తామని టీజీఎండీసీ చైర్మన్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు.

ఐఐటీహెచ్‌కు నిర్ఫ్‌లో 12వ ర్యాంకు

ఆవిష్కరణల్లో 3వ, పరిశోధనల్లో 15వ ర్యాంకు



సంగారెడ్డి, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్ నిర్ఫ్‌లో 12వ ర్యాంకు సాధించి మెరిసింది. గత రెండేండ్లలో ఐఐటీహెచ్ నిర్ఫ్ ర్యాంకింగ్ 14 ఉండగా ఈ ఏడాది 12వ ర్యాంకు వచ్చింది. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్(నిర్ఫ్) ఏటా దేశంలోని విశ్వ విద్యాలయాలు, సాంకేతిక విద్యాసంస్థలు, ఇంజనీరింగ్ కళాశాలలు, పరిశోధనల సంస్థల విద్యాబోధన, పనితీరు, పరిశోధనలు, ఫలితాలు తదితర అంశాలను మదించి ర్యాంకులను కేటాయిస్తుంది. 2024కు నిర్ఫ్ సోమవారం ర్యాంకులను ప్రకటించింది. ఈ ర్యాంకుల్లో ఐఐటీహెచ్ మెరిసింది. ఓవరాల్ ర్యాంకింగ్‌లో ఐఐటీహెచ్ 12వ ర్యాంకు సాధించింది. 2022, 2023లో ఓవరాల్ ర్యాంకింగ్‌లో ఐఐటీహెచ్ 14వ స్థానంలో నిలిచింది. నిర్ఫ్ ఆవిష్కరణల క్యాటగిరీల్లో ఐఐటీహెచ్ 3వ ర్యాంకు, నూతన ఆవిష్కరణల్లో మొదటి స్థానంలో ఉండగా తాజా నిర్ఫ్ ర్యాంకింగ్‌లో మూడవ స్థానంలో నిలిచింది. దేశంలోని టాప్ 50 పరిశోధన సంస్థల్లో ఐఐటీహెచ్‌కు 15వ ర్యాంకు వచ్చింది. దేశంలోని 100 ప్రసిద్ధ ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా ఐఐటీహెచ్‌కు 8వ ర్యాంకు వచ్చింది.

కొత్త కోర్సుల తిరస్కరణ చెల్లదు

- కాలేజీల దరఖాస్తులను పునఃపరిశీలించాలి
- కొత్త కోర్సులపై ప్రభుత్వ విధానమే సరిగ్గా లేదు
- ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల అప్పీళ్లపై హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో వివిధ కోర్సుల్లో సీట్ల పెంపు, కుదింపు, కొత్త కోర్సుల ప్రారంభానికి సంబంధించిన అప్లికేషన్లను మూకుమ్మడిగా తిరస్కరించడానికి వీల్లేదని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు తేల్చి చెప్పింది. కాలేజీలు దాఖలు చేసుకున్న అప్లికేషన్లను ప్రభుత్వం పునఃపరిశీలించి చట్ట ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకోసం అవసరమైతే ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ తేదీలను కూడా సవరించుకోవాలని సూచించింది. కొత్త కోర్సులకు అనుమతినిచ్చే ప్రభుత్వ పాలసీయే సరిగ్గా లేదని వ్యాఖ్యానించింది. కాలేజీ యాజమాన్యాలు దాఖలు చేసుకునే అప్లికేషన్ల తిరస్కరణకు సహేతుక కారణాలు చెప్పాలని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందిస్తే అన్ని కాలేజీలకు ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొంది. వివక్ష ఉండరాదని, చట్ట నిబంధనలకు అనుగుణంగా అప్లికేషన్ల పరిశీలన-చర్యలు ఉండాలని కూడా తేల్చి చెప్పింది. ఇంజినీరింగ్ కాలేజీల్లో కొత్త కోర్సులకు అనుమతి, సీట్ల పెంపు వంటి అంశాలపై ప్రభుత్వ నిర్ణయమే అంతిమమని ఈ నెల 9న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ ఎన్ రాజేశ్వర్‌రావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం రద్దు చేసింది.

ప్రభుత్వానికి నష్టం లేదు: పిటిషనర్ల వాదన

ప్రైవేటు కాలేజీల తరఫున సీనియర్ న్యాయవాదులు దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి, శ్రీరఘురాం, ఎస్ నిరంజన్‌రెడ్డి, పీ శ్రీరాం వాదనలు వినిపిస్తూ.. కంప్యూటర్ కోర్సు దాని అనుబంధ కోర్సుల్లో సీట్ల పెంపు వల్ల ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏమీ లేదని పేర్కొన్నారు. కంప్యూటర్ కోర్సు, దాని అనుబంధ కోర్సుల్లో సీట్లను పెంచుకోవడానికి జేఎన్‌టీయూ ఎన్వోసీ ఇచ్చింది. దీంతో ఏఐసీటీఈ ఆమోదం చెప్పింది. సాంకేతికంగా ప్రభుత్వ అనుమతి తప్పనిసరి కాబట్టి అప్లికేషన్లు పెట్టుకుంటే రాష్ట్రం తిరస్కరించడం అన్యాయం అని చెప్పారు.

ప్రమాణాలు పడిపోతాయి: ప్రభుత్వం

ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ, సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కొత్త అనుమతులు మంజూరు చేయడం వల్ల విద్యాప్రమాణాలు పడిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎస్సీ కోర్సుల్లో సీట్లు మిగిలిపోయాయని చెప్పారు. ఉన్నత విద్యా ప్రమాణాల పెంపు కోసమే కాలేజీల అప్లికేషన్లను ప్రభుత్వం తిరస్కరించిందని తెలిపారు. కంప్యూటర్ సైన్స్‌లో సీట్ల పెంపు జరిగితే అధ్యాపకుల సమస్య వస్తుందన్నారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ సీట్లను పునరుద్ధరించాలని జూలైలో ఏఐసీటీఈకి జేఎన్టీయూ రిజిస్ట్రార్ లేఖ రాసినట్టు వివరించారు. ఏఐసీటీఈ అనుమతి పరిశీలిస్తే.. ప్రభుత్వ అనుమతి తప్పనిసరనే షరతు ఉందనే విషయాన్ని గుర్తించాలని తెలిపారు.. షరతులతో కూడిన నిరభ్యంతర పత్రాన్ని జెఎన్టీయు ఇచ్చిందని, దీని ప్రకారం అనుమతులు కావాలని కోరడం చెల్లదని తెలిపారు.

పునఃపరిశీలన..

వాదనల తర్వాత హైకోర్టు, సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. కాలేజీల అప్లికేషన్లను ప్రభుత్వం తిరిగి పరిశీలన చేసి తగిన నిర్ణయం తీసుంటామంటే అందుకు అనుగుణంగా అప్లికేషన్లను ప్రభుత్వానికి పంపుతామని చెప్పింది. ఒకవేళ ప్రభుత్వం అందుకు నిరాకరిస్తే, తామే తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని వెల్లడించింది. దీనిపై ఏజీ కల్పించుకుని, అప్లికేషన్లను ప్రభుత్వ పునఃపరిశీలించి నిర్ణయం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. దీంతో అప్పీళ్లపై విచారణను ముగిసినట్లు ధర్మాసనం ప్రకటించింది.

బీసీలు ఒక్కటైతేనే హక్కుల సాధన

రాష్ట్రంలో నెలరోజుల్లో కులగణన చేయొచ్చు ● జూలూరు 'మావాటా మాకే'లో వక్తలు



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'మా వాటా మాకే' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

ఖైరతాబాద్, ఆగస్టు 6: బీసీలంతా ఒక్కటై పోరాడితనే తమ హక్కులు సాధించుకోగలరని, బీసీల్లో చైతన్యం తెచ్చి పాలకుల కండ్లు తెరిపించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కవి, రచయిత జూలూరు గౌరీశంకర్ రాసిన 'మా వాటా మాకే' పుస్తకాన్ని హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బీసీ భావజాల వ్యాప్తికి 'మా వాటా మాకే' పుస్తకం స్ఫూర్తిని కలిగిస్తుందని కొనియాడారు. ఈ పుస్తకాన్ని వివిధ రూపాల్లో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. బీసీల ఆత్మను ఆవిష్కరించే పుస్తకాన్ని గౌరీశంకర్ రాశారని ప్రశంసించారు. బీసీ కులగణనకు ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ తమకు హామీ ఇచ్చారని, కానీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టకుండానే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధపడుతుందని జస్టిస్ ఈశ్వరయ్య చెప్పారు. నిజానికి నెల రోజుల్లోనే కులగణన చేయించవచ్చని అభిప్రాయపడ్డారు. బీసీలంతా ఐక్యంగా పోరాడితనే హక్కులు సాధించుకోగలరని పిలుపునిచ్చారు. ముందు వివిధ పార్టీల్లో ఉన్న బీసీ నేతలంతా ఐక్యం కావాలని జస్టిస్ చంద్రకుమార్ పిలుపునిచ్చారు. దేశంలో కులగణన జరిగితే సమాజం చీలిపోతుందంటున్న వారు.. వర్ణ వ్యవస్థతో ఎప్పుడో సమాజాన్ని చీల్చేశారని విమర్శించారు. రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లపై వర్తింపజేయలేదని, బీసీల పరిమితి గురించి మాట్లాడటం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ అభిప్రాయపడ్డారు. జూలూరు రచన బీసీ ఉద్యమానికి దోహదపడుతుందని, ఇది కేవలం ఆలోచనాత్మకమే కాదని, రచయితలోని తపనకు, ఆత్మఘోషకు కూడా అద్దం పడుతుందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టీ చిరంజీవులు పేర్కొన్నారు. త్వరలోనే బీసీల మహా ఉద్యమాన్ని రుచిచూపిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. మిలియన్ మార్చ్, రైతుల ఉద్యమాల స్ఫూర్తిగా సెప్టెంబర్ 1 నుంచి ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని వెల్లడించారు. కులగణన చేయిస్తారా? లేక కుర్చీలు వదులుకుంటారో తేల్చుకోవాలని సవాల్ విసిరారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతీసాగర్ అధ్యక్షతన జరిగిన సభలో ప్రొఫెసర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వందలాది కేంద్రాల్లో పుస్తకావిష్కరణ: జూలూరు

బీసీల ఐక్యత, రిజర్వేషన్లపై పల్లె నుంచి పార్లమెంట్ వరకు బీసీల వాటా గురించి 'మావాటా మాకే'లో రాశానని పుస్తక రచయిత జూలూరు గౌరీశంకర్ తెలిపారు. రాష్ట్రంలోని 400కు పైగా కేంద్రాల్లో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించుకోవడం అరుదైన ఘటనగా అభివర్ణించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బీసీ కవులు, రచయతలు, కుల సంఘాల నేతలు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించుకోడం బీసీ చైతన్యానికి నిదర్శనమని చెప్పారు. బీసీల చైతన్యానికి, ఐక్యతకు, స్థానిక సంస్థల్లో సమ వాటా అన్న డిమాండ్‌కు ఇది బలాన్ని చేకూరుస్తుందని జూలూరు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉద్యోగ జేఏసీ ఝలక్!

మొదటిపేజీ తరువాయి...

మూడు డీఏలు చెల్లిస్తం.. సకాలంలో డీఏలు ప్రకటించి బకాయిలు నేరుగా ఉద్యోగులకు చెల్లిస్తం.. 15 పనిదినాల్లో సప్లిమెంటరీ బిల్లులు చెల్లిస్తం.. సీపీఎస్‌ను రద్దుచేస్తం.. ఆరు నెలల్లో కొత్త పీఆర్సీ అమలు చేస్తమని అభయహస్తం మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పొందుపరిచింది. అడగనిదే అమ్మయినా అన్నం పెట్టదు కొట్లాడాలె అని గతంలో రేవంత్‌రెడ్డే ఉద్యోగులకు పిలుపునిచ్చిండ్రు. ఆ మాటలనే స్ఫూర్తిగా తీసుకుని కొట్లాడేందుకు సిద్ధమైనం.'

సోమవారం జరిగిన ఎంప్లాయిస్ జేఏసీ ఆవిర్భావ సమావేశంలో ఉద్యోగ సంఘాల నేతల మాటలివి

ఈ మాటలను బట్టి చూస్తుంటే రేవంత్‌రెడ్డి సర్కారు తీరుపై ఉద్యోగులు ఎంతగా రగిలిపోతున్నారో అర్థంచేసుకోవచ్చు. క్షేత్రస్థాయి నుంచి ఒత్తిడి తీవ్రమవుతున్నదని, అందుకే తాము ఉద్యమబాట పట్టామని ఉద్యోగ సంఘాల నేతలే అంటున్నారంటే వారు సర్కారు తీరుపై ఎంత కోపంగా ఉన్నారో తెలుసుకోవచ్చు. అలవిగాని హామీలిచ్చి అమలుచేయలేక చేతులెత్తేసిన రేవంత్ సర్కారుపై రాష్ట్రంలోని ఉద్యోగులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఉద్యోగులను నాడు కేసీఆర్ ఆదరించిన తీరు, నేడు పట్టించుకోవడమే కాదు.. కనీసం కలిసేందుకూ సమయమివ్వని రేవంత్‌రెడ్డి సర్కారు వ్యవహారాన్ని ఉద్యోగులంతా పోల్చి చూసుకుంటున్నారు. ప్రజా ప్రభుత్వమంటే ఉద్యోగ సంఘాలను కలవకుండా ఉండటమేనా? అని ప్రశ్నిస్తున్నారు. మ్యానిఫెస్టోలో పెట్టి మోసం చేసిన తీరును సోషల్ మీడియా వేదికగా ఎండగడుతున్నారు. 'నా తలుపులు తెరిచే ఉంటాయి.. ఎప్పుడైనా నన్ను కలవొచ్చు' అని పలుమార్లు ప్రకటించిన రేవంత్‌రెడ్డి, తమను ఇంత వరకు కలవలేదని, సమస్యలపై చర్చించలేదని ఉద్యోగ సంఘాల నేతలే మండిపడుతున్నారు. ఓ సారి రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లిన ఉద్యోగ సంఘాల నేతలకు ఆయన అపాయింట్‌మెంట్ దొరకలేదు. దీంతో రేవంత్ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చి వెనక్కి రావాల్సి వచ్చింది. సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీలు) రేవంత్ ఇంటి ముట్టడికి పిలుపునివ్వగా, టీచర్లంతా ఆయన ఇంటి ముందు పడిగాపులు పడాల్సి వచ్చింది. సీఎంను కలిసి వినతిపత్రం సమర్పిద్దామంటే ఆఖరుకు ఇంటిలోపలికి తీసుకెళ్లిన సెక్యూరిటీ సిబ్బంది సీఎం బిజీగా ఉన్నారని, కలవలేరని చెప్పడంతో చివరికి సీఎం వ్యక్తిగత కార్యదర్శికి టీచర్లంతా వినతిపత్రాన్ని సమర్పించాల్సి వచ్చింది. పండిట్, పీఈటీ అప్‌గ్రేడేషన్ సందర్భంగా కొంత మంది టీచర్ల సంఘాల నేతలను ప్రభుత్వమే సీఎం ఇంటికి పిలిపించింది. కానీ సమస్యలపై చర్చించకుండా, వినతిపత్రాలు స్వీకరించకుండా సీఎంతో కేవలం ఫొటోలు తీయించి పంపించారు. వీటన్నింటినీ తలుచుకుని సంఘాల నేతలంతా కుతకుతలాడిపోతున్నారు. మొత్తంగా ఉద్యోగ సంఘాలు పోరాడానికి సిద్ధపడటం, రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలన్నీ ఒక్కతాటిపైకి రావడం.. జేఏసీగా ఏర్పడటాన్ని రాష్ట్రంలోని ఉద్యోగులు స్వాగతిస్తున్నారు.

ఉద్యోగుల భవిష్యత్తు కార్యాచరణపై సర్కారు ఆరా!

ఉద్యోగ సంఘాల జేఏసీ అల్టిమేటం జారీచేయడం, భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించడంతో కాంగ్రెస్ సర్కారులో వణుకుపుట్టింది. దీంతో ఉద్యోగ సంఘాల నేతల భవిష్యత్తు కార్యాచరణపై ఆరా తీస్తున్నది. ఇంటెలిజెన్స్ వర్గాలు ఉద్యోగ సంఘాల నేతలపై నిఘా పెట్టాయి. నేతల కదలికలను పసిగట్టేపనిలో పడ్డాయి. పైగా భవిష్యత్తు కార్యాచరణ ఎలా ఉండబోతున్నదో చెప్పాలంటూ నేతలకు ఫోన్లు చేసి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాయి.

గతానికి ఇప్పటికి ఉద్యోగుల బేరీజు

ఉద్యోగులతో ఏ సర్కారు ఎలా వ్యవహరించిందన్న దానిపై రాష్ట్రంలోని ఉద్యోగులు బేరీజు వేసుకుంటున్నారు. నాడు కేసీఆర్ కల్పించిన సౌకర్యాలు, ఇప్పటి పరిస్థితులను పోల్చుకుంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐఆర్, పీఆర్సీల కోసం ఉద్యోగులు ఆందోళనల చేసిన రోజులున్నాయి. ఐదు రూపాయల డీఏ కోసం 56 రోజుల పాటు సమ్మె చేసిన సందర్భాలున్నాయి. కానీ ఉద్యోగుల పక్షాన ఉండే బీఆర్ఎస్ సర్కారు, అతి తక్కువ కాలంలోనే పీఆర్సీ కమిటీని నియమించింది. మెరుగైన ఫిట్‌మెంట్ వర్తింపజేసింది. ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు 10వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటైంది. ఈ కమిషన్ కేవలం 28శాతం ఫిట్‌మెంట్ మాత్రమే సిఫారసు చేసింది. తర్వాత తెలంగాణ ఏర్పాటు, ఉద్యమ నేత కేసీఆర్ సీఎం కావడంతో పీఆర్సీ కమిషన్ సిఫారసులతో సంబంధం లేకుండా ఉద్యోగులు 42 రోజుల పాటు సకల జనుల సమ్మె చేస్తే అంతకంటే ఒకటి ఎక్కువ ఉండాలన్న సంకల్పంతో 2015లో 43శాతం ఫిట్‌మెంట్‌తో తెలంగాణ ఇంక్రిమెంట్‌ను ప్రకటించి ఉద్యోగుల్లో సంతోషం నింపారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఆర్ బిశ్వాల్ కమిటీ మొదటి పీఆర్సీ కాగా, తాజాగా శివశంకర్ అధ్యక్షతన ఏర్పాటైంది. సీఆర్ బిశ్వాల్ కమిటీ కేవలం 7.5శాతం ఫిట్‌మెంట్‌ను సిఫారసు చేస్తే, బీఆర్ఎస్ ప్రభుత్వం 30శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని ప్రకటించింది. అంటే 22.5శాతం అధికంగా ఫిట్‌మెంట్ వర్తింపజేసింది. కరోనా కల్లోలం పీడించినా, ఆర్థికంగా వెలుసుబాటు లేకపోయినా ప్రభుత్వంపై ఏడాదికి రూ.12,595 కోట్ల అదనపు భారం పడినా ఉద్యోగులతో గల పేగుబంధాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ మొత్తాన్ని భరించేందుకు సిద్ధపడింది. ఇప్పుడున్న శివశంకర్ పీఆర్సీ కమిషన్ కూడా కేసీఆర్ సర్కారు నియమించిందే. ఈ కమిషన్ గడువు ఏప్రిల్ 2తో ముగియగా రేవంత్‌రెడ్డి సర్కారు కమిషన్ నివేదికను తెప్పించుకోలేక కమిషన్ గడువును ఆరు నెలలు పొడగించింది. వీటన్నింటిపైనా ఉద్యోగులు బేరీజు వేసుకుంటున్నారు.

పెన్షన్ భిక్ష కాదు.. మా హక్కు!

సీపీఎస్‌ను రద్దుచేయాల్సిందే ● ఫుల్ పెన్షన్ ఇవ్వాల్సిందే ● అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య డిమాండ్



నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో మాట్లాడుతున్న ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ అధ్యక్షుడు సుభాష్ లాంబ

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగుల పెన్షన్ సర్కారు ఇచ్చే భిక్షకాదని, తమ హక్కు అని అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) జాతీయ అధ్యక్షుడు సుభాష్ లాంబ స్పష్టంచేశారు. సీపీఎస్‌ను రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశాలు మంగళవారం నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సుభాష్ లాంబ మాట్లాడుతూ బేసిక్ పేలో 50శాతం పెన్షన్ ఇచ్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని, దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని, పూర్తి పెన్షన్ ఇవ్వాల్సిందేనని చెప్పారు. ఉద్యోగుల ఆదాయ పన్ను పరిమితి 10లక్షలకు పెంచాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వ్యవస్థ రద్దుచేసి ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఏకీకృత సర్వీస్‌రూల్స్ రూపొందించాలని, ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ సర్కారు విధానాలపై చర్చ..

తెలంగాణలో ఉద్యోగుల సంక్షేమానికి కేసీఆర్ సర్కారు అవలంబించిన విధానాలపై సమావేశంలో చర్చ జరిగినట్టు తెలిసింది. కరోనా కాలంలో పెండింగ్‌లోని 18 నెలల డీఏ బకాయిలను కేసీఆర్ ప్రభుత్వం చెల్లించింది. జాతీయంగా తెలంగాణతో పాటు కేరళ రాష్ట్రాలు మాత్రమే ఉద్యోగులకు కరువుభత్యం చెల్లించాయి. మిగతా రాష్ట్రాలు కరోనాను సాకుగా చూపి డీఏలు చెల్లించలేదు. ఇదే విషయాన్ని ఈ సమావేశాల్లో జాతీయ నేతలు ప్రస్తావించినట్టు సమాచారం. ఇక కేంద్రం ఏటా పదేండ్లకోసారి పీఆర్సీ కమిషన్‌ను నియమించి వేతన సవరణ చేస్తున్నది. తెలంగాణ మాత్రమే ప్రతి ఐదేండ్లకోసారి పీఆర్సీ కమిషన్ వేసి వేతన సవరణ చేస్తున్నది. తెలంగాణ తరహా కేంద్ర ప్రభుత్వం, మిగతా రాష్ట్రాలు కూడా పీఆర్సీ కమిషన్ వేయాలని సమావేశంలో తీర్మానించినట్టు తెలిసింది. ఏఐఎస్‌జీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి ఏ శ్రీకుమార్, 28 రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణ నుంచి టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, డాక్టర్ ఎస్‌ఎం హుస్సేని (ముజీబ్), అసోసియేట్ అధ్యక్షులు ముత్యాల సత్యనారాయణగౌడ్, కస్తూరి వెంకటేశ్వర్లు, కే లక్ష్మణ్, బుచ్చిరెడ్డి, శ్రీకాంత్, హరి, అశోక్ తదితరులు హాజరయ్యారు. కాగా మంగళవారం ప్రారంభమైన సమావేశాలు, బుధవారం ముగియనున్నాయి.

విద్యుత్తు పదోన్నతులపై సమీక్షించాలి: ఆర్ కృష్ణయ్య



ఖైరతాబాద్, ఆగస్టు 13: విద్యుత్తు సంస్థల్లో 2014 తర్వాత కల్పించిన అన్ని పదోన్నతులను ప్రభుత్వం సమీక్షించి బీసీ, ఓసీ ఉద్యోగులకు న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య కోరారు. తెలంగాణ విద్యుత్తు బీసీ, ఓసీ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎస్ సంస్థల్లో పదోన్నతులను నిలిపివేశారని, ఇందులో బీసీ, ఓసీ ఉద్యోగులే ఎక్కువగా నష్టపోయారని వాపోయారు. జేఏసీ చైర్మన్ కే కుమారస్వామి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 4న విద్యుత్ సౌధ ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నామని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జేఏసీ కో చైర్మన్ ఆర్ సుధాకర్‌రెడ్డి, కన్వీనర్ వెంకన్నగౌడ్, కో కన్వీనర్ భానుప్రకాశ్ పాల్గొన్నారు.

నిమ్స్‌మేకు 3స్టార్ రేటింగ్

హైదరాబాద్, ఆగస్టు 13(నమస్తే తెలంగాణ): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి, ప్రోత్సాహానికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంఎస్‌ఎంఈ(నిమ్స్‌మే) కృషికి గుర్తింపుగా కెపాసిటీ బిల్డింగ్ కమిషన్(సీబీసీ) ఆ సంస్థను 3స్టార్ రేటింగ్‌తో సత్కరించింది. ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన సీఎస్‌టీఐ సదస్సు సందర్భంగా సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ నిమ్స్‌మే డైరెక్టర్ జనరల్‌కు 3స్టార్ రేటింగ్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

పంచాయతీలకు 220 కోట్లు విడుదల

● **ఫలించిన బీఆర్ఎస్ ఒత్తిడి**

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీలకు నిధుల విడుదల కోసం ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఒత్తిడి ఫలించింది. పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం నిధులు రూ.220 కోట్లను విడుదల చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. గ్రామ పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంలేదని బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీలో, అసెంబ్లీ బయట ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. అన్ని వైపుల నుంచి ఒత్తిడి రావడంతో ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. కొద్ది మొత్తంలో నిధులు విడుదల చేసిందని, పాత బకాయిలకు కూడా సరిపోవని పంచాయతీ కార్యదర్శులు చెప్తున్నారు. పెద్ద మొత్తంలో విడుదల చేస్తే అవసరాలు తీరేవని అంటున్నారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

కాంగ్రెస్ దా'రుణం'

అప్పుచేసి పప్పు కూడు తినొద్దన్నారు పెద్దలు. కానీ, అప్పుచేసి ఆస్తులు పెంచుకుంటే తప్పు కాదనేది ప్రస్తుతం చెలామణిలో ఉన్న సూత్రం. డబ్బు ముందుగా ఆదా చేసి, తాపీగా లెక్క పెట్టుకొని, ఆపై ఖర్చుచేసే పరిస్థితి ఎక్కడా లేదిప్పుడు. ఈ రోజుల్లో ఇల్లు, కారు, చివరికి రోజువారీ సరుకులు కొనాలన్నా అప్పే మార్గం. క్లుప్తంగా చెప్పాలంటే ప్రస్తుతం నడుస్తున్నది 'రుణ ఆధారిత ధన వ్యవస్థ'. ఇక ప్రభుత్వాలైతే చెప్పేదేముంది? అప్పు లేకుండా అర గంట కూడా గడవదు. అమెరికాకూ జీడీపీ కంటే ఎక్కువ అప్పుంది. అమెరికా అప్పు రోజుకు వెయ్యి కోట్ల డాలర్ల చొప్పున పెరుగుతున్నదట. దేశాలు అప్పులు తీసుకోకపోతే ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు వంటి సంస్థలు దివాలా తీస్తాయి! అప్పు తప్పు అనేసి తప్పుకోకుండా చేసిన అప్పు దేనికి ఖర్చు చేశారనేది చెప్పుకునే స్థితిలో ఉండటం ముఖ్యం.

అధికారంలోకి రావడానికి ముందు కాంగ్రెస్ తెలంగాణ అప్పుల కుప్పగా మారిందని గగ్గోలు పెట్టింది. అందుకు నెపమంతా కేసీఆర్‌పైనే వేసింది. అప్పు తప్పన్నట్టుగా ఊదరగొట్టింది. కేసీఆర్ ప్రభుత్వం అప్పు చేసింది పరిమితికి లోబడే. పైగా ఆ డబ్బు ఏదో పప్పుబెల్లాలకు ఖర్చు చేయలేదు. తరతరాలకు పనికివచ్చే లక్షల కోట్ల ఆస్తులు తయారు చేసి ప్రజలకు భరోసా కల్పించింది. కాళేశ్వరం, పాలమూరు, మిషన్ భగీరథ వంటి ప్రజోపయోగ పథకాలు తీసుకువచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిందని వీరంగం వేసిన కాంగ్రెస్ పాలకులు సుద్దపూసల్లా ఉండిపోయారా? అంటే అదేమీ లేదు. గత 8 నెలల్లో రూ.50 వేల కోట్ల అప్పు చేశారు. 'కేసీఆర్ చేసిన అప్పు మేం కడుతున్నా'మని తెగ ఇదైపోతున్న కాంగ్రెస్ నేతలు తాము తెస్తున్న అప్పును ఎవరు తీరుస్తారో చెప్పగలరా? ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన అప్పును కేసీఆర్ ప్రభుత్వం తీర్చిందన్న వాస్తవాన్ని కాదనగలరా? ఆ సంగతి అలా ఉంచితే ప్రస్తుత పాలకులు చేసిన అర లక్ష కోట్ల అప్పు దేనికోసమో చెప్పే నాథుడే కరువయ్యాడు. ప్రాజెక్టులు కట్టారా? ప్రజా సంక్షేమానికి ఖర్చుపెట్టారా? అంటే సమాధానం లేదు. రావాల్సిన రైతుబంధు రావడం లేదు. పింఛన్లు పడటం లేదు. మరి అంత సొమ్ము ఏమైనట్టు? 60 ఏండ్ల ఉమ్మడి రాష్ట్రంలో అన్ని ప్రభుత్వాలు చేసిన అప్పు సుమారు 72 వేల కోట్లు. ఇటున్న ఇటుకను అటు పెట్టని కాంగ్రెస్ సర్కార్ ఏడాది లోపే రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది. ఎదుటి మనిషికి చెప్పేటందుకే నీతులున్నాయనే నానుడిని నిజం చేసి చూపింది.

అప్పులతో రాష్ట్రం మరో శ్రీలంకలా మారుతుందని గాయి గాయి చేసిన సీఎం రేవంత్ తనదాకా వస్తేగానీ తత్వం బోధపడదు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. అప్పుల సంసారాన్ని ఒడ్డున పడేసేందుకు తంటాలు పడుతున్నానని ఆయన చెప్పినవన్నీ కల్లబొల్లి కబుర్లే! బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర సంపద బాగా పెరిగిందనేది ఎవరూ కాదనలేని వాస్తవం. తలసరి ఆదాయం, జీఎస్డీపీ.. ఇలా అన్నింటా తెలంగాణ అగ్రభాగాన నిలిచింది. కానీ నడమంత్రపు పాలన వచ్చి అంతా తారుమారైంది. ఇదివరకటి ప్రభుత్వంపై అక్కసుతో ప్రాజెక్టులను పడావుపెట్టి వ్యవసాయాన్ని మూలకు నెట్టారు. సంపద పెంచడం, పంచడం అనే కేసీఆర్ పరిపాలనా సూత్రం పట్టు దొరకక కాంగ్రెస్ ప్రభుత్వం చతికిలపడుతున్నది. చేతకాని తనాన్ని ఆకతాయి మాటల కింద మరుగుపర్చాలని చూస్తే నిజానిజాలు ప్రజలకు తెలియకుండా ఉంటాయా? నక్కలు బొక్కలు వెతుకును అన్నట్టుగా గత ప్రభుత్వపు తప్పులెన్నుతూ కూర్చుంటే రాష్ట్రం ముందుకువెళ్లదు. అప్పులలో చేతివాటం చూపడం కన్నా అభివృద్ధిని పరుగులు పెట్టించే మార్గాల కోసం అన్వేషిస్తే ప్రభుత్వానికీ, ఏతావాతా ప్రజలకూ మంచిది!

కులనిర్మూలనలో లెఫ్ట్ వైఫల్యం

వందేండ్ల కమ్యూనిస్టు ఉద్యమం భారతదేశంలో అనేక ఆర్థిక, రాజకీయ పోరాటాలు చేసింది. ఎందరో నాయకులు తమ జీవితాలను త్యాగం చేశారు. అయితే భారతదేశంలో అస్పృశ్యత నివారణ, కుల నిర్మూలన విషయంలో వారు నిర్దిష్టమైన కార్యక్రమాలతో ముందుకు వెళ్లలేకపోయారు. కాబట్టి ఆ ఉద్యమం విఫలమైందని చెప్పక తప్పదు. దీనికి కారణం కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రధానంగా అగ్రకుల, అగ్రవర్ణ ఆధిపత్యం కొనసాగుతూ రావడమే. ముఖ్యంగా కమ్యూనిస్టులు హిందూ మతోన్మాదాన్ని ఎదిరిస్తున్నారు. కానీ, హిందువులుగా జీవిస్తున్నారు. కులాన్ని నిర్మూలించకుండా వర్గ విప్లవం విజయవంతం కాదని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాడే చెప్పారు.



డాక్టర్ కత్తి పద్మారావు
98497 41695



'ఈ రోజుల్లోనూ కులవ్యవస్థను సమర్థించేవాళ్లుండటం ఒక దురదృష్టం. కుల వ్యవస్థను సమర్థించడం ఎన్నో రకాలు. అందులో ఒకటి కుల వ్యవస్థను శ్రమ విభజన (పనిని పంచుకునే) పద్ధతితో పోల్చడం. కులవ్యవస్థ శ్రమ విభజనే కాదు, అది శ్రామికుల విభజన కూడా. నాగరిక సమాజానికి శ్రమ విభజన అవసరమే. అయితే, శ్రమ విభజనతో పాటు శ్రామికుల విభజన జరగడం, వారి నడుమ అసహజమైన, అలంఘ్యమైన అడ్డుగోడలు కట్టబడటం ఏ నాగరిక సమాజంలోనూ లేదు. అంతేకాదు, శ్రామికుల్లోని ఈ విభాగాలు ఒకదానిపై ఒకటి నిమ్నోన్నత కులాల వారీగా నిర్మించబడిన వారసత్వపు నిరంకుశత్వం ఇది. శ్రామికులలో శ్రామికులు హెచ్చుతగ్గు తారతమ్యాలతో తరగతులుగా విభజింపబడిన ఈ రకమైన పద్ధతి మరే దేశంలోనూ లేదు. కులవ్యవస్థలోని ఈ పద్ధతి వ్యక్తులు చేయవలసిన పనులను, అవలంబించవలసిన వృత్తులను, పుట్టుకను బట్టి ముందే నిర్ణయించడం అనే పద్ధతి. తాము ఏ పనికి తగుదురో, ఏ వృత్తికి సమర్థులో అట్టి పనులను, వృత్తులను చేబట్టే స్వేచ్ఛను హిందువులకు కులవ్యవస్థ అనుమతించడం లేదు' అని అంబేద్కర్ అన్నారు.

> **అంబేద్కర్ సామాజిక, ఆర్థిక శాస్త్రంలో అంతర్జాతీయ స్థాయిలో అధ్యయనం చేసిన మేధావి. ఆయన 'భారతదేశంలో కార్మికవర్గం, కర్షక వర్గం ఒక వర్గంగా రూపొందాలంటే వారిలోని కులభావం, హిందూమత భావాన్ని నిర్మూలించాలి. అంటే ఆర్థిక పోరాటానికి ప్రతి అడుగులో కులం, మతం, వర్ణం, ఆచారం, సంప్రదాయం, మూఢత్వం అడ్డవస్తా'యని చెప్పారు. 'మార్క్సిస్టులు సీపీఐ, సీపీఐఎంఎల్ పార్టీలో ఉన్న నాయకవర్గం హిందూమత భావజాలంలో ఉన్నంతకాలం వారు భారత దేశంలో ఏ రకమైన పరిణామాన్ని తీసుకురాలేర'ని అంబేద్కర్ స్పష్టంగా చెప్పారు.**

'నా ఉద్దేశాన్ని మీకు ఇంకా విపులంగా చెప్పాలంటే సోషలిజాన్ని సాధించడంలో సాధక బాధకాలు అన్నింటినీ పూర్తిగా వివరించవలసి ఉన్నది. సోషలిస్టులు ఉద్దేశించిన ఆర్థిక సంస్కరణలు ఎప్పుడు, ఎలా సాధ్యపడుతుంది? విప్లవం ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకుంటే కానీ అది సాధ్యం కాదన్నది స్పష్టమే కదా. ఆ అధికారాన్ని చేజిక్కించుకునేవాళ్లు కార్మికవర్గం (ప్రొలిటేరియట్) ప్రజలై ఉండాలి. అయితే, ఇక్కడ నేను అడిగే మొదటి ప్రశ్న విప్లవం తేవడానికి ఇండియాలోని కార్మికవర్గ ప్రజలంతా ఏకమవుతారా? ఆ విప్లవానికి ప్రజలను ప్రేరేపించే శక్తి ఏది? నా దృష్టిలో ఆ శక్తి ఒక్కటే. అది ఏదంటే తనతో పాటు విప్లవంలో పాల్గొంటున్న మరొక వ్యక్తి పట్ల సంపూర్ణ విశ్వాసం. కార్మిక వర్గం అంతా కలిసి ఏకం కాకపోతే, ఏక ముఖంగా పోరాడటానికి ఉద్యమించకపోతే విప్లవం ఎలా రాగలదు? ఇంపైన సమాసాలను, భాషను వాడటంలోనే సోషలిస్టులు తృప్తి పడకుండా, సోషలిజం అనేదాన్ని నిర్దిష్టమైన వాస్తవ రూపంలో సాధించాలనే కోరిక తమకుంటే వారు సాంఘిక సంస్కరణ ప్రాధాన్యాన్ని గుర్తించక తప్పదు' అని అన్నారు అంబేద్కర్.

నిజానికి భారతదేశంలోని కమ్యూనిస్టులు కుల నిర్మూలన ప్రాధాన్యాన్ని, అస్పృశ్యత నిర్మూలన ప్రాధాన్యాన్ని తెలిపేవాటి పట్ల నిర్లక్ష్యంగా ఉన్నారని, దీనికి కారణం భారతదేశ వ్యాప్తంగా బ్రాహ్మణుల చేతిలో కమ్యూనిజం, తెలుగు రాష్ట్రాల్లో కమ్మ, రెడ్డి నాయకత్వంలో ఉండటం వల్ల వారు తెలిసే కుల నిర్మూలనా పట్ల, అస్పృశ్యత పట్ల ఉదాసీనంగా ఉన్నారని చెప్పక తప్పదు. ఈ విషయంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆయా రాష్ట్రాల్లో ఉండే కులాధిపత్యాలను అధ్యయనం చేశారు. ముఖ్యం గా తెలుగు రాష్ట్రాల రూపకల్పనలో కమ్మ, రెడ్డి ఆధిపత్యం ఏర్పడింది. కమ్యూనిస్టులు ఏపీలో అనేక సందర్భాల్లో కాంగ్రెస్‌తోనూ జతకట్టారు. తెలంగాణలో రెడ్లు, రెడ్లు ఏకమవుతారు. కాంగ్రెస్ రెడ్లు, కమ్యూనిస్టు రెడ్లు ఏకమవుతుంటారు. కోస్తాంధ్రాలో కూడా కమ్యూనిస్టులు రెడ్లు, కాంగ్రెస్ రెడ్లు ఏకమవుతారు. అందువల్ల అస్పృశ్యత నిర్మూలన, కుల నిర్మూలన, కార్యక్రమాన్ని పార్టీ కార్యక్రమంగా వారు తీసుకోలేకపోయారు.

కారంచేడు ఉద్యమం తర్వాత కులాధిపత్యం మీద, కుల నిర్మూలన మీద పెద్ద ఎత్తున చర్చ జరిగింది. కులాన్ని, అస్పృశ్యతను కమ్యూనిస్టు ఉద్యమం విస్మరించిందని పీపుల్స్‌వార్ నుంచి బయటకు వచ్చిన కె.జి.సత్యమూర్తి, ఓపీడీఆర్ నాగిరెడ్డి గ్రూప్ నుంచి వచ్చిన కంచె ఐలయ్య, నక్సలైట్ మూమెంట్ నుంచి వచ్చిన బీఎస్ రాములు లాంటి చాలామంది నేతలు బాహాటంగా చర్చకు దిగారు. కమ్యూనిస్టు ఎంఎల్ పార్టీ ప్రతినిధులుగా ఉన్న బ్రాహ్మణవర్గం వారు కె.జి.సత్యమూర్తికి, బీఎస్ రాములుకు, కంచె ఐలయ్యకు సమాధానం చెప్పలేకపోయారు. భారత కమ్యూనిస్టు ఉద్యమం కులానికి భారత సమాజంలో ఉండే పట్టు విషయంలో సరైన అంచనాతో ఉద్యమాన్ని నడపలేదు. తెలంగాణ, శ్రీకాకుళం పోరాటాలు జరిగిన ప్రాంతాల్లో కులం వేళ్లు తెగలేదు. అస్పృశ్యతాభావం రూపుమాయలేదు. అనేక సందర్భాల్లో కమ్యూనిస్టు ఉద్యమకారుల రచనల్లో దళితుల పరిస్థితుల గురించి విశ్లేషించారు. తరిమెల నాగిరెడ్డి 'తాకట్టులో భారతదేశం'లో, పుచ్చలపల్లి సుందరయ్య, దేవులపల్లి 'తెలంగాణ పోరాట చరిత్ర'ల్లోనూ దళితుల స్థితిగతులపై కొన్ని భాగాలు రాశారు.

అయితే, ఈ అస్పృశ్యత, కులం నిర్మూలనలను ఒక పాలసీగా తీసుకొని పనిచేయకపోవటం వల్ల సొంత కుటుంబాల్లో, సొంత కులాల్లోనే పెళ్లిళ్లు జరుగుతూ రావడంతో పార్టీలకు నాయకులు మిగిలిపోయారు. అందుకే, ఈనాడు కమ్యూనిస్టు ఉద్యమం పునశ్చరణ చేసుకున్నది. అస్పృశ్యత నిర్మూలనా, కుల నిర్మూలనా సిద్ధాంతాలను, కార్యక్రమాల ప్రధాన వైవిధ్యంగా స్వీకరించి అంబేద్కర్‌ను ఆధునిక సిద్ధాంత కర్తగా అన్వయించుకున్నది. పునర్వివేచనతో ముందుకు నడిస్తే లక్షలాది మంది కార్యకర్తలున్న కమ్యూనిస్టు ఉద్యమం భారతదేశ సాంఘిక, సాంస్కృతిక విభాగాల్లో రాబోయే దశలలో పెను మార్పులు తీసుకురావడానికి చారిత్రక చోదకశక్తి అవుతుందని దళిత ఉద్యమం, అంబేద్కర్ ఉద్యమం బలంగా నమ్ముతున్నాయి.

> **ఈ అస్పృశ్యత, కులం నిర్మూలనలను ఒక పాలసీగా తీసుకొని పనిచేయకపోవటం వల్ల సొంత కుటుంబాల్లో, సొంత కులాల్లోనే పెళ్లిళ్లు జరుగుతూ రావడంతో పార్టీలకు నాయకులు మిగిలిపోయారు.**

స్వాతంత్ర్య పోరులో ముస్లిం వీరులు



ముహమ్మద్ ముజాహిద్
96406 22076

సంకుచిత భావాలు గల కొందరు చరిత్రకారులు 1857, అంతకుముందు జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో అసువులుబాసిన యోధుల పేర్లను కనుమరుగు చేశారు. వారంతా ముస్లింలు కావడమే అందుకు కారణం. నాటి స్వాతంత్ర్య పోరాటంలో హిందువులతో పాటు ముస్లింలు జతకలిశారు. కానీ, ఏదో నామమాత్రంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ లాంటి ఒకరిద్దరి పేర్లు తప్ప చెప్పుకోదగ్గ స్థాయిలో ఇతర వీరుల పేర్లు కానరావు. స్వతంత్ర పోరాటంలో నామమాత్రంగా కూడా పాల్గొనని కొన్ని సంస్థల ప్రతినిధులు దేశభక్తి, జాతీయవాదం గురించి మాట్లాడటం విడ్డూరం. ఈ గడ్డలో పుట్టి తమ మాతృభూమి బానిస సంకెళ్లను తెంచేందుకు ప్రాణత్యాగాలు చేసిన అష్ఫాఖుల్లాఖాన్, హసన్ మోహానీ, టిప్పు సుల్తాన్ తదితరుల చరిత్రను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్న ది. జై హింద్, ఇంక్విలాబ్ జిందాబాద్ లాంటి నినాదాలు కూడా ముస్లిం యోధులు సృష్టించినవే.

స్వాతంత్ర్యం కోసం 200 ఏండ్ల పాటు ఎందరో యోధులు కులమతాలకతీతంగా వీరోచితంగా పోరాడారు. 1750లలోనే స్వాతంత్ర్యోద్యమానికి అంకురార్పణ జరిగింది. ఈస్టిండియా కంపెనీ పేరుతో వ్యాపార నిమిత్తం దేశంలోకి అడుగుపెట్టిన ఆంగ్లేయులు చాపకింద నీరులా తమ ప్రాబల్యాన్ని పెంచుకున్నారు. ముస్లిం పాలకుల నుంచి అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. ముస్లింలను అధికార పీఠం నుంచి తప్పించి గద్దెనెక్కారు. కోల్పోయిన పీఠాన్ని తిరిగి పొందేందుకు ముస్లింలు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడారు. స్వాతంత్ర్య పోరాటానికి మొదట శంఖం పూరించింది ముస్లింలేనన్నది దీనిద్వారా తెలుస్తున్నది. 1753లో ముర్షీదాబాద్, బెంగాల్‌లో సిరాజుద్దౌలా తాత అలీవర్దీఖాన్ ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడారు. 1799లో దక్షిణ భారతదేశంలో మైసూరు పులి టిప్పు సుల్తా న్, ఆయన తండ్రి హైదర్ ఆంగ్లేయులతో పోరాడా రు. కొందరు స్వదేశీయులు ఆంగ్లేయులతో చేతులు కలపకుండా ఉంటే మన దేశానికి 200 ఏండ్లకు పూర్వమే స్వాతంత్ర్యం లభించేది. తెల్లవాళ్ల నుంచి ఈ దేశానికి విముక్తి కలిగించేందుకు ఎంతోమంది యోధులు తమ రక్తాన్ని చిందించాల్సి వచ్చింది. జైళ్లల్లో మగ్గాల్సి వచ్చింది. ఉరికంబాన్ని ముద్దాడాల్సి వచ్చింది. ఆస్తులన్నీ ధారపోయాల్సి వచ్చింది. ఇల్లూవాకిలీ వదిలేయాల్సి వచ్చి ంది. ఈ క్రమంలో ఆంగ్లేయుల కబంధ హస్తాల నుంచి ఈ దేశానికి విముక్తి కల్పించేందుకు తమ ధన, ప్రాణాలను మూల్యంగా చెల్లించుకునేందుకు ముస్లింలు ఎప్పుడూ ముందు వరుసలోనే ఉన్నారు.



చివరి మొగల్ చక్రవర్తి బహదూర్‌షా జఫర్‌ను బ్రిటిషర్లు రంగూన్ జైలులో బంధించి, కండ్లముందే అతని నలుగురు కుమారులను గొంతుకోసి చంపేశారు. 'చక్రవర్తిగా పాలించిన నాకు రెండడుగుల భూమి కూడా దొరకని దుస్థితి. ఇంతకంటే దురదృష్టవంతులు ఎవరుంటారు' అని తన ఆవేదనను కవిత రూపంలో రాసుకున్నాడాయన. స్వాతంత్ర్యం కోసం ముస్లింలు చేసిన త్యాగాలకు మచ్చుతునక ఇది.

ముస్లిం యోధులు అనుభవించిన శిక్షల్లో కాలాపానీ శిక్ష అత్యంత పాశవికమైనది. ఈ కాలాపానీ జైల్లో మగ్గినవారిలో 95 శాతం ముస్లింలే. అందులోనూ ఉలమాలే అధికం. మౌలానా జాఫర్, మౌలానా విలాయత్ అలీ (రహ్మలై), మౌలానా యాహ్యా (రహ్మలై) లాంటి ఉలమాల పేర్లు ముందువరుసలో ఉంటాయి. కాలాపానీ శిక్షకు భయపడి చాలామంది బ్రిటిషర్లకు కొమ్ముకాస్తూ మహాత్మాగాంధీకి వ్యతిరేకంగా పనిచేసేవారు. గాంధీని హత్యచేసిన వర్గం స్వతంత్ర పోరాటానికి వ్యతిరేకంగా, ఆంగ్లేయులకు అనుకూలంగా పనిచేసింది. కాలాపానీ జైలులో ఎలాంటి శిక్షలు అనుభవించారో పలువురు ఉలమాలు తమ పుస్తకాల్లో రాసుకున్నారు.

మలబార్‌లో మోప్లా ముస్లింలు కూడా స్వతం త్ర సంగ్రామంలో చురుగ్గా పాల్గొన్నారు. మోప్లా ముస్లింలను ఆంగ్లేయులు చిత్రహింసలు పెట్టారు. కేరళకు చెందిన 125 మంది ముస్లింలను బ్రిటిషర్లు బంధించారు. వాళ్లను కోర్టులో హాజరుపర్చేందుకు మాల్‌గాడీలో తీసుకెళ్లారు. 50 మంది పట్టే వాహనంలో 125 మందిని కుక్కి తలుపులు మూసేశారు. 3 రోజుల ప్రయాణం తర్వాత తలుపు తీసి చూడగా.. 65 మంది ఊపిరాడక చనిపోయి ఉన్నారు. మిగతా వారంతా స్పృహ తప్పి పడిపోయారు. బతికిన వారిని మద్రాసు కోర్టులో హాజరుపర్చి ఉరిశిక్ష వి ధించారు. కేరళ ప్రభుత్వం 1971లో వారి త్యాగాలను గుర్తించి మోప్లా యోధుల కుటుంబాలకు పింఛను మంజూరు చేయడం వారి త్యాగాలకు నిదర్శనం.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ (రహ్మలై) జాతీయోధ్యమంలో కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆజాద్‌పై అడుగడుగునా ఆంక్షలుండేవి. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని రగిలించేందుకు ఆయన సొంతంగా పత్రికను నడిపేవారు. దీన్ని సహించని ఆంగ్లేయులు అల్ హిలాల్ పత్రికను నిషేధించారు. మౌలానాను బంధించిన అహ్మద్‌నగర్ జైలు నేటికీ అందుకు సాక్ష్యంగా నిలుస్తున్నది. మౌలానా హస్రత్ మోహానీ తన కవితలతో ముస్లింలపై ఎంతో ప్రభావం చూపించారు.

ఉలమాలు స్వతంత్ర సమరాంగణంలో రాజీలేని పోరాటాలు చేశారని, ఎనిమిది లక్షల మంది బలిదానాలు చేశారని డాక్టర్ తారాచంద్ అనే రచయిత తన గ్రంథంలో రాశారు. ఈ దేశానికి ఎప్పుడు ఆపద వచ్చినా 'మేమున్నా'మంటూ ముస్లింలు ముందుకొచ్చారు. దురదృష్టవశాత్తూ 1947లో దేశ విభజన జరిగింది. ఈ దేశాన్ని విభజించడాన్ని చాలామంది ముస్లింలు తీవ్రంగా ఖండించారు. సింధ్ నుంచి మద్రాసు దాకా అఖండ భారత్ ఉండాలని వారు కోరుకున్నారు. వారిలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఒకరు. ఢిల్లీ జామా మసీదు వద్ద ఆజాద్ చేసిన ప్రసంగం చరిత్రాత్మకం. 'మీరంతా ఎక్కడికి వెళ్తున్నారు? ఎందుకు వెళ్తున్నారు? ఈ మసీదు మినార్లు మిమ్మల్ని పిలుస్తున్నాయి. విభజన వల్ల దేశంలోని ముస్లింలు బలహీనపడతారు' అని నాడు ఆయన చేసిన ప్రసంగం పుస్తకాల్లో నేటికీ నిక్షిప్తమై ఉంది. ఈ దేశ స్వతంత్ర సమరాంగణంలో ముస్లింల త్యాగాలు చిరస్మరణీయమనే విషయాన్ని అందరూ తెలుసుకోవాలి.



తొందరపడ్డాం అనుభవిస్తున్నాం!



భోజన్నగారి అనసూయ

'వడ్డించేవాడు మనవాడైతే బంతి చివరన కూర్చున్నా మన వంతుకు వస్తుంది' అని మన దగ్గర ఒక సామెత. అయితే ఆ సామెత ఓటరు మహాశయులకు ఎందుకో అస్సలు నచ్చదు. వడ్డించేవాడు తనదాకా రాక ముందే మధ్యలోనే లేచి పోతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల విషయంలో అదే జరిగింది. కానీ, సినిమాల విషయానికి వస్తే ప్రజలు వేరేలా స్పందిస్తున్నారు.

తన అభిమాన సినీ హీరో సినిమా టికెట్ ధర ఎంత ఎక్కువున్నా ఆ సినిమా చూస్తరు. ఎన్నిసార్లయినా చూస్తరు. ఆ హీరోకు సంబంధించిన ఏదేని చిన్న ఈవెంట్ ఎక్కడ జరిగినా, దానికోసం కొట్లాడి మరీ తొక్కిసలాటలో టికెట్ కొనుక్కొని చూస్తరు. సినిమా విడుదల రోజు పూల దండలు, పాలాభిషేకాలు, రక్తదాన శిబిరాలు, హీరో పుట్టినరోజు అన్నదానాలు, హీరో పేరిట రకరకాల వస్తు పంపిణీలు.. అబ్బో చెప్తూ పోతే లిస్టు పెద్దగానే ఉంటది.

ఇక రాజకీయం విషయానికి వస్తే మన ఇంట్లో ఏ చిన్న సమస్య వచ్చినా 'విషయం' ఫలానా ఎమ్మెల్యేకు, కుదిరితే మంత్రికి, వీలైతే 'ముఖ్యమంత్రి'కే చెప్పాలని ప్రయత్నిస్తాం. పొరపాటున 'ముఖ్యమంత్రిని కలిసే అవకాశం ఇప్పుడు లేదు' అని పక్కవాళ్లు ఎవరైనా చెప్తే.. 'ఐపాయే' ఇగ అన్నట్టు బద్నాం చేసుడు షురూ జేస్తం. మనల్ని ఒక్కళ్ని కలువకుంటే, ముఖ్యమంత్రి అసలు ఎవ్వల్ని గూడ కలుస్త లేరని బద్నాం జేస్తం. 'ఒక్క కుటుంబమే అధికారం చెలాయిస్తున్నదని, డబ్బు మొత్తం దుర్వినియోగం చేస్తున్నద'ని అని అడిగినోళ్లకు, అడగనోళ్లకు అందరికీ ప్రచారం చేసేస్తం.

> **పచ్చ మీడియా ఒకటి ఉండనే ఉన్నది మన తెలంగాణ పాలిట. ముందు నుంచి అబద్ధాలు వండి వార్చనీకి, ఇట్లాంటి వాళ్లను గంటలు గంటలు స్టూడియోలో కూచోబెట్టి వాడుకునేందుకు. ఆ సమయంలో ఆ యాంకర్ దగ్గరుండి చూసినట్టే చెప్తుంటరు జనాలకు.**


అభిమానం సహజంగానే గుర్తింపు కోరుకుంటుంది. మన గురించి ఎక్కువ ఆలోచించాలని, మనకే ఎక్కువ విలువ ఇయ్యాల్సనే ఈగో ప్రతి మనిషికి కొంత ఉంటుంది. కానీ, మనం దాన్ని అదుపులో ఉంచుకోగలగాలి. అభిమానం అదుపులో ఉంచుకొనుడు ప్రేమికులు, పేరెంట్స్, చుట్టాలు, ఇరుగుపొరుగు, స్నేహితులు, ప్రయాణాల్లో తోటి వారు ఇట్ల ప్రతి ఒక్కరి దగ్గరా పాటించాలి సుమా!

నిజానికి డబ్బుకు ఓటు ఎప్పుడో అమ్ముడుపోయింది. (డబ్బు, వస్తువు తీసుకొని ఓటేసిన వాళ్లను దృష్టిలో ఉంచుకొని మాత్రమే) డబ్బు తీసుకుంటే ఆ ఓటరుకు నైతిక హక్కు పోయినట్టే. నాయకులే అలవాటు చేశారని ఓటరు.. ఓటరు డబ్బు, వస్తువు ఇస్తేనే ఓటు వేస్తామన్నారనీ రాజకీయ నాయకులు.. ఇది ఇగ ఇప్పట్లో ఒడువని ముచ్చట. డబ్బు తీసుకొని ఓటేసి, ప్రతి సంక్షేమ ఫలం తనకు, తన అస్మదీయులకే రావాలనే కాంక్షతో కొంచెం కూడా ఓపిక లేక అర్థం పర్థం లేని అల్లుడు. ఆలోచన లేని తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం.

పదేండ్ల తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో ఊహించని మంచి పరిణామాలను మనం చూశాం. ఆ ఫలితాలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అనుభవిస్తూనే ఉన్నాం. పాఠశాలల మూలంగా ఎంతోమందికి ఉచిత, నాణ్యమైన విద్య, జిల్లాకో మెడికల్ కాలేజీతో విరివిగా అందే వైద్యం, ముఖ్యంగా సాగు, తాగునీరు, 24 గంటల కరెంటు సౌకర్యాన్ని పొందుతున్నాం. దేశం మొత్తాన్ని మన తెలంగాణ వైపు చూసేటట్టు చేయగలిగిన 'బీఆర్ఎస్' పార్టీ తప్పకుండా ప్రతి ఒక్క లబ్ధిదారుడిని గుర్తిస్తుండేది, కొద్దిగా ఆలస్యమైనా. కానీ, ఇంతలోనే తొందరపడ్డాం. డెబ్బై ఏండ్ల నుంచి జరిగిన అన్యాయాలు కనుమరుగు కాకముందే తొందరపడ్డాం. ఈ పదేండ్ల అభివృద్ధి విలువ మనకు పూచిక పుల్ల కూడా కాదని 'మార్పు కావాలి' అని తొందరపడ్డాం. ఊదర పాటకు భ్రమసిపోయి ఇప్పుడు 'కాలుగాలిన పిల్లి'లెక్క తిరుగుతున్నాం. ఇటు కక్కలేక, అటు మింగలేక అవస్థలు పడుతున్నాం.

> **అన్యాయం ఏమంటే.. సినిమా హీరో దరిదాపులకు రానివ్వకున్నా ఆ హీరో మీద ఇంత కూడా కోపం పెట్టుకోని మనం... మంచిచేసిన రాజకీయ నాయకుని మీద కోపాన్ని పెంచుకున్నాం. ఇంట్లో వాళ్లకు తినడానికి కూడా ఉందో లేదో చూసుకోకుండా సినిమా హీరోలకు పూలు, పాలతో అభిషేకాలు చేసే మనం, దోస్తులను కూడా వెంటబెట్టుకొని అభిమాన హీరో సినిమాను ఎన్నిసార్లు చూస్తామో లేక్కేలేదు. కానీ, రాజకీయ హీరో మాత్రం మనం ఎప్పుడంటే అప్పుడు మన ముందుకే రావాలి, సమాధానం చెప్పాలి, సహాయం చేయాలి.**

బహుళ ప్రయోజన పనులు ఎప్పటికైనా ప్రభుత్వమే చేస్తుంది. ఎన్నో విషయాలు చక్కగా ప్లాన్ చేసుకునే ఓటర్లు ఎందుకో ప్రభుత్వాల విషయంలో తక్షణ ఫలితాలే కావాలని కోరుకోవడం విడ్డూరం. పదేండ్ల స్వరాష్ట్ర పాలనలో మనం సంక్షేమం, అభివృద్ధి రెండూ సమాంతరంగా చూడగలిగాం, అనుభవించాం. అయినా సరే అర్థం లేనివిధంగా అలిగాం. మనకు మంచిగనిపించి కూడా తొందరపడ్డాం. అందుకే వండి వడ్డించేవారినే గుర్తిద్దాం. అవకాశమిద్దాం. ఫలితం అనుభవిద్దాం. తొందరపాటు వద్దు.



విభేదాలు సృష్టించకండి!



హక్కులనేవి అందరికీ సమానంగా ఉంటాయి. హిందూ, ముస్లింలు అనే తారతమ్యాలు చూపొద్దు. మనమంతా ఒక్కటే. మనలో విభేదాలు సృష్టించకండి. వారు (హిందువులు) మన దేశ ప్రజలు కాదా? మనమంతా కలిసి పోరాడాం. ఇప్పుడు మనమంతా కలిసి జీవించాలి.

- యూనుస్, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత

సర్కార్‌లో కదలిక



నిజామాబాద్‌లో పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు

మొదటిపేజీ తరువాయి...

పొన్నం ప్రభాకర్‌ను రంగంలోకి దింపి గురుకులాల సందర్శనకు పంపింది. మరో వైపు హాస్టళ్లలో తనిఖీలకు పది ఏసీబీ అధికారుల బృందాలను పురమాయించింది. రాష్ట్రవ్యాప్తంగా పది హాస్టళ్లను ఏసీబీ అధికారులు పరిశీలించగా దిగ్భ్రాంతికర అంశాలు వెలుగుచూశాయి.

అధికారులతో తనిఖీలు

కేటీఆర్ సూచనతో రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో ఏసీబీ అధికారులతోపాటు ఫుడ్‌సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఫుడ్ క్వాలిటీ, క్వాంటిటీ చెక్ ఆడిటర్‌లతో ప్రభుత్వం మంగళవారం పది హాస్టళ్లలో తనిఖీలు చేపట్టింది. వానకాలం కావడంతో పిచ్చిమొక్కలు పెరిగి దోమలు, ఈగలు, పాములు, తేళ్లు వస్తున్నట్టు గమనించారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు ఎందుకు శుభ్రం చేయడం లేదని స్కావెంజర్లను ప్రశ్నించారు. నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. పాఠశాల రిజిస్టర్లు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలోని ఆశ్రమ పాఠశాల హాజరు పట్టికలో 272 మంది ఉండగా 100 మంది వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాలను కలెక్టర్ సంతోష్ సందర్శించారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని కోడూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ విజయేంద్ర బోయి తనిఖీ చేసి విద్యార్థులకు పాఠాలు బోధించారు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత, ప్రాథమిక పాఠశాలను ట్రెయినీ కలెక్టర్ గరీమ నరుల సందర్శించారు. సిద్దిపేట ప్రభుత్వ బాలుర హాస్టల్‌లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. హాస్టల్ నిర్వాహకులు హాస్టల్‌కు రాని విద్యార్థుల రిజిస్టర్ పట్టికలో గైర్హాజరు అని వేయకుండా డాట్‌లు పెట్టడాన్ని గుర్తించారు. నిజామాబాద్‌లోని కోటగల్లి ప్రభుత్వ ఎస్సీ బాలిక హాస్టల్‌లో సిబ్బంది హాజరు రిజిస్టర్ సరిగ్గా లేదని, హాస్టల్ వస్తువుల కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని గుర్తించారు. నాణ్యత లోపించిన, గడువు దాటిన ఆహార పదార్థాలను పరీక్షల కోసం హైదరాబాద్‌లోని నాచారం ల్యాబ్‌కు పంపించారు. జనగామ ఎస్సీ బాలికల వసతి గృహంలో రికార్డుల ప్రకారం 110 మంది విద్యార్థులుండగా సోమవారం రాత్రి 73 మంది హాజరైనట్టు చూపించినా వాస్తవానికి 60 మందే ఉన్నట్టు అధికారుల పరిశీలనలో వెల్లడైంది. తనిఖీల్లో గుర్తించిన అంశాలపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని ఏసీబీ అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

మండిపడ్డ కేటీఆర్.. 24గంటల్లోనే కదిలిన సర్కార్

గురుకులాల్లో విద్యార్థుల మృత్యుఘోష వినిపిస్తున్నదని, ఎనిమిది నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో 36 మంది విద్యార్థులు చనిపోయారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాజాగా మండిపడ్డారు. 500 మందికిపైగా ఫుడ్‌పాయిజన్‌తో దవాఖానల పాలు కావడాన్ని ఆయన సీరియస్‌గా తీసుకున్నారు. జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకులంలో మృతిచెందిన అనిరుధ్ కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. ఏ తల్లి గర్భశోకంతో బాధపడకూడదని గురుకులాల పనితీరు, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. గురుకులాలను పరిశీలించేందుకు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో కమిటీ వేస్తామని ప్రకటించారు. కమిటీ నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. కలెక్టర్లు, ఉన్నతాధికారులంతా గురుకులాలను దత్తత తీసుకొని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ప్రభుత్వానికి సూచించారు.

ఏసీబీ అధికారులు తనిఖీ చేసిన హాస్టళ్లు..

హాస్టల్ పేరు	ప్రాంతం	జిల్లా
ఎస్సీ బాయ్స్ హాస్టల్	జామ్‌బాగ్	హైదరాబాద్
బీసీ బాయ్స్ హాస్టల్	మేడిపల్లి	మేడ్చల్ మల్కాజిగిరి
బీసీ బాయ్స్ హాస్టల్	కోయిలకొండ	మహబూబ్‌నగర్
ఎస్సీ గర్ల్స్ హాస్టల్	తిప్పర్తి	నల్లగొండ
ఎస్సీ బాయ్స్ హాస్టల్	వేమనపల్లి	మంచిర్యాల
ఎస్సీ బాయ్స్ హాస్టల్	ఇప్పలపల్లి	రాజన్న సిరిసిల్ల
ఎస్సీ గర్ల్స్ హాస్టల్	జనగామ	జనగామ
ఎస్టీ బాయ్స్ హాస్టల్	కారేపల్లి	భద్రాద్రి కొత్తగూడెం
బీసీ బాయ్స్ హాస్టల్	సిద్దిపేట	సిద్దిపేట
ఎస్సీ గర్ల్స్ హాస్టల్	కోటగల్లి	నిజామాబాద్

గురుకులాలను ప్రక్షాళన చేస్తాం

- పెద్దాపూర్‌లో విద్యార్థుల మృతి కలిచివేసింది
- మృతుల కుటుంబాల్లో ఒక్కొక్కరికి ఉద్యోగం
- బడ్జెట్‌లో గురుకులాలకు రూ.5వేల కోట్లు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో తీవ్ర అస్వస్థతకు గురై కోలుకున్న విద్యార్థి నుంచి వివరాలు తెలుసుకుంటున్న భట్టి

జగిత్యాల, ఆగస్టు 13(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకులాలను ప్రక్షాళన చేస్తామని, ప్రతి గురుకులంలో సకల సదుపాయాలు కల్పించి, సురక్షిత విద్యాకేంద్రాలుగా మారుస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో పక్షం రోజుల వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థులు మృతిచెందడం, మరో నలుగురు తీవ్ర అస్వస్థతకు గురైన విషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మంగళవారం పెద్దాపూర్ గురుకులాన్ని సందర్శించారు. బాధిత విద్యార్థుల తల్లిదండ్రులను ఓదార్చి వారితో సమావేశమయ్యారు. మృతిచెందిన పిల్లల తల్లిదండ్రులు, తీవ్ర అస్వస్థతకు గురై కోలుకున్న పిల్లలతో మాట్లాడారు. అనంతరం భట్టి మాట్లాడుతూ పెద్దపూర్ గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల మృతి యావత్ ప్రభుత్వాన్ని కలచివేసిందని, మంత్రి మండలి సభ్యులందర్నీ దిగ్భ్రాంతికి గురి చేసిందని చెప్పారు.

ఘటనలు జరగకుండా చూస్తాం

ఇకముందు ఇలాంటి దుర్ఘటనలు ఎక్కడా చోటుచేసుకోకుండా చూస్తామని ప్రభుత్వం తరపున హామీ ఇస్తున్నామని తెలిపారు. గురుకులాలకు పక్కా భవనాల కోసం బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించినట్టు తెలిపారు. మానవ వనరుల అభివృద్ధి కోసం విద్యకు పెద్దఎత్తున నిధులు కేటాయించామని చెప్పారు. పెద్దాపూర్ పాఠశాల భవనానికి రూ.50 లక్షలు కేటాయిస్తున్నట్టు చెప్పారు. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించి ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలని కలెక్టర్‌ను ఆదేశించినట్టు తెలిపారు. గురుకులాల్లో విద్యార్థులకు హెల్త్‌కార్డు పద్ధతిని అమలు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ప్రతి గురుకులంలో అత్యవసర ఔషధాలు, పారామెడికల్ స్టాఫ్, కుక్క, పాము కాటు మందులను అందుబాటులో ఉంచాలని గురుకులాల సెక్రటరీ రమణకుమార్‌ను ఆదేశించారు. ప్రతి హాస్టల్‌లో రుచిగల ఆహారం అందిస్తూ శుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని, హాస్టళ్లలో మంచం, బెడ్‌ షీట్ల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. టాయిలెట్స్, నీరు, విద్యుత్తు, భద్రతకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు.

బాధిత కుటుంబాలకు ఉద్యోగం

మృతి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులకు గురుకులాల్లో ఉద్యోగం కల్పిస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. ఎక్స్‌గ్రేషియా సైతం ఇస్తామని చెప్పారు. కుటుంబాలకు ఇండ్లు లేకపోతే వారికి రూ.5 లక్షల ప్రభుత్వ సాయం అందించాలని కలెక్టర్‌కు సూచించినట్టు తెలిపారు. గురుకులాలతోపాటు, హాస్టళ్లలో విద్యార్థులకు ఇచ్చే డైట్‌చార్జీల పెంపుపై త్వరలోనే కమిటీ వేస్తామని, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు అనుగుణంగా డైట్ చార్జీల పెంపు ఉంటుందని వివరించారు. సమావేశం అనంతరం గురుకులం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్‌లు, ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, డాక్టర్ సంజయ్‌కుమార్, సీనియర్ ఐఏఎస్ అధికారి కృష్ణ భాస్కర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

కుటుంబాల ఆవేదన.. ఆగ్రహం..

పెద్దాపూర్ గురుకులంలో డిప్యూటీ సీఎం భట్టితో సమావేశమైన బాధిత పిల్లల కుటుంబ సభ్యులు, ఇతర పిల్లల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తంచేశారు. డిప్యూటీ సీఎం వస్తున్న విషయాన్ని సోమవారం రాత్రి ప్రకటించారు. మృతిచెందిన చిన్నారుల కుటుంబ సభ్యులతోపాటు, పిల్లల తల్లిదండ్రులతో మంత్రులు మాట్లాడుతారని ముందే ఆదేశాలిచ్చినా, జిల్లా అధికారయంత్రాంగం, గురుకుల పాఠశాలల యాజమాన్యం ఏర్పాట్లు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయి. కొద్ది మంది పిల్లల కుటుంబసభ్యులకే సమాచారమిచ్చి చేతులు దులుపుకొనేందుకు యత్నించారు. అయినా, విషయం తెలుసుకున్న చాలా మంది తల్లిదండ్రులు గురుకులానికి చేరుకున్నారు. కానీ, వారిని డిప్యూటీ సీఎం, మంత్రులతో కలువనీయకుండా పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఒకానొక దశలో కొందరు పిల్లల తల్లిదండ్రులను, కోరుట్ల సీఐ కాలర్ పట్టుకొని, గదుల నుంచి బయటకు లాక్కెళ్లడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. చివరికి భట్టి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సర్దిచెప్పి నిర్వహించిన సమావేశంలోనూ తల్లిదండ్రులు ఆవేదనతోనే మాట్లాడారు.

హంగామాకు వచ్చారా?

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన తీరుపై పెద్దాపూర్ గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తంచేశారు. చనిపోయిన పిల్లల తల్లిదండ్రులను పరామర్శించేందుకు డిప్యూటీ సీఎం వస్తున్నప్పటికీ ప్రొటోకాల్ అంటూ పోలీసులు ఏర్పాటు చేసిన 'గాడ్ ఆఫ్ హానర్' అందరినీ విస్మయానికి గురిచేసింది. వేలాది మంది కార్యకర్తలు తరలివచ్చి ప్రజాప్రతినిధులకు బొకేలు, శాలువాలు ఇస్తూ హంగామా చేయడంతో బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. తమను పలుకరించి, ధైర్యం కల్పించేందుకు వచ్చారా? బొకేలు తీసుకొని, శాలువాలు కప్పుకొంటూ హంగామా చేసేందుకు వచ్చారా? అంటూ వారు బాహాటంగానే విమర్శించారు.

సర్కారు మొద్దునిద్ర వీడినందుకు సంతోషం

గురుకులాల్లో మెరుగైన వసతులు కల్పించాలి • బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): సర్కారు మొద్దునిద్ర వీడి, గురుకులాల సమస్యలపై మొత్తానికి స్పందించటం సంతోషంగా ఉన్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. 8 నెలల్లో కలుషిత ఆహారం కారణంగా దాదాపు 500 మందికిపైగా విద్యార్థులు దవాఖానల పాలవడం, సోమవారం కూడా సంగారెడ్డి జిల్లాలోని బీబీపేట ప్రభుత్వ పాఠశాలలో కలుషిత ఆహారంతో 24 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయాన్ని ఆయన ఉదహరించారు. విద్యార్థుల భోజన సమస్యలను పరిష్కరించాలని కేటీఆర్ డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ జగిత్యాల జిల్లాలోని పెద్దాపూర్ పాఠశాలను సందర్శించడాన్ని కేటీఆర్ స్వాగతించారు. విద్యార్థుల భోజనం సహా ఇతర అన్ని సమస్యలను పరిష్కరించేలా మంత్రులు కృషిచేయాలని కోరారు.



ఐటీఐల పరిస్థితి అధ్వానం

- సిబ్బంది, టాయిలెట్స్‌లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నరు
- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఐటీఐ కాలేజీలు సహా గురుకులాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేకపోవడం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. విద్యాలయాల్లో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి, సంగారెడ్డి, ఆదిలాబాద్ సహా రాష్ట్రంలోని ఐటీఐల పరిస్థితి అధ్వానంగా ఉన్నదని చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని, సరిపడా టాయిలెట్స్ లేవని, అవసరమైన సిబ్బంది లేరని, విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆయన ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తంచేశారు. కంప్యూటర్లు ఇతర ఉపకరణాలు పనిచేయడం లేదని, దీంతో విద్యార్థులు ప్రాక్టికల్స్ చేయలేకపోతున్నారని తెలిపారు. గురుకులాల పరిస్థితి నానాటికీ దిగజారుతున్నదని, కలుషిత ఆహారంతో విద్యార్థుల అస్వస్థత, పాముకాటులతో విద్యార్థి మృతి, డెంగ్యూతో విద్యార్థి దుర్మరణం వంటి వార్తలు రాష్ట్రంలో నిత్యకృత్యమయ్యాయని ఆందోళన చెందారు. అత్యధిక ప్రాంగణాలు దోమలు, ఈగలతో మురికి కూపాలుగా మారాయని, స్నానాల గదులకు డోర్లు కూడా లేని దుస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదని, పెడుతున్నది కూడా నాణ్యంగా లేదని, విధిలేక కారం మెతుకులతో కడుపు నింపుకొంటున్నారని ఉదహరించారు. సమస్యలు ఇలా ఉంటే విద్యార్థులు చదువుపై ఎలా దృష్టి పెడతారని, గురుకులాలకు తమ పిల్లలను తల్లిదండ్రులు ఎలా పంపుతారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రఖ్యాతి గాంచిన గురుకులాలు, కాంగ్రెస్ ప్రభుత్వంలో దిగజారుతుండటం శోచనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఐటీఐలు, గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కోలుకుంటున్న గురుకుల విద్యార్థిని కార్తీక

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): గురుకుల పాఠశాల భవనంపై నుంచి కిందపడి గాయాలపాలైన విద్యార్థిని కోలుకుంటున్నదని ప్రభుత్వం తెలిపింది. ములుగులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని కార్తీక 9న స్కూల్ మూడో అంతస్తు నుంచి పడిపోయింది. దీంతో విద్యార్థిని నడుము భాగంలో గాయాలయ్యాయి. కార్తీకను వరంగల్ ఎంజీఎంకు, అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించారు. విద్యార్థినికి ప్రభుత్వ ఖర్చుతో వైద్యం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నిమ్స్ న్యూరో సర్జన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరుమల్ బృందం మంగళవారం కార్తీకకు ఆపరేషన్ నిర్వహించగా, ఐసీయూలో కోలుకుంటున్నది. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క కూడా కార్తీక ఆరోగ్య పరిస్థితిపై నిమ్స్ డాక్టర్లను అడిగి తెలుసుకుంటున్నారని అధికారులు తెలిపారు.

మీ ఫ్యాన్లు మాకొద్దు

బీఆర్‌ఎస్ విరాళాన్ని నిరాకరించిన ప్రిన్సిపాల్

గంగాధర, ఆగస్టు 13: కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో గల మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలకు బీఆర్‌ఎస్ నాయకులు విరాళంగా ఇచ్చిన 8 ఫ్యాన్లను ప్రిన్సిపాల్ నిరాకరించారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రెండు రోజుల క్రితం గురుకుల పాఠశాలను సందర్శించగా.. ఫ్యాన్లు లేక ఇబ్బందులు పడుతున్నట్టు విద్యార్థులు తెలిపారు. దీంతో మంగళవారం 8 ఫ్యాన్లను స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో పంపించారు. వారు తెచ్చిన ఫ్యాన్లను పాఠశాల ప్రిన్సిపాల్ మంజుల తీసుకోవడానికి నిరాకరించారు.

గురుకులాలను నిర్వీర్యం చేసే కుట్ర

సర్కారు కండ్లు తెరవకపోతే గురుకుల పరిరక్షణ ఉద్యమం: ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): ప్రపంచ స్థాయికి ఎదిగిన తెలంగాణ సంక్షేమ గురుకుల పాఠశాలలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతున్నదని బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ మాజీ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గౌలిదొడ్డిలోని గురుకుల పాఠశాలకు మూడున్నర నెలలుగా జీతాలు రావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. గురుకులాల్లో జరుగుతున్న పరిణామాలకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనలో ప్రపంచ స్థాయికి ఎదిగిన గురుకులాలు ఇప్పుడు మృత్యుకుహరాలుగా మారాయని ఆవేదన వ్యక్తంచేశారు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, క్రీడా అకాడమీల్లో పనిచేస్తున్న ఫ్యాకల్టీకి మూడు నెలలు జీతాలు ఇవ్వకపోవడం అనేది పక్కాగా అభివృద్ధి చేసిన గురుకులాల మీద, దళిత వర్గాల మీద జరుగుతున్న అతిపెద్ద కుట్రగా పేర్కొన్నారు. గురుకుల ఫ్యాకల్టీ జీతాలు వెంటనే చెల్లించకపోతే ప్రజలు మరో తెలంగాణ గురుకుల పరిరక్షణ ఉద్యమానికి సిద్ధమవుతారని హెచ్చరించారు.

సీతారామ కోసమే బీఆర్‌ఎస్‌లో చేరా: తుమ్మల

ఖమ్మం, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే సీతారామ ప్రాజెక్టుకు బీజం పడిందని, అప్పటి ప్రభుత్వం గోదావరి జలాలతో జిల్లాను సస్యశ్యామలం చేస్తామని హామీ ఇవ్వడం వల్లే తాను బీఆర్‌ఎస్‌లో చేరానని, అప్పటి సీఎం కేసీఆర్ మంత్రివర్గంలో భాగస్వామిని అయ్యానని, ఆ మేరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీతారామకు నిధులు కేటాయించి పనులు చేపట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వెచ్చించిన రూ.8 వేల కోట్లతో అందుబాటులోకి వచ్చిన లింక్ కెనాల్ ద్వారా మాత్రమే రైతులకు సాగునీరు అందించనున్నట్టు స్పష్టంచేశారు. 15న సీఎం రేవంత్‌రెడ్డి నీటిని విడుదలను ప్రారంభిస్తారని తెలిపారు. లక్షలాది ఎకరాలకు సాగునీరందించే స్థాయిలో సీతారామ పూర్తి కాలేదని, పూర్తికావాలంటే మరో రూ.10 వేల కోట్లతోపాటు ఐదేండ్ల సమయం కావాలని పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 40 ఏండ్లుగా రాజకీయాల్లో ఉంటూ అనేక ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసిన తనకు.. చిల్లర రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. సీతారామ ప్రాజెక్టుపై మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు తనను బాధించాయని, బీఆర్‌ఎస్ చేసిన పనిని తాము చెప్పుకుంటున్నట్టు జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రమూ నిజం లేదని తుమ్మల వ్యాఖ్యానించారు.

ఐదుగురు విద్యార్థినులకు అస్వస్థత

గొల్లపల్లి గురుకులంలో ఘటన • పెద్దాపూర్ ఘటన మరువకముందే మరోటి..



దవాఖానలో చికిత్స పొందుతున్న శ్రీజ

గొల్లపెల్లి, ఆగస్టు 13: జగిత్యాల జిల్లా గొల్లపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఐదుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో జరిగిన ఘటన మరువకముందే మరోసారి ఇలా జరగడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న భవ్యశ్రీ, శ్రీజ, తొమ్మిదో తరగతి విద్యార్థినులు అమిత, శ్రావ్య, రిషిత మంగళవారం మధ్యాహ్నం హాస్టల్‌లో భోజనం చేశారు. తర్వాత పంద్రాగస్టు సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో పాల్గొనేందుకు మైదానానికి చేరుకున్నారు. పీఈటీ సునీత ఖోఖో ఆడిస్తుండగా, మొదట భవ్యశ్రీ అస్వస్థతకు గురైంది. అనంతరం మరో నలుగురు అస్వస్థతకు గురయ్యారు. అప్రమత్తమైన ప్రిన్సిపాల్ సుష్మిత సదరు విద్యార్థినులను జగిత్యాల దవాఖానకు తరలించారు. విద్యార్థినులు శ్వాస సంబంధిత సమస్య తో బాధపడుతున్నారని వైద్యులు తెలిపారు. భయాందోళనకు గురైన వారి తల్లిదండ్రులు దవాఖానకు చేరుకున్నారు.

రేపు సీతారామ పంపులు ప్రారంభిస్తాం

- మంత్రులు ఉత్తమ్, పొంగులేటి

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): సీతారామ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టులోని మూడు పంపులను 15న ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. హైదరాబాద్‌లోని జలసౌధలో మంగళవారం మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. 2026 ఆగస్టు 15 నాటికి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. సీతారామ ప్రాజెక్టుపై రూ.500 కోట్లు మాత్రమే ప్రభుత్వం ఖర్చు చేసిందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

నిమ్స్‌లో విద్యార్థి ఆరోగ్యంపై మంత్రి ఆరా

మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు ఆదేశం



విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని వైద్యురాలిని అడిగి తెలుసుకుంటున్న మంత్రి సీతక్క

ములుగు, ఆగస్టు 13 (నమస్తేతెలంగాణ): ములుగు జిల్లా కేంద్రంలోని బండారుపల్లి గురుకుల పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థి వేల్పుల కార్తీక్ ఈ నెల 2న పాముకాటుకు గురై హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క మంగళవారం నిమ్స్‌కు వెళ్లి కార్తీక్ కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న కార్తీక్ వద్దకు చేరుకొని ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

సెప్టెంబర్ రెండో వారంలోగా ట్రిపుల్ ఆర్ భూసేకరణ

కలెక్టర్లకు సీఎస్ ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టుకు అవసరమైన భూములను సేకరించే ప్రక్రియను సెప్టెంబర్ రెండో వారంలోగా పూర్తిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. భూసేకరణకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని స్పష్టంచేశారు. సచివాలయంలో మంగళవారం ట్రిపుల్ ఆర్‌పై జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టుకు సంబంధించి పెండింగులో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్ల అధ్యక్షతన కమిటీలను ఏర్పాటుచేసి భూముల మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కోర్టు కేసులపై కూడా చొరవ తీసుకుని త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. రోడ్లు భవనాలశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి వికాస్‌రాజ్, ప్రభుత్వ సలహాదారులు శ్రీనివాస్‌రాజు, రెవిన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, అటవీ శాఖ అడిషనల్ సెక్రటరీ ప్రశాంతి, ఆర్ అండ్‌బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, సంయుక్త కార్యదర్శి హరీశ్, రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, యాదాద్రి, సిద్దిపేట కలెక్టర్లు సమీక్షలో పాల్గొన్నారు.

పెట్టుబడి.. కట్టుకథ





బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన ఒప్పందం

మొదటిపేజీ తరువాయి...

పెడుతున్నారు. అమెరికా పర్యటనలో భాగంగా రేవంత్ బృందం ఒప్పందాలు చేసుకొన్న కొన్ని కంపెనీలు నెలల ముందే ప్రారంభమవ్వడం, వాటికి సరైన కార్యాలయాలు, సిబ్బంది కూడా లేకపోవడం విమర్శలకు దారితీస్తున్నది. ఉదాహరణకు బయోఫ్యూయల్స్ తయారీ సంస్థ స్వచ్ఛబయోతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకొన్నది. రూ. వెయ్యి కోట్లను ఆ సంస్థ తెలంగాణలో పెట్టుబడిగా పెట్టనున్నట్టు రేవంత్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ డీల్ ఫలితంగా ప్రత్యక్షంగా 250 మందికి, పరోక్షంగా మరో 250 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నట్టు తెలిపింది. కిందటినెలలోనే ఏర్పాటై, ఇద్దరు ఉద్యోగులు కూడా లేని ఈ సంస్థ రాష్ట్రంలో రూ.వెయ్యి కోట్ల పెట్టుబడులు ఎలా పెడుతుందన్న ప్రశ్న అందరిలో కలుగుతున్నది. పైగా ఈ కంపెనీ సీఎం రేవంత్ సోదరుడు జగదీశ్వర్‌రెడ్డికి చెందినది కావడం, ఆ విషయాన్ని ప్రభుత్వవర్గాలు దాచడం వివాదాన్ని రేపిం ది. ఇక, తెలంగాణలోని వీ-హబ్‌లో రూ.42 కోట్లు, వీ-హబ్‌లోని స్టార్టప్ కంపెనీల్లో మరో రూ.839 కోట్ల మేర పెట్టుబడులు పెట్టడానికి వాల్ష్ కార్రా హోల్డింగ్స్ అనే సంస్థ ముందుకొచ్చినట్టు రేవంత్ ప్రభుత్వం ప్రకటించింది. నాలుగు నెలల కిందట ఏర్పడి, ఇప్పటివరకూ ఎలాంటి వార్షిక నివేదికలను విడుదల చేయని సదరు కంపెనీ అంత పెద్దమొత్తంలో పెట్టుబడులు ఎలా పెడుతుందన్న అనుమానాలు ప్రతిఒక్కరిలో కలుగుతున్నాయి. ప్రభుత్వం ఒప్పందం చేసుకొన్న మరో రెండు కంపెనీల చరిత్ర కూడా సరిగ్గాలేదని పారిశ్రామిక నిపుణులు ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. రేవంత్ అమెరికా పర్యటన అట్టర్‌ఫ్లాప్ అయ్యిందని, పెట్టుబడులు అన్నీ బోగస్‌గా మారాయని ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి వంటి వారు బహిరంగంగా విమర్శించడం చర్చనీయాంశమైంది. విస్తరణ పేరిట రేవంత్ ప్రభుత్వం మళ్లీ ఒప్పందం చేసుకోవడం ఏమిటని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. మొత్తంగా రేవంత్ అమెరికా పర్యటన ఓ ఫ్లాప్‌గా మారిందని సోషల్‌మీడియాలో పలువురు కామెంట్లు

బీఆర్‌ఎస్ హయాంలోనే ఒప్పందాలు

కంపెనీ పేరు	ఒప్పందం ఎప్పుడు?
ఆర్సీసీయం	09.05.2015, 13.08.2019
అమెజాన్	14.10.2016
మోనార్క్ ట్రాక్టర్స్	11.07.2022
అమెజాన్ వెబ్	21.01.2023
చార్లెస్ స్క్వాబ్	21.05.2023
ఆరమ్ ఈక్విటీ	23.05.2023
కార్నింగ్	01.09.2023

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వచ్చినవే

సీఎం అమెరికా పర్యటనలో భాగంగా చార్లెస్ స్క్వాబ్, ఆర్సీసీయం, అమెజాన్, ఆరమ్ ఈక్విటీ, మోనార్క్ ట్రాక్టర్స్, కార్నింగ్ వంటి దిగ్గజ కంపెనీలతోనూ ఎంవోయూలు కుదిరాయని సీఎం కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొన్నది. రాష్ట్రంలో విస్తరణకు, కొత్తకేంద్రాలు నెలకొల్పేందుకు ఆయా కంపెనీలు సంసిద్ధం వ్యక్తం చేశాయని వెల్లడించింది. ప్రభుత్వం పేర్కొన్న ఈ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో సేవలు ప్రారంభించాయి. బీఆర్‌ఎస్ హయాంలోనే పైన పేర్కొన్న కంపెనీలు ఒప్పందాలు చేసుకున్నాయి. డీల్‌లో భాగంగా విస్తరణ పనులు, కొత్త క్యాంపస్‌ల ఏర్పాటు చేస్తామని అప్పుడే ప్రకటించాయి. కేసీఆర్ హయాంలో వచ్చిన కంపెనీలతో ఇప్పుడు రేవంత్ సర్కారు 'విస్తరణ పేరిట' మళ్లీ ఒప్పందాలు చేసుకోవడం, వాటిని పెట్టుబడుల్లో చూపించడంపై నిపుణులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

సీఎం హైదరాబాద్‌ను రంగనాథ్‌కు రాసిచ్చారా?

- హైడ్రా కమిషనర్ తీరుపై సీఎంకు ఫిర్యాదు చేస్తా
- అధికారులపై ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

హైదరాబాద్ సిటీబ్యూరో/హిమాయత్‌నగర్, ఆగస్టు 13: హైదరాబాద్ విపత్తు ఉపశమనం, ఆస్తుల పరిరక్షణ సంస్థ (హైడ్రా) కమిషనర్ రంగనాథ్‌కు హైదరాబాద్‌పై ముఖ్యమంత్రి పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) రాసివ్వలేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. హైదరాబాద్‌లో తన ఇష్టం వచ్చిన రీతిలో కమిషనర్ రంగనాథ్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికారులు హద్దుమీరి ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 10న నందగిరి హిల్స్, గురుబ్రహ్మనగర్‌లోని పార్కు ప్రహరి గోడను కూల్చివేసిన ఘటనలో దానం నాగేందర్ ప్రమేయంపై జీహెచ్‌ఎంసీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ఈ నెల 12న కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం హైదర్‌గూడ, అవంతినగర్‌లో దానం నాగేందర్ మీడియాతో మాట్లాడారు. కమిషనర్ రంగనాథ్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో సభాహక్కుల నోటీసు ఇస్తానని చెప్పారు. రంగనాథ్‌కు తన ఉద్యోగం నచ్చకనే ఈ విధంగా వ్యవహరిస్తున్నారేమోనని వ్యాఖ్యానించారు. పార్కు వద్ద కొందరు ప్రైవేట్ వ్యక్తులు గోడ నిర్మించారని స్థానికులు ఆవేశంతో తన ప్రమేయం లేకుండా ఆ గోడను కూల్చివేసిన మాట వాస్తవమేనని, దీనికి అధికారులు హద్దు మీరి పనిచేయడం సబబు కాదని అన్నారు. ఆ ప్రదేశంలో గుడిసెలుండొద్దు, ఎస్సీలు, ఎస్టీలు ఉండొద్దు అనే హక్కు రంగనాథ్‌కు లేదని చెప్పారు. ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా ఆయన వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తనపై తప్పుడు ఆరోపణలు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

ఇలా మొదలైంది!

గ్రేటర్ హైదరాబాద్‌లో ఆక్రమణలపై చర్యలకు దిగిన హైడ్రా.. ఐదు రోజుల క్రితం జూబ్లీహిల్స్ రోడ్ నం. 52లోని నందగిరిహిల్స్ హుడా లే అవుట్‌లోని ఖాళీ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలు, డబ్బాలను కూల్చివేసింది. కమిషనర్ రంగనాథ్ దగ్గరుండి అక్రమ నిర్మాణాలను కూల్చివేయించారు. భవిష్యత్తులో ఈ స్థలం ఎలాంటి అక్రమణలకు గురికాకుండా వెంటనే స్థానిక కాలనీ వాసుల సహకారంతో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టారు. విధి నిర్వహణలో ఎవరు అడ్డొచ్చినా డోంట్ కేర్ అంటూ శాశ్వత చర్య దిశగా రంగనాథ్ రాత్రికి రాత్రే ప్రహరీ గోడ నిర్మాణాన్ని పూర్తి చేశారు. దీంతో రంగనాథ్ తీరుపై దానం నాగేందర్ భగ్గుమన్నారు. ఈ నెల 10న అక్కడి బస్తీవాసులు ఆ ప్రహరీగోడను కూల్చివేశారు. దానం ప్రోత్సాహంతోనే గోడను కూల్చివేశారని ఆరోపిస్తూ హైడ్రా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌ఛార్జి వీ పాపయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై జూబ్లీహిల్స్ పోలీసులు పీడీపీపీ యాక్ట్ కింద దానం, మరికొందరిపై కేసు నమోదుచేశారు.

రాష్ట్రంలో పడిపోతున్న విద్యాప్రమాణాలు

- సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తెలంగాణలో విద్యాప్రమాణాలు పడిపోతున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో సొంతిల్లు అవసరం ఉన్న పేద కుటుంబాల జాబితాను త్వరగా రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి అందించాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డికి మంగళవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల పనితీరును నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్స్ స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. నిరుడి కంటే ఈసారి జాతీయ స్థాయిలో ఉస్మానియా యూనివర్సిటీ ర్యాంకింగ్ తగ్గి 70వ ర్యాంకుతోనే సరిపెట్టుకున్నదని తెలిపారు. కళాశాలల విభాగంలోనూ టాప్ 100లో తెలంగాణ నుంచి ఒక్క కాలేజీకీ స్థానం దక్కలేదని తెలిపారు. యూనివర్సిటీల్లో 2,400 ఖాళీలు వెక్కిరిస్తున్నాయని, నిధులు సిబ్బంది వేతనాలకే సరిపోతున్నాయని, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు నిధులు అందడం లేదని విమర్శించారు.

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

బుధవారం WEDNESDAY 14.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14+4+8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం Pages: 14+4 + 8 Pages NIPUNA supplement | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 70 ‖ వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

నవమి

సూర్యోదయం: 5-59, సూర్యాస్తమయం: 6-42. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం శుక్ల పక్షం తిథి: నవమి ఉదయం 10-24 వరకు, తదుపరి దశమి. నక్షత్రం: అనురాధ పగలు 12-12 వరకు, తదుపరి జ్యేష్ఠ. వర్జ్యం: సాయంత్రం 5-58 నుంచి రాత్రి 7-37 వరకు. రాహుకాలం: పగలు 12-20 నుంచి పగలు 1-55 వరకు. దుర్ముహూర్తం: పగలు 11-55 నుంచి పగలు 12-45 వరకు. అమృతకాలం: రాత్రి 3-50 నుంచి తెల్లవారుజామున 5-28 వరకు.



2036 నాటికి 152 కోట్లు › 7

దేశ జనాభాపై అంచనా.. మెరుగవనున్న లింగ నిష్పత్తి

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

అసిస్టెంట్‌కు ఎర.. చిక్కిన సొర

ఏసీబీ వలలో రంగారెడ్డి అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి

- నిషేధిత జాబితా నుంచి భూమిని తొలగించేందుకు రూ.8 లక్షలు
- లంచానికి ఓకే చెప్పి.. ఏసీబీకి ఫిర్యాదు చేసిన బాధితుడు
- కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్‌కు గాలం.. చిక్కిన అదనపు కలెక్టర్
- డబ్బులు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ
- సినిమాను తలపించిన అరెస్టు.. రాత్రంతా కలెక్టరేట్‌లో విచారణ
- 16 లక్షల నగదు, కీలకపత్రాలు స్వాధీనం.. 14 రోజుల రిమాండ్

రంగారెడ్డి, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): అది సోమవారం రాత్రి 8:30 గంటలు. కొంగరకలాన్.. చుట్టూ సంజీవని వనం. సమీపంలో గుర్రంగూడ ఎక్స్ రోడ్డు. వాహనాలన్నీ పరుగులు తీస్తున్నాయి. పెద్ద సారు అప్పజెప్పిన పనిని పూర్తి చేయడానికి రంగారెడ్డి కలెక్టరేట్‌కు చెందిన సీనియర్ అసిస్టెంట్ మధుమోహన్‌రెడ్డి అక్కడికి చేరుకున్నాడు. ఈలోపు ఓ బాధితుడు తన పని కోసం రూ.8 లక్షల లంచం ఇచ్చేందుకు అక్కడ వేచి ఉన్నాడు. ఆ డబ్బును బాధితుడి నుంచి మదన్‌మోహన్‌రెడ్డి తీసుకుని లెక్కించటం మొదలెట్టాడు. ఈలోపు అక్కడ మాటువేసిన ఏసీబీ అధికారులు రెప్పపాటులో మదన్ మోహన్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. సీన్ కట్ చేస్తే తూచ్.. 'ఇది నేను కాదు.. మా పెద్ద సారు చెప్పాడు. నన్ను వదిలేయండి' అని మొరపెట్టుకున్నాడు. కావాలంటే నిరూపిస్తానన్నాడు. ఎవరా పెద్ద సారు? అని అడిగితే.. అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి అని చెప్పాడు. సీన్ కట్ చేస్తే.... ఇదే లొకేషన్ › 6వ పేజీలో



లంచం సొమ్ముతో పట్టుబడిన రంగారెడ్డి అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ మధుమోహన్‌రెడ్డి

నో చాన్స్..!

ఎన్ని ఎత్తులు వేసినా మా నుంచి తప్పించుకోలేరు

అవినీతిపరులకు ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ హెచ్చరిక



హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): లంచం తీసుకునేవారు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా అవినీతి నిరోధకశాఖ నుంచి తప్పించుకోలేరని ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. అందుకు అడిషనల్ కలెక్టర్, భూపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి నిదర్శనమని తెలిపారు. ఏసీబీ బృందం చాకచక్యంగా వ్యవహరించి, అప్పటికప్పుడు ప్రణాళికలు మార్పు చేసుకుంటూ ఇద్దరినీ ట్రాప్ చేసిందని పేర్కొన్నారు.

గురుకులాల్లో మృత్యుఘోషపై బీఆర్‌ఎస్ పోరాటం ప్రారంభించగానే ప్రభుత్వంలో కదలిక మొదలైంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా నేతలు ప్రభుత్వ లోపాలను ఎక్కడికక్కడ ఎత్తిచూపారు. సోమవారం పెద్దాపూర్‌లో మృతిచెందిన విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్.. సర్కారు స్పందనరాహిత్యంపై చురకలు అంటించారు. 'పసిమొగ్గలు రాలుతున్నా స్పందించరా' అని ప్రశ్నించారు. చివరికి సర్కార్ స్పందించక తప్పలేదు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో ప్రభుత్వం తనిఖీలు చేపట్టింది. డిప్యూటీ సీఎం భట్టి పెద్దాపూర్ గురుకులాన్ని పరిశీలించారు.



పెద్దాపూర్ గురుకులంలో మృతిచెందిన విద్యార్థి అనిరుధ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

కేటీఆర్ చురక

సర్కార్‌లో కదలిక

- దిగివచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. గురుకులాల్లో తనిఖీలు
- ఏసీబీ, ఫుడ్‌సేఫ్టీ, తూనికలశాఖ సిబ్బందితో బృందాలు
- పెద్దాపూర్ గురుకులాన్ని పరిశీలించిన డిప్యూటీ సీఎం
- మృతుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగమిస్తాం: భట్టి
- సర్కారు మొద్దునిద్ర వీడినందుకు సంతోషం: కేటీఆర్
- కాంగ్రెస్ పాలనలో దిగజారుతున్న గురుకులాలు: హరీశ్

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న గురుకులాలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీయడంతో రేవంత్ సర్కారులో కదలిక వచ్చింది. ఓవైపు బీఆర్‌ఎస్ ఒత్తిడి, మరోవైపు ప్రజల్లో వెల్లువెత్తుతున్న ఆందోళనలతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకులంలో మృతిచెందిన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన అనిరుధ్ కుటుంబాన్ని సోమవారం పరామర్శించిన కేటీఆర్, ఏ తల్లీ గర్భశోకంతో బాధపడకూడదంటూ గురుకులాల పనితీరు, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. పిల్లల సంరక్షణ బాధ్యత ప్రభుత్వమే చూసుకోవాలని చెప్పడంతో 24 గంటల్లోనే సర్కారు స్పందించి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమశాఖ మంత్రి › 10వ పేజీలో

పెట్టుబడి.. కట్టుకథ

ఊరూపేరూ లేని కంపెనీలతో రేవంత్ టీమ్ ఒప్పందాలు..!

- స్వచ్ఛ్ బయో, వాల్ష్ కార్రా ప్రకటనలతో దుమారం
- ఇదివరకే వచ్చిన సంస్థలతో విస్తరణ పేరిట మళ్లీ డీల్స్
- సీఎం పది రోజుల అమెరికా పర్యటనలో జరిగిందిదే!
- రూ.31,500 కోట్ల పెట్టుబడులంటూ సర్కార్ ప్రచారం
- వాస్తవాలను దాచి ప్రచారం చేసుకోవడంపై విమర్శలు
- బీఆర్‌ఎస్ సర్కార్ గత ఒప్పందాలతో నెటిజన్ల కౌంటర్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): పెట్టుబడులే లక్ష్యంగా సీఎం హోదాలో తొలిసారిగా రేవంత్‌రెడ్డి పది రోజులపాటు అమెరికా పర్యటనకు వెళ్లారు. ఈ నెల 3న ప్రారంభమైన ఈ పర్యటనలో రూ. 31,500 కోట్ల పెట్టుబడులను సాధించినట్టు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. 19 కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) చేసుకున్నట్టు వివరించింది. దీంతో రాష్ట్రంలో కొత్తగా 30,750 ఉద్యోగాలు లభించనున్నట్టు తెలిపింది. అయి తే, రేవంత్ అమెరికా పర్యటనలో భాగంగా ఎంవోయూ చేసుకొన్న కంపెనీల్లో కొన్ని బోగస్ కంపెనీలు ఉన్నట్టు తెలుస్తున్నది. అంతేకాదు.. రేవంత్ బృందం ఒప్పందం చేసుకొన్న మరికొన్ని దిగ్గజ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో సేవ లు ప్రారంభించాయని, బీఆర్‌ఎస్ హయాంలోనే ఆయా కంపెనీలతో ఒప్పందాలు జరిగాయని, ఇప్పుడు అవే కంపెనీలతో సేవల › 10వ పేజీలో



వెయ్యి కోట్ల పెట్టుబడి.. ఆఫీసు ఇది!

తెలంగాణలో రూ. వెయ్యి కోట్ల పెట్టుబడులు పెట్టనున్న 'స్వచ్ఛ్‌బయోగ్రీన్' హైదరాబాద్‌లోని కార్యాలయం ఇదే.



ఉప్పు, చక్కెరలోనూ మైక్రోప్లాస్టిక్స్

అన్ని భారత బ్రాండ్లలో గుర్తింపు › 7



బీటెక్ మేనేజ్‌మెంట్ సీట్లకు రెక్కలు

సీట్ల కన్వర్షన్‌కు సర్కారు నో

మేనేజ్‌మెంట్ సీట్ల కోసం విద్యార్థుల వెతుకులాట › 5

15 లక్షల వరకు డిమాండ్

నేడు వైద్యసేవల బహిష్కరణ

కోల్‌కతా ఘటనను నిరసిస్తూ జూనియర్ డాక్టర్లు, సీనియర్, సూపర్ స్పెషాలిటీ రెసిడెంట్ల నిర్ణయం › 8

ఉద్యోగ జేఏసీ ఝలక్!



- ఉద్యోగుల అల్టిమేటంతో ప్రభుత్వంలో వణుకు
- భవిష్యత్తు కార్యాచరణపై అధికారవర్గాల ఆరా
- సంఘాల నేతలపై ఇంటెలిజెన్స్ వర్గాల నిఘా?
- సర్కారు తీరుపై రగులుతున్న ఎంప్లాయీస్
- మరో పోరాటానికి సిద్ధమంటున్న సంఘాలు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : 'కొత్త ప్రభుత్వమని ఇన్నాళ్లు ఓపిక పట్టినం. సర్కారుకు కాస్త వెసులుబాటు ఇవ్వాలని ఆగినం. సమస్యలు పరిష్కరించాలని విజ్ఞాపనలు, వినతిపత్రాలిచ్చి వేడుకున్నం. 8 నెలలైనా ఒక్కటి కూడా పరిష్కారం కాక మాపై కింది స్థాయి ఉద్యోగుల నుంచి ఒత్తిడి పెరిగింది. రాష్ట్రస్థాయి క్యాడర్‌కు మేం సమాధానం చెప్పుకోగలుగుతున్నాం కానీ కింది స్థాయి క్యాడర్‌కు చెప్పుకోలేకపోతున్నం. వాళ్లు వినేలా లేరు. ఇది ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. గతంలో తెలంగాణ సాధన కోసం ఉద్యోగులమంతా జేఏసీగా ఏర్పడ్డం.. కొట్లాడినం. మళ్లీ ఇప్పుడు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సంఘాలన్నీ కలిసి జేఏసీగా ఏర్పడాల్సి వచ్చింది.' 'మేమేం గొంతెమ్మ కోరికలు కోరడంలేదు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టినవే అడుగుతున్నం. తక్షణమే › 3వ పేజీలో



రుణమాఫీలో రైతుకు ద్రోహం జరిగింది

2 లక్షల వరకు మాఫీ చేస్తానన్న సీఎం రేవంత్ ఇంతవరకూ పూర్తి చేయలేదు

ఎంపీ బలరాంనాయక్ వ్యాఖ్యలు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 13 : రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నోసార్లు చెప్పారని కానీ ఇప్పటి వరకు చేయలేదని మహబూబాబాద్ కాంగ్రెస్ ఎంపీ పోరిక బలరాంనాయక్ అన్నారు. రుణమాఫీలో రైతుకు ద్రోహం జరిగిందని ఆయన అంగీకరించారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి › 2వ పేజీలో

ఉచితాలకు పైసలుంటయ్.. పరిహారానికి లేవా?

ఇలాగే ఉంటే, ఉచిత పథకాలు రద్దు చేస్తాం

భూ పరిహారానికి సంబంధించిన కేసులో మహారాష్ట్ర సర్కారుపై సుప్రీంకోర్టు సీరియస్



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): అటవీ భూమిలో నిర్మాణాలు, బాధిత వ్యక్తికి పరిహారం చెల్లింపులో అలసత్వం వహించడంపై మహారాష్ట్రలోని షిండే సర్కారుపై సుప్రీంకోర్టు తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. 'లాడ్లీ బెహనా', 'లడ్కా భౌ' వంటి ఉచిత పథకాల కోసం ప్రభుత్వం దగ్గర నిధులు ఉంటాయిగానీ, బాధితులకు పరిహారం చెల్లించడానికి మాత్రం పైసలు ఉండవా? అంటూ › 7వ పేజీలో



హైదరాబాద్‌ను రంగనాథ్‌కు రాసిచ్చారా?

హైడ్రా కమిషనర్ తీరుపై సీఎంకు ఫిర్యాదు చేస్తా.. అధికారులపై ఎమ్మెల్యే దానం ఆగ్రహం › 10

శాసనసభాహక్కుల ఉల్లంఘన నోటీస్ ఇస్తానని వార్నింగ్

కొత్త పంచాయతీలు 223 › 6

రాష్ట్రంలో 12,991కి చేరిన జీపీల సంఖ్య



ఏపీ నెత్తిన సర్కారు పాలు!

తెలంగాణ డెయిరీని మూసేసే కుట్ర?

- ఆంధ్ర డెయిరీలను పెంచి పోషిస్తున్నారా?
- విజయ పాడిరైతులకు రూ. కోట్ల బకాయిలు
- నాలుగు నెలలుగా డబ్బులు చెల్లించని సంస్థ
- 15 రోజుల్లో చెల్లించకుంటే ఆందోళన చేస్తాం
- మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరిక

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విజయ డెయిరీకి పాలు పోస్తున్న రైతులకు నాలుగు నెలలుగా కోట్లాది రూపాయల బకాయిలను చెల్లించడంలేదని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. విజయ డెయిరీని బొందపెట్టి ఆంధ్రా డెయిరీలను పెంచి పోషించే కుట్ర జరుగుతున్నదా? అనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. గతంలో ప్రతి 15 రోజులకు ఒకసారి చెల్లింపులు చేసేవారమని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నాలుగు నెలలుగా చెల్లింపులు చేయడంలేదని మండిపడ్డారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియా › 2వ పేజీలో

ఇందిరాసాగర్ చెరువుకు ఉరి!

- 'అసైన్డ్ భూముల్లో వెంచర్' వ్యవహారంలో కొత్త కోణం
- 512 ఎకరాల ఆయకట్టు ఉన్న చెరువుకు కబ్జాల ముప్పు



- గుట్టలను తొలిచి రాళ్లు, మట్టి బఫర్ జోన్‌లో పారబోత
- కుంచించుకుపోతున్న 18 ఎకరాలకుపైగా విస్తీర్ణమున్న కాల్వ
- భవిష్యత్తులో దిగువన ఉన్న అనాజ్‌పూర్ చెరువుకూ తీవ్ర నష్టం
- హైడ్రా పరిధిలోని ఓ నీటి వనరుకు ప్రమాద ఘంటికలు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా ఏర్పడక ముందు నిర్మించిన ఇందిరాసాగర్.. అంటే 1980లోనే అందుబాటులోకి వచ్చిన నీటి వనరుకు ఇప్పుడు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఎగువన రావిర్యాల నుంచి వరద నీరు వచ్చి చేరడంతో వందల ఎకరాల ఆయకట్టుకు జీవం పోసే చెరువుకు అకస్మాత్తుగా 'రియల్' ముప్పు వచ్చిపడింది. ఇందిరాసాగర్‌కు వరద నీటిని మోసుకొచ్చే దాదాపు వంద ఫీట్ల వెడల్పుతో ఉండే ఫీడర్ చానెల్‌తోపాటు బఫర్‌జోన్ పెద్ద పెద్ద బండరాళ్లు, మట్టితో కుంచించుకుపోతున్నది. ఎత్తయిన గుట్టలతో పర్యాటక ప్రాంతంగా విరాజిల్లిన ఇందిరాసాగర్‌కు ఇప్పుడు ఆ గుట్టలే › 6వ పేజీలో

వంద ఫీట్ల రహదారులపై హైడ్రామా


పొలాలకు వెళ్లేందుకే రహదారుల నిర్మాణమట

రైతులు కోరితేనే నిర్మాణ సంస్థ పనులు చేపట్టిందట

రైతుల కోసమే అయితే వంద ఫీట్ల రోడ్డెందుకు?

ప్రశ్నించిన ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీత

రెండు రోజుల్లో పీవోటీ కింద స్వాధీనం › 6



రేపటిలోగా మాఫీ చేయాలి

› 2

- ఆగస్టు 15 లోగా పూర్తిచేస్తానన్న ముఖ్యమంత్రి ఎక్కడ?
- 31 వేల కోట్లకు మీరు మాఫీ చేసింది 18 వేల కోట్లా ?
- రుణమాఫీ చేయకుంటే కాంగ్రెసోళ్లు పల్లెల్లో తిరగలేరు
- రవాణా శాఖ అవినీతిపై పొన్నం శ్వేతపత్రం ఇస్తారా?
- బీఆర్‌ఎస్ నేతలు పెద్ది సుదర్శన్, ఎర్రోళ్ల శ్రీనివాస్ ధ్వజం

ఉప్పు, చక్కెరలోనూ మైక్రోప్లాస్టిక్స్



న్యూఢిల్లీ, ఆగస్టు 13: చిన్నాపెద్ద, ప్యాక్డ్, అన్‌ప్యాక్డ్ అన్న తేడాలేకుండా ఇండియాలో దొరికే అన్ని ఉప్పు, చక్కెర బ్రాండ్లలో మైక్రోప్లాస్టిక్స్ ఉన్నాయని తాజా అధ్యయనంలో వెల్లడైంది. మంగళవారం టాక్సిక్స్ లింక్ అనే పర్యావరణ హిత సంస్థ విడుదల చేసిన 'మైక్రోప్లాస్టిక్స్ ఇన్ సాల్ట్ అండ్ షుగర్' నివేదికలో ఈ సంచలన విషయాలు బయటపడ్డాయి. టేబుల్ సాల్ట్, రాక్ సాల్ట్, సీ సాల్ట్, రా సాల్ట్‌తో పాటు ఐదు రకాల చక్కెరలను పరిశీలించగా.. అన్ని శాంపిళ్లలో 0.1 ఎంఎం నుంచి 5 ఎంఎం పరిమాణం కలిగిన మట్టిబెడ్డలు, ఫైబర్, ఫిల్మ్స్ బయటపడ్డాయని నివేదిక వెల్లడించింది. అత్యధికంగా అయోడైజ్డ్ ఉప్పులో పలు రకాల ఫైబర్, ఫిల్మ్ మైక్రోప్లాస్టిక్స్ కనిపించాయని తెలిపింది. ఒక కిలో ఉప్పులో 6.71 నుంచి 89.15 మైక్రోప్లాస్టిక్ ముక్కలు ఉంటున్నాయని వివరించింది. ఆర్గానిక్ ఉప్పులో అత్యల్పంగా 6.70 మైక్రో ప్లాస్టిక్ ముక్కలు, అత్యధికంగా అయోడైజ్డ్ ఉప్పులో 89.15 మైక్రోప్లాస్టిక్ ముక్కలు ఉన్నట్టు పేర్కొన్నది.

3000 అడుగుల ఎత్తయిన బ్యాటరీ



న్యూయార్క్: విద్యుత్తు నిల్వలో ఉన్న సవాళ్లను అధిగమించేందుకు ఆకాశహర్మ్యాల లాంటి బ్యాటరీలు నిర్మించేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇవి ప్రపంచంలోనే ఎత్తైన నిర్మాణాలుగా మారనున్నాయి. ఇందుకోసం బుర్జ్ ఖలీఫా, వన్ వరల్డ్ ట్రేడ్ వంటి నిర్మాణాలను డిజైన్ చేసిన స్కిడ్‌మోర్, ఓవింగ్స్ ఆండ్ మెర్రిల్(ఎస్‌ఓఎం), విద్యుత్తు నిల్వ సంస్థ అయిన ఎనర్జీ వాల్ట్ అనే సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ రెండు సంస్థలు కలిసి భారీ బ్యాటరీ బ్లాకులతో కూడిన ఆకాశహర్మ్యాలను నిర్మించనున్నాయి. వీటి ఎత్తు 985 అడుగుల నుంచి 3,300 అడుగుల వరకు ఉండనుంది. వీటిల్లో పునరుత్పాదక విద్యుత్తును నిల్వ చేస్తారు. విద్యుత్తు డిమాండ్ పెరిగినప్పుడు ఈ బ్యాటరీల నుంచి సరఫరా చేస్తారు. డిమాండ్ తగ్గినప్పుడు ఉత్పత్తయ్యే విద్యుత్తును వీటిల్లో నిల్వ చేస్తారు. ఎనర్జీ వాల్ట్ సంస్థ ఇప్పటికే చైనాలో 492 అడుగుల ఎత్తైన విద్యుత్తు నిల్వ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు ప్రపంచంలో ఎత్తైన భవనంగా బుర్జ్ ఖలీఫా(2,717 అడుగులు) ఉంది.

ఐఐటీ మండిలో పునర్జన్మపై కోర్సు



మండి, ఆగస్టు 13: విద్యార్థులందరూ భగవద్గీత, పునర్జన్మ వంటి అంశాలను నేర్చుకోవాల్సిందే అంటూ ఐఐటీ మండి తీసుకున్న నిర్ణయంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం 'వివేకం, శ్రేయస్సు పరిచయం' పేరుతో ఓ కోర్సును ఐఐటీ మండి చేర్చింది. నూతనంగా ప్రారంభించిన ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్(ఐకేఎస్) విభాగం ఈ కోర్సును అందిస్తున్నది. ఇందులో సూక్ష్మ శరీరం, పునర్జన్మ, మరణానికి చేరువ, వంటి పలు అంశాలు ఉన్నాయి. దీంతో పాటు ప్రతి వారం విద్యార్థులంతా భగవద్గీత పారాయణం, యోగా తరగతులకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించింది. విద్యార్థుల హాజరును కూడా నమోదు చేస్తున్నది. ఐఐటీ మండి తీసుకున్న ఈ నిర్ణయాలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇది విద్యార్థులపై మతపరమైన ఆచారాలను రుద్దే ప్రయత్నమని పలువురు విమర్శిస్తున్నారు. 2022లో కొత్త డైరెక్టర్ వచ్చినప్పటి నుంచి ఇలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

యువతిపై ర్యాపిడో డ్రైవర్ అత్యాచారం

అస్సాంలో ఘటన

గువాహటి: లిఫ్ట్ ఇస్తానని చెప్పి ర్యాపిడో డ్రైవర్ ఒకరు యువతిపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన అస్సాంలో చోటుచేసుకుంది. ఉపాధి కోసం గువాహటికి వచ్చిన యువతి ఉద్యోగం కోసం మాలిగావ్‌లో ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ క్రమంలో ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఫకీర్‌ఖాన్ ఆమె దగ్గరకు వెళ్లి లిఫ్ట్ ఇస్తానని, ఉద్యోగం ఇప్పించడంలో సాయం చేస్తానని ఆమెను నమ్మించాడు. తర్వాత ఆమెను కామాఖ్య రైల్వేస్టేషన్ దగ్గరలోని ఒక నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్లి లైంగికదాడి చేశాడు. గాయపడిన ఆమెను ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్ వద్ద వదిలిపెట్టి వెళ్లిపోయాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

ఇద్దరు రోగులపై డాక్టర్ లైంగిక దాడి

చితకబాదిన బంధువులు..

ఒడిశాలో ఘటన

కటక్: చికిత్స కోసం వచ్చిన ఇద్దరు రోగులపై ఒడిశాలోని ఒక డాక్టర్ లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ ఘటన కటక్‌లోని ప్రముఖ ఎస్సీబీ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో ఈ నెల 11న చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఈసీజీ తీయించుకోవడానికి ఇద్దరు మహిళలు కార్డియో విభాగానికి రాగా, డ్యూటీలో ఉన్న ఒక డాక్టర్ వారిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో వారు తమ బంధువులకు తెలుపగా, వారు అతడికి దేహశుద్ధి చేశారు. తీవ్రంగా గాయపడిన డాక్టర్‌ను ఐసీయూకు తరలించారు.

బెయిల్ నిబంధన.. జైలు మినహాయింపు

ఉపా చట్టానికీ వర్తిస్తుంది

బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 13: 'బెయిల్ అనేది నిబంధన.. జైలు అనేది మినహాయింపు' అనే సూత్రం ఉపా చట్టం కింద నమోదైన కేసులకూ వర్తిస్తుందని సుప్రీంకోర్టు మంగళవారం పేర్కొన్నది. ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన కేసులో నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'బెయిల్ మంజూరు చేసే అవకాశం ఉన్న కేసు వచ్చినప్పుడు బెయిల్ ఇవ్వడానికి కోర్టు వెనకాడకూడదు. ప్రాసిక్యూషన్ ఆరోపణలు తీవ్రమైనవే అయినప్పటికీ చట్ట ప్రకారం బెయిల్ మంజూరు కోసం దాఖలైన కేసును పరిగణనలోకి తీసుకోవడం కోర్టు బాధ్యత. బెయిల్ ఒక నిబంధన.. జైలు మినహాయింపు అనేది నిర్దిష్ట సూత్రం. అర్హత ఉన్న కేసుల్లోనూ కోర్టులు బెయిల్‌ను తిరస్కరించడం ప్రారంభిస్తే, అది రాజ్యాంగంలోని 21వ అధికరణాన్ని ఉల్లంఘించడమే అవుతుంది' అని పేర్కొన్నది.

నిందితుడికి బెయిల్ మంజూరు

ఎన్‌ఐఏ 2022లో అరెస్టు చేసిన పాట్నాకు చెందిన రిటైర్డ్ పోలీస్ కానిస్టేబుల్ జలాలుద్దిన్ ఖాన్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. నిషేధిత పీఎఫ్‌ఐ సభ్యులకు ఇంటిని అద్దెకు ఇచ్చి, ఉగ్ర కార్యకలాపాల్లో పాలుపంచుకున్నాడని ఎన్‌ఐఏ ఆరోపించింది. అయితే, ఉపా చట్టంలో పేర్కొన్న చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో జలాలుద్దిన్ ఖాన్ పాల్గొన్నట్టు చార్జిషీట్‌లో ఏమీ లేదని కోర్టు పేర్కొన్నది.

వెల్లుల్లి.. కూరగాయా? మసాలా దినుసా?

ఏండ్ల వివాదానికి తెరదించిన మధ్యప్రదేశ్ హైకోర్టు

న్యూఢిల్లీ: వెల్లుల్లి.. ఇది లేకుండా మసాలా లేదు.. ఇది లేని వంట లేదు అంటే అతిశయోక్తి కాదు. ఇంతకీ వెల్లుల్లి మసాలా దినుసా, లేక కూరగాయా? అంటూ ఏళ్ల తరబడి సాగుతున్న వివాదానికి తెరదించుతూ మధ్యప్రదేశ్ హైకోర్టు వెల్లిగడ్డను కూరగాయ కిందే ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. అయితే దీనిని అటు మసాలా, ఇటు కూరగాయల మార్కెట్లలో అమ్మకాలు జరపవచ్చునంటూ తీర్పులో పేర్కొంది. వెల్లుల్లికి ఉన్న ఘాటు లక్షణంతో పాటు దానిని మసాలాల్లో తప్పక వినియోగిస్తారు కాబట్టి దానిని అందరూ మసాలా దినుసు కిందే భావిస్తుండే వారు. అయితే 2015లో మధ్యప్రదేశ్‌లోని రైతులు అది కూరగాయా? మసాలా అన్న విషయం తేలక న్యాయస్థానాలను ఆశ్రయించారు. అయితే కింది కోర్టుల్లో విభిన్న తీర్పులు రావడంతో వ్యాపారులు ఏ నిర్ణయానికీ రాలేకపోయారు. ఈ వివాదానికి ఎట్టకేలకు హైకోర్టు తీర్పుతో తెరపడింది.

వైద్యురాలిపై హత్యాచారం కేసు సీబీఐకి

- పోలీసులకు కలకత్తా హైకోర్టు ఆదేశాలు
- బాధితురాలి కండ్లు, జననాంగాల్లో రక్తస్రావం
- పోస్టుమార్టం నివేదికలో షాకింగ్ విషయాలు

కోల్‌కతా, ఆగస్టు 13: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం కేసు దర్యాప్తును కోల్‌కతా పోలీసుల నుంచి సీబీఐకి బదిలీ చేయాలని కలకత్తా హైకోర్టు మంగళవారం ఆదేశించింది. ఘటన జరిగి ఐదు రోజులు అయినప్పటికీ, దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నది. కేసు డైరీని సాయంత్రంలోగా, ఇతర డాక్యుమెంట్లను బుధవారం ఉదయం 10 గంటల్లోగా సీబీఐకి అప్పగించాలని ఆదేశించింది. విధుల బహిష్కరణను విరమించుకోవాలని రాష్ట్రంలో ఆందోళనలు చేస్తున్న వైద్యులను చీఫ్ జస్టిస్ శివజ్ఞానం నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం కోరింది. కాగా, కేంద్రమంత్రి నడ్డా తమ డిమాండ్లకు అంగీకరించడంతో నిరసనలను విరమిస్తున్నట్టు ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఫోర్డా) ప్రకటించింది.

బాధితురాలిపై క్రూరంగా దాడి

పోస్టుమార్టం నివేదికలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. నిందితుడు బాధితురాలిపై క్రూరమైన దాడికి పాల్పడ్డాడని, ఆమె శరీరంపై పలు చోట్ల గాయాలైనట్టు తేలింది. అదేవిధంగా తనపై లైంగిక దాడిని బాధితురాలు తీవ్రంగా ప్రతిఘటించడంతో పెనుగులాట చోటుచేసుకొన్నట్టు పోస్టుమార్టం నివేదిక చెబుతున్నది. ముఖంపై రక్తపు గాయాలున్నాయని, కండ్లలో నుంచి రక్తస్రావం అయిందని, బాధితురాలి జననాంగాల్లో తీవ్రమైన గాయం అయినట్టు తేలింది. గొంతు నులిమి ఊపిరాడకుండా చేయడంతో బాధితురాలు మరణించినట్టు పోస్టుమార్టం నివేదిక వెల్లడించింది.



ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా కోల్‌కతాలో పౌర సమాజం నిరసన ర్యాలీ

వైద్యుల రక్షణకు పాలసీ రూపొందించండి

మెడికల్ కాలేజీలకు ఎన్‌ఎంసీ సూచనలు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): ఇటీవల వైద్యులపై వరుసగా దాడులు జరుగుతున్న నేపథ్యంలో వారి రక్షణకు ప్రత్యేకంగా పాలసీని రూపొందించాలని నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ) సూచించింది. ఈ మేరకు అన్ని మెడికల్ కాలేజీలకు ఆదేశాలు జారీ చేసింది. ఓపీ, వార్డులు, క్యాజువాలిటీ, హాస్టళ్లు, క్యాంపస్‌లోని ఇతర ప్రదేశాలు, రెసిడెన్షియల్ క్వార్టర్లలో రక్షణ చర్యలు చేపట్టాలని కోరింది. ఎవరైనా వైద్య సిబ్బందిపై దాడులకు పాల్పడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆదేశించింది. ఈ ఘటనలపై 48 గంటల్లోగా నివేదికను ఎన్‌ఎంసీకి పంపాలని సూచించింది.

కేజ్రీవాల్ బదులు కైలాశ్ గెహ్లాట్

జెండా ఎగురవేయడానికి నామినేట్ చేసిన ఎల్జీ

ఆతిశీ పేరును తిరస్కరించిన సాధారణ పరిపాలన విభాగం

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీ ప్రభుత్వం ఛత్రసాల్ స్టేడియంలో నిర్వహించే వేడుకలో ఢిల్లీ హోంమంత్రి కైలాశ్ గెహ్లాట్ జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. సీఎం కేజ్రీవాల్ తీహార్ జైలులో ఉండటంతో కైలాశ్ పేరును ఎల్జీ వీకే సక్సేనా నామినేట్ చేశారు. కాగా, ఎవరు జెండా ఎగురవేయాలనే అంశంపై ఆప్, ఢిల్లీ ఎల్జీ మధ్య పేచీ మొదలైంది. తన బదులు విద్యాశాఖ మంత్రి ఆతిశీని జెండా ఎగురవేసేందుకు అనుమతించాలని ఇటీవల ఎల్జీకి కేజ్రీవాల్ జైలు నుంచి లేఖ రాశారు. అయితే, ఈ లేఖ సరైన సమాచార ప్రక్రియ కాదని పేర్కొంటూ కేజ్రీవాల్ విజ్ఞప్తిని సాధారణ పరిపాలన విభాగం పక్కన పెట్టింది. దీంతో హోంమంత్రి కైలాశ్ పేరును ఎల్జీ ప్రతిపాదించారు. జెండా ఎవరు ఎగురవేయాలనే దానికి సంబంధించి నిర్దిష్ట పద్ధతి ఉందని, ఇది పాటించకపోతే ఈ వేడుక పవిత్రత దెబ్బతింటుందని, అందుకే కైలాశ్ జెండా ఎగురవేస్తారని సాధారణ పరిపాలన విభాగం వివరించింది. గెహ్లాట్ ఎంపికను ఆప్ స్వాగతించింది. 'ఎంపికైన' వ్యక్తిని కాకుండా 'ఎన్నికైన' వ్యక్తిని నామినేట్ చేయడం ప్రజాస్వామ్యానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నది.

అంగారకుడిపై నీరు

న్యూయార్క్, ఆగస్టు 13: అంగారక గ్రహంపై నివాసయోగ్యతను గుర్తించేందుకు జరుగుతున్న పరిశోధనల్లో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. జీవుల మనుగడకు కీలకమైన నీటిజాడలను అంగారకగర్భంలో పరిశోధకులు గుర్తించారు. ఈ గ్రహం ఉపరితలానికి 20 కిలోమీటర్ల లోతులో నీటి జాడలు ఉన్నట్టు నాసాకు చెందిన మార్స్ ఇన్‌సైట్ ల్యాండర్ డాటాలో వెల్లడైంది. ఈ ల్యాండర్‌ను 2018లో అంగారక గ్రహంపైకి పంపారు. నాలుగేండ్లుగా ఇది అక్కడి సిస్మిక్ డాటాను నమోదు చేస్తున్నది. ఈ డాటాను పరిశీలించిన పరిశోధకులు.. అంగారక ఉపరితలం నుంచి 11.5 కిలోమీటర్ల నుంచి 20 కిలోమీటర్ల లోతు వరకు నీటి జాడలు ఉన్నట్టు భావిస్తున్నారు. ఉపరితలం నుంచి లోపలికి నీరు వెళ్లి ఇంకిపోయి ఉండొచ్చని పరిశోధకులు తెలిపారు.

మొండి సైనసైటిస్‌తో ఫంగల్ ఇన్ఫెక్షన్లు

న్యూఢిల్లీ: ఎంతకీ నయం కాని సైనసైటిస్ కారణంగా ఫంగల్ ఇన్ఫెక్షన్లు, ప్రాణాంతక సమస్యలు వచ్చే ముప్పు ఉంటుందని ఢిల్లీలోని సర్ గంగారామ్ హాస్పిటల్ వైద్యులు గుర్తించారు. ఇటీవల ఓ 27 ఏండ్ల వైద్యుడికి ఇదే సమస్య ఎదురైంది. మూడు నెలలుగా అతడికి కుడి వైపు ముక్కు మూసుకుపోయింది. తర్వాత ఆయన కుడి కన్ను చూపు కోల్పోయాడు. సీటీ స్కాన్ తీయగా అతడు నాసల్ పాలిపోసిస్, ఫంగల్ సైనసైటిస్‌తో బాధ పడుతున్నాడని, దీని వల్ల కంటి నరంపై ఒత్తిడి కలుగుతోందని తేలింది. ఫంగస్ అన్ని సైనస్‌లకు వ్యాపించిందని గుర్తించారు. సర్జరీ చేయడంతో కంటిచూపు తిరిగి వచ్చింది.

వీర్య, అండ దాతలకు బిడ్డపై హక్కులుండవు

ముంబై, ఆగస్టు 13: వీర్య, అండ దాతలకు బిడ్డపై చట్టపరమైన హక్కులు ఉండవని బాంబే హైకోర్ట్ స్పష్టం చేసింది. వారిని పిల్లలకు జీవ సంబంధ(బయలాజికల్) తల్లిదండ్రులుగా చెప్పడం కుదరదని తెలిపింది. తన కవల కూతుళ్లను చూసేందుకు అనుమతించాలని ఓ మహిళ వేసిన కేసు విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. తన పిల్లలు అద్దె గర్భం ద్వారా పుట్టారని.. వారు తన భర్త, సోదరితో ఉంటున్నారని పిటిషనర్ కోర్టుకు తెలిపింది. తన సోదరే తనకు అండం దానం చేసిందని.. అయితే ఆమెకే పిల్లలపై చట్టబద్ధ హక్కు ఉంటుందని తన భర్త వాదిస్తున్నాడని కోర్టుకు తెలిపింది. భర్త వాదనను కోర్టు తోసిపుచ్చింది. విభేదాల కారణంగా 2021లో పిటిషనర్ భర్త ఇద్దరు పిల్లలను తీసుకుని వేరే ఇంటికి వెళ్లిపోయాడు. అక్కడ పిల్లల బాగోగులను పిటిషనర్ సోదరి చూసుకుంటుందని అతడు తెలపడంతో పిటిషనర్ స్థానిక కోర్టును ఆశ్రయించారు. అక్కడ ఆమె అభ్యర్థన తిరస్కరణకు గురి కావడంతో హైకోర్టులో కేసు వేశారు.

ఉచితాలకు పైసలుంటయ్.. పరిహారానికి లేవా?

మొదటిపేజీ తరువాయి...

సూటిగా ప్రశ్నించింది. ప్రభుత్వం తీరు ఇలాగే ఉంటే, ఉచిత పథకాలను రద్దు చేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

కోర్టు కీలక వ్యాఖ్యలు

- ఎప్పుడో 1963లో తీసుకొన్న భూమికి రూ. 16 లక్షలను ఇప్పుడు పరిహారంగా ఇస్తారా? అది న్యాయమైన పరిహారమేనా? అసలు ఆ భూముల్లో రక్షణ శాఖ నిర్మాణాలను ఎలా అనుమతించారు?
- 'లాడ్లీ బెహనా' (మహిళలకు నెలకు రూ. 1,500 ఆర్థిక సాయం), 'లడ్కా భౌ' (యువకులకు ఆర్థిక సాయం) వంటి ఉచిత పథకాల కోసం మీ ప్రభుత్వం (షిండే సర్కారు) దగ్గర ఇబ్బడిముబ్బడిగా నిధులు ఉంటాయి. అయితే, బాధితులకు పరిహారం ఇవ్వడానికి డబ్బు లేదా?
- బాధితులకు సరైన పరిహారం చెల్లించకుంటే, ఈ ఉచిత పథకాలను రద్దు చేయాలని మేం ఆదేశాలు ఇస్తాం.
- 1963 నుంచి ఆ భూమి ద్వారా సర్కారు లబ్ధిపొందింది కాబట్టి, నూతన భూ సేకరణ చట్టం ప్రకారం.. ఎంత పరిహారం ఇవ్వాలో మేమే నిర్ణయిస్తాం.
- అలా జరుగొద్దు అనుకొంటే, పరిహారం ఎంత ఇవ్వదలుచుకొన్నారో సీఎంతో చర్చించి ప్రధాన కార్యదర్శి ఓ అంకెతో మా దగ్గరకు రండి. అలసత్వం వహిస్తే అన్ని ఫ్రీస్కీమ్స్‌ను నిలిపేస్తాం.

ఏమిటీ కేసు?

పూర్వీకుల నుంచి వచ్చిన 24 ఎకరాల భూమిని 1963లో మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్నదని, అయితే, దానికి తగిన పరిహారం ఇంకా ఇవ్వలేదని ప్రైవేటు వ్యక్తులు కోర్టులో పిటిషన్ వేశారు. పరిహారం గురించి ఏండ్లుగా అడిగితే, 2004లో మరోచోట కొంత భూమి ఇచ్చారని, అయితే, అది అటవీ భూమి అని కేంద్ర సాధికార కమిటీ తమను బయటకు పంపించివేసిందని పిటిషన్‌లో ఆరోపించారు. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. 1963లో సేకరించిన భూమిలో రక్షణశాఖ నిర్మాణాలు చేపట్టడంపై, బాధితులకు పరిహారాన్ని చెల్లించకపోవడంపై ఇటీవలే మహారాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. బాధితుడికి ఎంత పరిహారం ఇవ్వనున్నారో పూర్తి నివేదికతో రావాలని ఈనెల 7న ఆదేశించింది. అయినప్పటికీ, ప్రభుత్వం ఆ వివరాలను మంగళవారం కోర్టుకు సమర్పించలేదు. దీంతో ఆగ్రహించిన న్యాయస్థానం పై వ్యాఖ్యలు చేసింది.



భార్యను బైక్‌కు కట్టేసి.. ఈడ్చుకెళ్లిన భర్త

రాజస్థాన్‌లో అమానుషం

జైపూర్, ఆగస్టు 13: రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలో ఓ వ్యక్తి తన భార్య పట్ల అత్యంత పాశవికంగా ప్రవర్తించాడు. తన బైక్‌కు భార్యను కట్టేసి.. ఊరంతా చూస్తుండగా ఈడ్చుకుంటూ వెళ్లాడు. తన సోదరి ఇంటికి వెళ్తానన్నందుకు ఈ దారుణానికి పాల్పడ్డాడు. నహర్సింఘాపూర్ గ్రామంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితుడు ప్రేమారమ్ మేఘ్వాల్(32)ను అరెస్టు చేశామని పాంచౌదీ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ సురేంద్ర కుమార్ తెలిపారు. ఘటనకు సంబంధించి వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితురాలు ప్రస్తుతం తన బంధువుల వద్ద ఉందని, ఆమె నుంచి ఫిర్యాదు అందలేదని అన్నారు. మద్యానికి బానిసైన మేఘ్వాల్ తరుచూ భార్యను కొట్టేవాడని స్థానికులు చెప్పారు.

2036 నాటికి 152 కోట్లు

దేశ జనాభాపై కేంద్రం అంచనా.. మెరుగవనున్న లింగ నిష్పత్తి

న్యూఢిల్లీ: జనాభాలో భారతదేశం ఇప్పటికే చైనాను దాటేసి ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉన్నది. 2036 నాటికి దేశ జనాభా 152.2 కోట్లకు చేరుకుంటుందని కేంద్ర ప్రభుత్వ తాజా నివేదిక వెల్లడించింది. మొత్తం జనాభాలో మహిళల సంఖ్య కొంత మేర పెరగడంతోపాటు లింగ నిష్పత్తి కూడా మెరుగవుతుందని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ 'వుమెన్ అండ్ మెన్ ఇన్ ఇండియా-2023' నివేదికలో వెల్లడించింది. 2036 నాటికి జననాల సంఖ్య తగ్గడంతో జనాభాలో 15 ఏండ్ల కన్నా తక్కువ వయసున్న వారి సంఖ్య తగ్గుతుందని, 60 ఏండ్ల పైబడిన వృద్ధుల సంఖ్య పెరుగుతుందని అంచనా వేసింది. దేశంలో చివరిసారిగా 2011లో అధికారింగా జనాభా లెక్కలు నిర్వహించారు. 2021లో మరోసారి జరగాల్సి ఉండగా.. ఆ ప్రక్రియ వాయిదా పడుతూ వస్తున్నది.



మొత్తం జనాభాలో మహిళల సంఖ్య
2036 నాటికి - 48.8% (అంచనా)
2011లో- 48.5%
మెరుగవనున్న లింగ నిష్పత్తి
(1000 మంది పురుషులకు మహిళలు)
2036 నాటికి-952(అంచనా)
2011లో-943
ఐరాస అంచనాల ప్రకారం
ప్రస్తుత దేశ జనాభా-142.5 కోట్లు

రాందేవ్‌పై కోర్టు ధిక్కరణ కేసు మూసివేత

న్యూఢిల్లీ, ఆగస్టు 13: యోగా గురు రాం దేవ్ బాబాకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ప్రకటనల ద్వారా అధునాతన వైద్య విధానాన్ని కించపరుస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టించారంటూ సంస్థ వ్యవస్థాపకుడు రాం దేవ్ బాబా, ఎండీ బాలకృష్ణలపై దాఖలైన కేసులో వారిద్దరూ సమర్పించిన క్షమాపణను అంగీకరిస్తున్నట్టు పేర్కొన్న ధర్మాసనం కేసును మూసివేస్తున్నట్టు ప్రకటించింది. ఐఎంఏ ఈ కేసు దాఖలు చేసింది. దీనిపై పతంజలి యాజమాన్యం కోర్టుకు క్షమాపణ చెప్పడమే కాక, ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పింది.



ఈ వారమే ఇరాన్ దాడి చేయొచ్చు

ఇజ్రాయెల్‌కు అమెరికా హెచ్చరిక

వాషింగ్టన్, ఆగస్టు 13: ఇజ్రాయెల్‌పై ఈ వారంలోనే ఇరాన్ లేదా దాని అనుకూల సంస్థలు దాడికి పాల్పడవచ్చని అమెరికా పేర్కొన్నది. ఈ మేరకు వైట్‌హౌజ్ అధికార ప్రతినిధి జాన్ ఎఫ్ కిర్బి కీలక ప్రకటన చేశారు. జూలై 31న టెహ్రాన్‌లో హమాస్ చీఫ్ ఇస్మాయెల్ హనియా హత్య, లెబనాన్‌లో హెజ్బొల్లా సీనియర్ కమాండర్ ఫౌద్ షుక్ర్‌ను ఇజ్రాయెల్ హతమార్చడంతో ఉద్రిక్తతలు పెరిగిన సంగతి తెలిసిందే. తమ భూభాగంలో ఇజ్రాయెల్ సైనిక చర్యకు పాల్పడటంపై ఇరాన్ భగ్గుమంటున్నది. ఈ నేపథ్యంలో అమెరికా, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ వంటి దేశాధినేతలు ఉద్రిక్తతలను చల్లార్చి, ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణకు సహకరించాలని ఇరాన్‌ను కోరినా సానుకూల స్పందన రాలేదు.

టెల్ అవీవ్ లక్ష్యంగా హమాస్ రాకెట్ల దాడి

ఇజ్రాయెల్‌లోని ప్రధాన నగరం టెల్ అవీవ్ లక్ష్యంగా హమాస్ మంగళవారం దాడికి పాల్పడింది. రెండు ఎం90 రాకెట్లను ప్రయోగించింది. అయితే, ఒక రాకెట్ పేలుడు శబ్దం నగరంలో వినిపించిందని, ఎవరికీ గాయాలు కాలేదని స్థానిక మీడియా తెలిపింది. ఇంకో రాకెట్ మాత్రం ఇజ్రాయెల్ భూభాగంలోకి చేరుకోలేదని పేర్కొన్నది. కాగా, మంగళవారం గాజా స్ట్రిప్‌లోని దక్షిణ, మధ్య ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ వైమానికదాడులకు పాల్పడింది. ఈ ఘటనలో 19 మంది పాలస్తీనా ప్రజలు మరణించినట్టు తెలుస్తున్నది.

పుతిన్‌కు ఉక్రెయిన్ పెనుదెబ్బ!

రష్యాలోని కుర్స్క్‌లో 1000 చ.కి.మీ. భూభాగం స్వాధీనం చేసుకున్న కీవ్ బలగాలు

దాడులు పెరుగుతాయని పుతిన్ హెచ్చరిక

కీవ్/మాస్కో, ఆగస్టు 13: ఉక్రెయిన్‌తో గత రెండేండ్లకు పైగా సాగుతున్న యుద్ధంలో రష్యాకు ఊహించని పరిణామాలు ఎదురవుతున్నాయి. రష్యాకు ఉక్రెయిన్‌ను నుంచి ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. యుద్ధం ప్రారంభంలో రష్యా సైనిక చర్య పేరుతో ఉక్రెయిన్ భూభాగంలోకి చొచ్చుకుపోయి దాడులకు పాల్పడగా.. ఇప్పుడు ఉక్రెయిన్ కూడా అదే పంథా తీసుకొన్నది. ఇటీవల రష్యా భూభాగంలోకి ఉక్రెయిన్ బలగాలు వెళ్లాయి. కుర్స్క్ రీజియన్‌లో దాదాపు వెయ్యి చదరపు కిలోమీటర్ల మేర భూభాగాన్ని తమ అధీనంలోకి తీసుకొన్నామని ఉక్రెయిన్ ఆర్మీ చీఫ్ ఒలెస్కాండర్ సిర్‌స్కీ సోమవారం వెల్లడించారు. సరిహద్దును దాటి రష్యా భూభాగంలోకి చొరబడిన తర్వాత ఉక్రెయిన్ ఆర్మీ చీఫ్ ఈ మేరకు తొలిసారిగా అధికారికంగా స్పందించారు.



సుమీ ప్రాంతంలో ఉక్రెయిన్ యుద్ధ ట్యాంక్

మరోవైపు రష్యా భూభాగంలోకి తమ బలగాలు వెళ్లిన అంశాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా ధ్రువీకరించారు. తాము అధీనంలోకి తీసుకొన్న భూభాగంలోని ప్రజలకు మానవతా సాయం అందించేందుకు ప్రణాళికలు వేయాలని ఆదేశించినట్టు టెలిగ్రామ్‌లో పోస్టు చేసిన వీడియో సందేశంలో తెలిపారు.

ఇతర ప్రాంతాలకు 1.21 లక్షల మంది

రష్యా భూభాగంలోకి చొరబాటు సమయంలో కుర్స్క్ రీజియన్‌లో ఉక్రెయిన్ బలగాలు రసాయనాల ఆయుధాలతో కూడిన షెల్స్‌ను ప్రయోగించాయని రష్యా ప్రభుత్వ మీడియా పేర్కొన్నది. ఈ మేరకు కుర్స్క్ రీజియన్ గవర్నర్ అలెక్సీ స్మిర్నోవ్ వెల్లడించినట్టు ఉటంకించింది. అయితే తన ఆరోపణలకు సంబంధించి స్మిర్నోవ్ వద్ద ఏమైనా ఆధారాలు ఉన్నాయా? అనేదానిపై స్పష్టత లేదని రాయిటర్స్ పేర్కొన్నది. గత ఆరు రోజుల ఉక్రెయిన్ బలగాల దాడుల్లో కుర్స్క్ రీజియన్‌లో 12 మంది పౌరులు మరణించారని, 1.21 లక్షల మందిని ఇతర ప్రాంతాలకు తరలించామని గవర్నర్ స్మిర్నోవ్ పేర్కొన్నారు.

తగిన ప్రతిస్పందన ఉంటుంది..

కుర్స్క్ రీజియన్‌లోకి ఉక్రెయిన్ బలగాల చొరబాటుపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్రంగా స్పందించారు. కీవ్‌పై మరిన్ని దాడులు ఉంటాయని హెచ్చరించారు. ఇది రష్యా స్థిరత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నమని, గట్టిగా జవాబిస్తామని స్పష్టం చేశారు. ఉక్రెయిన్ బలగాల చొరబాటును ఊహించని రష్యా.. అడ్డుకొనేందుకు ప్రయత్నిస్తున్నది. ఇంకా ముందుకు రాకుండా అడ్డుకొనేందుకు అధిక బలగాలను కుర్స్క్ రీజియన్‌కు తరలిస్తున్నది.



పొర్లుదండాలు పెడుతూ కలెక్టర్ ఆఫీసుకు

న్యాయం కోసం మధ్యప్రదేశ్ రైతు వినూత్న నిరసన

ఖాండ్వా (మధ్యప్రదేశ్), ఆగస్టు 13: బీజేపీ పాలిత మధ్యప్రదేశ్ రాష్ట్రంలో న్యాయం కోసం నడిరోడ్డుపై ఒక రైతు పొర్లు దండాలు పెడుతూ కలెక్టర్ కార్యాలయానికి రావడం సంచలనం సృష్టించింది. ఖాండ్వాకు చెందిన శ్యామ్‌లాల్ అనే రైతు తన భూమిని కొందరు కబ్జా చేశారంటూ రెండేండ్ల క్రితం అధికారులకు ఫిర్యాదు చేసినా దానిని ఎవరూ పట్టించుకోలేదు. కలెక్టర్ కార్యాలయంలో జరిపే బహిరంగ విచారణలో ఆయన కేసు కూడా పరిశీలనకు పెట్టారు. దీనికి మామూలుగా నడిచో, వాహనంపైనో రాకుండా తన నిరసనను వ్యక్తం చేయడానికి శ్యామ్‌లాల్ వినూత్న మార్గాన్ని ఎంచుకున్నాడు. రెండు చేతులూ జోడించి బట్టలన్నీ మాసిపోయినా, వంటికి గాయాలైనా లెక్కచేయకుండా రోడ్డుపై పొర్లుదండాలు పెడుతూ కలెక్టర్ కార్యాలయానికి వచ్చాడు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని శ్యామ్‌లాల్‌కు హామీ ఇచ్చారు.

బాన్సువాడలో ఉపఎన్నిక ఖాయం

- పోచారానికి ప్రజలు బుద్ధిచెప్తారు
- త్వరలో బాన్సువాడలో పార్టీ శ్రేణులతో భేటీ : కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): బాన్సువాడ నియోజకవర్గంలో ఉప ఎన్నిక ఖాయమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు స్పష్టంచేశారు. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి పార్టీ మారిన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారని, ఉప ఎన్నికల్లో ఆయనను కచ్చితంగా ఓడిస్తామని ధీమా వ్యక్తంచేశారు. మంగళవారం బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులు నందినగర్ నివాసంలో కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పోచారం శ్రీనివాస్‌రెడ్డిని అన్ని విధాలుగా గౌరవించినా పార్టీని వీడటం ఆయనకే నష్టమని చెప్పారు. కార్యకర్తల కష్టం మీద గెలిచి ఆ తర్వాత స్వార్థం కోసం పార్టీని వీడటం కార్యకర్తలను బాధించిందని పేర్కొన్నారు. కష్టకాలంలో పార్టీకి ద్రోహం చేసిన వారు ఎంత పెద్దవారైనా సరే వదిలిపెట్టేది లేదని, వారికి కచ్చితంగా కార్యకర్తలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్‌లోకి వెళ్లిన తర్వాత పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కనీసం గుర్తుచేసినవాళ్లు కూడా లేని దయనీయ పరిస్థితి నెలకొన్నదని ఎద్దేవా చేశారు.

పార్టీ కార్యకర్తలే కొండంత అండ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలనా సమర్థత ఏమిటో ప్రజలకు తెలిసిపోయిందని, మార్పు పేరుతో ప్రజలను ఏమారుస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. త్వరలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఇతర పార్టీ సీనియర్ నాయకులతో కలిసి బాన్సువాడలో పార్టీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. పార్టీని మోసం చేసి నాయకులు వెళ్లిపోయినప్పటికీ కార్యకర్తలు మాత్రం పార్టీని వీడలేదని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే కొండంత అండ అని పేర్కొన్నారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి పార్టీని వీడినా గ్రామాల్లో పార్టీ కార్యకర్తలంతా బీఆర్ఎస్ పార్టీతోనే ఉన్నారని ఈ సందర్భంగా ఆయా మండలాల నుంచి వచ్చిన పార్టీ శ్రేణులు కేటీఆర్‌కు తెలిపారు.



మంగళవారం హైదరాబాద్‌లోని నందినగర్‌లో కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న గురుకుల ఉద్యోగ అభ్యర్థులు

అభ్యర్థులకు న్యాయం చేయండి

- ప్రభుత్వానికి కేటీఆర్ సూచన
- ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కేటీఆర్‌ను కోరిన ఉద్యోగార్థులు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): గురుకుల పోస్టుల్లో భర్తీ కాకుండా మిగిలిన పోస్టులను తదుపరి మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం నిరుద్యోగ గురుకుల అభ్యర్థులు నందినగర్‌లో కేటీఆర్‌ను కలసి వారి సమస్యలను వివరించారు. గురుకుల బోర్డు చేపట్టిన నియామకాల్లో డౌన్ మెరిట్ లిస్ట్ ఆపరేట్ చేయడం ద్వారానే ఆ సమస్యకు పరిష్కారం లభిస్తుందని వారు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. గురుకుల బోర్డు చేపట్టిన నియామకాల్లో 9,024 పోస్టుల్లో డిసెండింగ్ ఆర్డర్ పాటించకపోవడం, చాలామందికి ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు రావడం వల్ల సెకండ్ మెరిట్‌లో ఉన్న వారికి నష్టం జరుగుతున్నదని వివరించారు. గురుకులాల్లో భర్తీ కాకుండా మిగిలిపోతున్న పోస్టులను తదుపరి మెరిట్ అభ్యరులతో భర్తీ చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కేటీఆర్‌ను విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే జీవో-81పై హైకోర్టు ఐదు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, ప్రభుత్వం ఆయా ఉత్తర్వులను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీఎస్ఎల్ నిర్వహించిన వివిధ నోటిఫికేషన్లలో ప్రస్తుతం భారీ సంఖ్యలో ఖాళీలు ఏర్పడే ప్రమాదం ఉన్నప్పుడు నిరుద్యోగులు నష్టపోకుండా చూడటం కోసం జీవో-81 అమలు చేయకుండా వన్‌టైం రిలాక్సేషన్ (సడలింపు) కల్పించి పోస్ట్ మిగిలిపోకుండా డౌన్‌మెరిట్ ఆపరేట్ చేసి తదుపరి మెరిట్ ఉన్న అభ్యర్థులను ఎంపిక చేశారని గుర్తుచేశారు.

సీఎస్‌కు కేటీఆర్ ఫోన్

గురుకుల అభ్యర్థులు పేర్కొన్న అంశాలను, వారి అభిప్రాయాలను సావధానంగా విన్న తరువాత ఈ విషయంలో వారికి న్యాయం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కేటీఆర్ కోరారు. గురుకుల, డీఎస్సీ అభ్యర్థుల పక్షాన ఆయన సీఎస్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గతంలో అనుసరించిన విధానాన్ని అమలుచేసి అభ్యర్థులకు న్యాయం చేసే అన్ని అవకాశాలను పరిశీలించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. తమ అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన కేటీఆర్‌కు గురుకుల అభ్యర్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. కేటీఆర్‌ను కలిసినవారిలో గురుకుల నిరుద్యోగ విద్యార్థులు రత్నశేఖర్‌రెడ్డి, స్వాతి, నిరుద్యోగ విద్యార్థులు దామోదర్‌రెడ్డి, విక్రమ్‌తోపాటు రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు వాసుదేవరెడ్డి, గెల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రాన్ని అదానీకి అప్పగిస్తే సహించం

- ఢిల్లీలో పోరాటం.. తెలంగాణలో రెడ్ కార్పెటా?
- అదానీతో దేశానికి నష్టం.. తెలంగాణకు లాభమా?
- రాహుల్‌గాంధీపై కేటీఆర్ ప్రశ్నల వర్షం

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌కు అధికారమిచ్చిన పాపానికి తెలంగాణను అదానీకి అప్పగించాలని చూస్తే సహించబోమని, రాష్ట్ర భవిష్యత్తును అంధకారం చేయాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోబోమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు హెచ్చరించారు. హిండెన్‌బర్గ్ నివేదిక నేపథ్యంలో అదానీ-సెబీ వ్యవహారంపై దేశవ్యాప్త ఆందోళనకు కాంగ్రెస్ పిలుపునిచ్చిన సందర్భంగా ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీకి కేటీఆర్ ఎక్స్ వేదికగా పలు ప్రశ్నలు సంధించారు. 'కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో అదే అదానీ కంపెనీకి స్వాగతం పలకడం ద్వంద్వ వైఖరికి నిదర్శనం కాదా? అదానీపై జాతీయ కాంగ్రెస్‌కు ఒక నీతి.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు మరో నీతా?' అని ప్రశ్నించారు. 'ఒకవైపు మీరేమో అదానీ-సెబీ ఆరోపణలపై జేపీసీ వేయాలని డిమాండ్ చేస్తున్నారు. దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిస్తున్నారు. కానీ, ఇక్కడ (తెలంగాణలో) మీ కాంగ్రెస్ సీఎం మాత్రం అదానీకి రెడ్‌కార్పెట్ పరుస్తున్నారు. అదానీ కంపెనీకి ద్వారాలు తెరుస్తున్నారు. విద్యుత్తు పంపిణీ వ్యవస్థను ఏకంగా అదానీకే అప్పగిస్తున్నారు' అని కేటీఆర్ ధ్వజమెత్తారు. అదానీ-కాంగ్రెస్ మిలాఖతై లోపాయికారి ఒప్పందాలు చేసుకున్నారనే అనుమానాలకు బలం చేకూరేలా తెలంగాణలో పరిణామాలు ఉన్నాయని విమర్శించారు. అదానీ వల్ల దేశానికి నష్టం అన్నప్పుడు.. తెలంగాణకు లాభమెలా అవుతుందో చెప్పాలని ప్రశ్నించారు.

కాంగ్రెస్ దిగజారుడుతనానికి నిదర్శనం?

'తెలంగాణలో అదానీ కంపెనీల ఆగమనాన్ని రాహుల్‌గాంధీ ఆపగలరా? తమ పార్టీ ముఖ్యమంత్రి నిర్వాకాన్ని నిలదీసే ధైర్యం చేయగలరా? అదానీ పెట్టుబడులకు ఫుల్‌స్టాప్ పెట్టగలరా? రేవంత్‌రెడ్డికి మొట్టికాయలు వేయగలరా? అంత శక్తి రాహుల్‌గాంధీకి ఉన్నదా?' అంటూ రాహుల్‌పై కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. అదానీపై ఢిల్లీ కాంగ్రెస్‌ది ఒకమాట, గల్లీ కాంగ్రెస్‌ది మరో మాటనా? అని మండిపడ్డారు. అదానీపై కాంగ్రెస్ చేస్తున్న పోరాటంలో చిత్తశుద్ధి కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. జాతీయ పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్‌లో ఈ ద్వంద్వ వైఖరి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం కాదా? అని నిలదీశారు.

ప్రభుత్వ ప్రోద్బలంతోనే హత్యలు

- బీఆర్ఎస్ నేత శ్రీధర్‌రెడ్డి హత్య జరిగి మూడు నెలలైనా కేసులో పురోగతి ఏదీ?
- సిట్ విచారణ ఎక్కడ?: నిరంజన్‌రెడ్డి



వనపర్తి జిల్లా చిన్నంబావి మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

చిన్నంబావి, ఆగస్టు 13 : కాంగ్రెస్ ప్రభుత్వ ప్రోద్బలంతోనే రాష్ట్రంలో హత్యలు జరుగుతున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం వనపర్తి జిల్లా చిన్నంబావి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ రాష్ట్ర నేత అభిలాష్‌రావు నివాసంలో శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి నిరంజన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేత బొడ్డు శ్రీధర్‌రెడ్డి హత్య జరిగి మూడు నెలలైనా కేసులో పురోగతి లేదని, నేటికీ హంతకులను గుర్తించడంలో పోలీసులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సిట్ ఏర్పాటు చేసి 27 రోజులు అవుతున్నా ఎలాంటి పురోగతి లేదని ఆరోపించారు. ఇంతకీ సిట్ ఎక్కడా? అని ఆయన ప్రశ్నించారు. సొంత నియోజకర్గంలో హత్య జరిగితే కనీసం మంత్రి సదరు కుటుంబ సభ్యులను పరామర్శించలేదని దుయ్యబట్టారు. ఇదిలావుంటే మృతుడిపై వ్యక్తిగత ఆరోపణలకు దిగడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ హత్య జరిగినా ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం పరిష్కరించే దిశగా అడుగులు వేయాలే కానీ, వ్యక్తిగత విషయాలను లాగి కేసును పక్కదోవ పట్టించడం సరికాదని సూచించారు. పది రోజుల్లో నిందితులను న్యాయస్థానంలో నిలబెట్టకపోతే డీజీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

రేపటిలోగా మాఫీ చేయాలి

- ఆగస్టు 15 లోగా పూర్తిచేస్తానన్న ముఖ్యమంత్రి ఎక్కడ?
- 31 వేల కోట్లకు మీరు మాఫీ చేసింది 18 వేల కోట్లా ?
- రవాణా శాఖ అవినీతిపై పొన్నం శ్వేతపత్రం ఇస్తారా?
- బీఆర్ఎస్ నేతలు పెద్ది సుదర్శన్, ఎర్రోళ్ల శ్రీనివాస్ ధ్వజం



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : రూ.31 వేలకోట్లతో రుణమాఫీ అని చెప్పి రూ.18 వేలకోట్లతో మమ అనిపించే ప్రయత్నం చేస్తున్నారని, రైతులందరికీ ఒకేసారి రుణమాఫీ చేయకుంటే ఆగస్టు 15 తర్వాత కాంగ్రెస్ నేతలు గ్రామాల్లో తిరగలేరని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, పల్లెరవితో కలిసి పెద్ది మీడియా సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీకి సంబంధించి మాజీ మంత్రి హరీశ్‌రావుపై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలిపారు. హరీశ్‌రావు పనితనాన్ని తప్పుపట్టే నైతిక అర్హత పొన్నం ప్రభాకర్‌కు లేదని తేల్చిచెప్పారు. రైతుల పక్షాన హరీశ్‌రావు మాట్లాడితే పొన్నం సహా మంత్రులు పిచ్చి కూతలు కూస్తున్నారని ధ్వజమెత్తారు. వాస్తవంగా రుణమాఫీకి రూ.45 వేలకోట్లు అవసరమని బ్యాంకింగ్ నిపుణులు అంచనా వేస్తున్నారని చెప్పారు. కానీ లెక్కలను చెప్పేందుకు ప్రభుత్వం జకుంతున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ కాల్‌సెంటర్‌కు రుణమాఫీపై ఇప్పటికే 75 వేలకు పైగా ఫిర్యాదులు వచ్చాయని, రుణమాఫీ కాని రైతుల పక్షాన కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పోరాడుతుందని తెలిపారు. చేయని తప్పులకు రైతులను, సహకార సంఘాలను ప్రభుత్వం బాధ్యులను చేస్తోందని, నల్లబెల్లి మండలంలో రైతులు, సహకార సంఘాలను క్రిమినల్స్‌లా చిత్రీకరిస్తూ కేసులు నమోదు చేస్తున్నదని విమర్శించారు. రవాణా శాఖలో ప్రతి జిల్లాకు కోటి చొప్పున అక్రమంగా వసూలు చేస్తున్నారని, పౌర సరఫరాలశాఖలో 1832 కలెక్షన్ సెంటర్లు పెట్టి మిల్లర్లను వేధిస్తున్నారని, బిల్డర్ల నుంచి చదరపు అడుగుకు రూ.75 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో 3.24 లక్షల కోట్లే అప్పు అయినట్టు హరీశ్‌రావు గణాంకాలతో సహా చెప్పారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది నెలల్లోనే 50 వేలకోట్ల అప్పు చేసిందని, పొన్నం పిచ్చి కూతలు బంద్ చేయాలని, సమాధానం చెప్పే ధైర్యం సీఎంకు, మంత్రులకు లేదని ఎద్దేవా చేశారు.

వయసు పెరిగింది.. బుద్ధి పెరగలే : ఎర్రోళ్ల

మంత్రి పొన్నంకు వయసు పెరిగింది తప్ప బుద్ధి పెరగలేదని బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ దుయ్యబట్టారు. మాట్లాడితే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై బురద జల్లడం తప్ప పొన్నం చేస్తున్నదేమీ లేదని దెప్పిపొడిచారు. అవినీతికి పర్యాయపదం కాంగ్రెస్ అని, కలెక్షన్ సెంటర్ల గురించి పొన్నం మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని ఎద్దేవాచేశారు. రవాణా శాఖలో అవినీతి జరగలేదని పొన్నం శ్వేతపత్రం విడుదల చేయగలరా? అని ప్రశ్నించారు. కరప్షన్, కలెక్షన్ కాంగ్రెస్ విధానమని విమర్శించారు. కేసీఆర్ హయాంలో ఒక్క బస్సూ కొనలేదని పొన్నం అంటున్నారని, కేసీఆర్ హయాంలో ఎన్ని బస్సులు కొనానరో సజ్జనార్‌ను అడిగి తెలుసుకోవాలని హితవుపలికారు. 500 ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేట్ సంస్థలైన ఒలెక్ట్రా, జేబీఎంకు ధారాదత్తం చేసింది కాం గ్రెస్ ప్రభుత్వమేనని విమర్శించారు. ఆర్టీసీకి ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన ఏ హామీనైనా కాంగ్రెస్ నెరవేర్చిందా? అని ప్రశ్నించారు. ఆర్టీసీ బస్సులను ప్రైవేట్‌కు కట్టబెట్టడంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. దీనిపై సీబీసీఐడీ దర్యాప్తునకు సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు. లాభాల్లో ఉన్న ఆర్టీసీని నష్టాల్లోకి నెట్టారని మిగులు బడ్జెట్‌తో అప్పగిస్తే రూ.2100 కోట్ల నష్టంలోకి నెట్టారని ధ్వజమెత్తారు. ఏఐసీసీ అంటే అల్ ఇండియా కరప్షన్ కమిటీ అంటూ ఎద్దేవాచేశారు.

ఏపీ నెత్తిన సర్కారు పాలు!

మొదటిపేజీ తరువాయి...

సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పాల రైతులు పరేషాన్‌లో ఉన్నారని అన్నారు. హైదరాబాద్‌లో 30 లక్షల లీటర్ల పాలు ప్రతి రోజూ వినియోగిస్తారని, తెలంగాణ నుంచి వస్తున్న ఐదు లక్షల లీటర్లకు కూడా డబ్బులు చెల్లించడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మిగతా 25 లక్షల లీటర్ల పాలు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్నించారు. తెలంగాణ డెయిరీని బొంద పెట్టి ఆంధ్రా డెయిరీలను పెంచి పోషించే కుట్ర జరుగుతుందా అనే అనుమానాన్ని వ్యక్తంచేశారు. విజయ డెయిరీ లో రూ.500 కోట్ల నెయ్యి, పాలపొడి ఇతర ఉత్పత్తుల నిల్వలు ఉన్నాయని, వాటి గడువు దాటితే రూ. 500 కోట్లు బూడిదలో పోసిన పన్నీరే అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని యాదాద్రి దేవస్థానానికో, తిరుమల వెంకటేశ్వర స్వామి గుడికో విక్రయిస్తే బాగుంటుందని సూచించారు. పాడి రైతులకు ఇవ్వాల్సిన నాలుగు నెలల బకాయిలు పదిహేను రోజుల్లోగా చెల్లించాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. లేదంటే పాడి రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

జీవో 46 ను రద్దు చేయండి

మంత్రి పొన్నంతో బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : జీవో 46ను రద్దు చేయాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి కోరారు. సోమవారం సెక్రటేరియట్‌లో జీవో 46 బాధితులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. జీవో 46 రద్దుపై మంత్రి సానుకూలంగా స్పందించి, శాసన సభ సబ్ కమిటీలో చర్చిస్తామని హామీ ఇచ్చారని రాకేశ్‌రెడ్డి తెలిపారు.



జనగామలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య. చిత్రంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

డెడ్ స్టోరేజీకి దేవాదుల రిజర్వాయర్లు

- నీటి విడుదలపై పాలకుల మీనమేషాలు
- నీళ్లు దోచుకుపోతున్న ఆంధ్రా సీఎం
- సోయిమరిచి వ్యవహరిస్తున్న సర్కార్
- రాష్ట్ర ప్రభుత్వంపై పొన్నాల ఫైర్
- నీళ్లివ్వకుంటే రైతులతో కలిసి ఉద్యమం
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరిక

జనగామ, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో సరిపడా నీళ్లున్నా.. అసమర్థ, అవగాహన లేని పాలకుల వల్ల దేవాదుల రిజర్వాయర్లన్నీ డెడ్ స్టోరేజీకి చేరాయని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ధ్వజమెత్తారు. మంగళవారం జనగామలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుల సాగునీటి అవసరాలను గుర్తించిన కేసీఆర్.. నాటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లను విస్తరించి ఎండాకాలంలోనూ మత్తళ్లు దుంకేలా రైతులకు సాగునీరు అందిస్తే.. వ్యవసాయం, పంటల సాగుపై కనీస అవగాహన లేని కాంగ్రెస్ సర్కారు దేవాదుల నీటి విడుదలపై మీనమేషాలు లెక్కిస్తున్నదని మండిపడ్డారు. నీళ్లు లేక డెడ్ స్టోరేజీకి చేరుకొని కళావిహీనంగా కనిపిస్తున్న రిజర్వాయర్లు, ఎండిపోతున్న పంట పొలాలపై రోజూ పత్రికల్లో కథనాలు చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నదని వాపోయారు. తెలంగాణ నీటిని ఆంధ్రా ముఖ్యమంత్రి దోచుకుపోతుంటే తెలంగాణలో కాంగ్రెస్ పాలకులకు సోయిలేదని ఫైర్ అయ్యారు. నీటి పారుదల వ్యవస్థ, రైతుల అవసరాలపై ముఖ్యమంత్రికి అవగాహన లేదని, బాధ్యతలను సక్రమంగా నిర్వహించని మంత్రులు ఉండటం ప్రజల దౌర్భాగ్యమని పొన్నాల విమర్శించారు. జనగామ జిల్లాకు వరప్రదాయిని వంటి దేవాదుల రిజర్వాయర్లలోకి నీటిని వదిలేందుకు ఫేస్-1లో ఒక్క పంపు నడిపిస్తే ఎలా సరిపోతుందని? ఎన్నిరోజులకు నిండుతాయని? అప్పటి వరకు పంటలు ఎండిపోవా? నారు ముదిరిపోదా? అని రైతులు ప్రశ్నిస్తున్నా.. ఈ ప్రభుత్వం కదలడం లేదని దుయ్యబట్టారు. కోదండరాం ఏ సబ్జెక్టులో ప్రొఫెసర్? ఆయనకు, నీటిపారుదల వ్యవస్థకు ఏం సంబంధం? ఆయన ఏమన్నా.. నీటిపారుదల రంగ నిపుణుడా? వస్తాడు ఏదో చెప్తాడు.. అసలు వ్యవస్థ ఎటుపోతుంది? అని ఫైర్ అయ్యారు.

నీళ్లు ఇవ్వకుంటే ఉద్యమం: ఎమ్మెల్యే పల్లా

జనగామ పట్టణ ప్రజలకు తాగునీరు అందించే రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరిందని, తాను వెళ్లి పరిశీలించి అధికారులను నిలదీస్తే తప్ప నీటి విడుదలకు మోక్షం లభించేలేదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డి విమర్శించారు. ఇప్పటికీ గండిరామారం, తపాస్‌పల్లి, బొమ్మకూర్ రిజర్వాయర్‌ల కింద 40 శాతం కూడా నాట్లు పడలేదని, నార్లు ముదిరిపోతున్నాయని పేర్కొన్నారు. గోదావరిలో నీళ్లు ఉన్నాయ్.. మోటర్లు బ్రహ్మాండంగా పనిచేస్తున్నాయ్.. ఎందుకు మిగతా పంపులు రన్ చేయడం లేదో అర్థం కావడం లేదని పల్లా మండిపడ్డారు. జనగామ నియోజకవర్గ పరిధిలోని అన్ని రిజర్వాయర్లను దేవాదుల నీటితో నింపకుంటే రైతులతో కలిసి ఉద్యమిస్తామని పల్లా హెచ్చరించారు.



బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న గృహం హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సభ్యులు

'గృహం హెల్పింగ్ హ్యాండ్స్' 10 లక్షల సాయం


ఇటీవల విద్యుత్తు షాక్‌తో మృతి చెందిన పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం మియాపూర్ గ్రామానికి చెందిన దొడ్ల గంగాధర్ కుటుంబానికి గృహం హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ 10 లక్షలు అందజేసి ఉదారతను చాటుకున్నది. మంగళవారం పెద్దపల్లిలోని గృహం అభ్యాస్ స్కూల్‌లో గృహం హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ అధ్యక్షుడు పెద్దపల్లి శ్రావణ్‌కుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపెల్లి ఎలైట్ సమక్షంలో 10 లక్షల చెక్కును అందజేశారు.

-పెద్దపల్లి



యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట పీహెచ్‌సీ నుంచి బీబీనగర్ ఎయిమ్స్‌కు డ్రోన్ సాయంతో రక్త నమూనాను తరలించారు. మంగళవారం ఈ డ్రోన్‌తో 50 కి.మీ. దూరం 20 నిమిషాల్లోనే తరలించిన ట్రయల్ రన్ సక్సెస్ అయినట్టు వైద్యాధికారులు వెల్లడించారు. - రాజాపేట

లోకం పోకడ



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	37.3°c	22.7°c
ఆదిలాబాద్	37.0°c	24.8°c
మెదక్	35.6°c	22.9°c
ఖమ్మం	33.0°c	25.0°c
నిజామాబాద్	32.8°c	24.6°c
మహబూబ్‌నగర్	32.4°c	23.2°c
వరంగల్	33.0°c	26.0°c
హైదరాబాద్	33.0°c	27.0°c
కరీంనగర్	32.0°c	26.0°c
నల్లగొండ	31.5°c	24.4°c

15 వరకు రాష్ట్రంలో వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా బుధ, గురువారాల్లో ఉరుములు, మెరుపులతో గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్ర వెల్లడించింది. హైదరాబాద్‌లో మరో 4 రోజుల పాటు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు.

నేటి నుంచి 'రాజ్యసభ' నామినేషన్లు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రాజ్యసభ ఉప ఎన్నికకు బుధవారం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. తొలిరోజు నుంచి ఈ నెల 21 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. బీఆర్ఎస్ సభ్యుడు కే కేశవరావు రాజీనామాతో ఏర్పడిన ఖాళీ ఏర్పడింది. ఈ స్థానానికి ఎన్నికయ్యే వారు 2026 ఏప్రిల్ 9 వరకు కొనసాగనున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ పేర్కొన్నది. పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ఆగస్టు 27న ప్రకటిస్తారు. ఒకవేళ ఎన్నిక అవసరమైతే.. సెప్టెంబర్ 3న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనున్నది. సాయంత్రం 5 గంటల నుంచి ఓట్లను లెక్కిస్తారు.

నేడు వైద్యసేవల బహిష్కరణ

కోల్‌కతా ఘటనను నిరసిస్తూ జూడాలు, సీనియర్ రెసిడెంట్ల నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): కోల్‌కతాలో వైద్యవిద్యార్థిని హత్యాచార ఘటనను నిరసిస్తూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఓపీ, ఓటీ సేవలను బహిష్కరిస్తున్నట్టు జూనియర్ డాక్టర్లు, సీనియర్, సూపర్ స్పెషాలిటీ రెసిడెంట్లు ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఈనిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు.

ఏఐతో కంటెంట్ రైటింగ్‌లో శిక్షణ

హైదరాబాద్, ఆగస్టు 13(నమస్తే తెలంగాణ): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్) ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో కంటెంట్ క్రియేటివ్ రైటింగ్‌లో 27 నుంచి 29 వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. దరఖాస్తు చేసుకొనే తొలి 40 మందికి మాత్రమే ప్రవేశం ఉంటుందని ఆ సంస్థ మంగళవారం ప్రకటనలో వెల్లడించింది. అభ్యర్థులు పనిచేస్తున్న సంస్థ హెడ్‌వోడీ నుంచి లేదా రిపోర్టింగ్ ఆఫీసర్ నుంచి సిఫారసు లేఖతో kskrishnaraj.nird@gov.inకు ఈమెయిల్ పంపించాలని సూచించింది. వివరాలకు 7560811100/040-24008468 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరింది.

మహాలక్ష్మిలకు 'రాఖీ' బంపర్ ఆఫర్

హైదరాబాద్, ఆగస్టు 13(నమస్తే తెలంగాణ): స్వయంగా వెళ్లి రాఖీ కట్టలేని యువతులకు, మహిళలకు 19న రక్షాబంధన్ సందర్భంగా ఆర్టీసీ లాజిస్టిక్ అందుబాటులో ఉంటుందని సంస్థ తెలిపింది. రాఖీలు, స్వీట్లు బట్వాడా కోసం ప్రధాన బస్టాండ్లలో అదనంగా 100కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించింది. బుక్ చేసిన కౌంటర్ నుంచి 24గంటల్లో వాటిని డెలివరీ చేస్తామని అధికారులు హామీ ఇస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 490కి పైగా బుకింగ్ కౌంటర్లు ఉన్నట్టు తెలిపారు. తెలంగాణలో మాత్రమే కాకుండా, పొరుగున ఉన్న ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు రాఖీలను, స్వీట్లను పంపించుకోవచ్చు అని పేర్కొంటున్నారు. యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ యాజమాన్యం విజ్ఞప్తిచేసింది. వివరాలకు https// www.tgrtclogistics.co.inలో సంప్రదించాలని కోరారు.

రుణమాఫీలో రైతుకు ద్రోహం జరిగింది

మొదటిపేజీ తరువాయి...

హాజరైన ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది. సొంత పార్టీ నాయకుడే ముఖ్యమంత్రిపై ఇలా వ్యాఖ్యలు చేయడమేమిటంటూ వేదికపైన ఉన్న ఎమ్మెల్యే మురళీనాయక్‌తోపాటు జిల్లా, మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు, ప్రజలు ఒక్కసారిగా కంగుతిన్నారు.



బజ్జోరే బజ్జోరి..

గోధూళి వేళలో గువ్వలన్నీ గూళ్లకు చేరుకుంటాయి. తల్లి పక్షులు తెచ్చిన గింజలు తిని.. సంధ్యారాగపు సరిగమలు వింటూ నిద్రలోకి జారుకుంటాయి. వే'కువకువలు' మొదలయ్యాకే పిల్ల పక్షులు బద్ధకంగా రెక్కలు ఆడించే ప్రయత్నం చేస్తాయి. అవి వాటి టైమింగు! మునిమాపు వేళ ముంచుకొచ్చే నిద్ర బుల్లిపిట్టలకే కాదు ముద్దులొలికే బుజ్జాయిలకూ వరమే. లాలిపాట లేకున్నా.. ఆ సమయంలో ఇంత లాలపోస్తే చాలు.. నిద్రలోకి జారుకుంటారు. గాఢంగా నిద్రపోయే చిన్నారుల ఆరోగ్యం భేషుగ్గా ఉంటుందని పలు అధ్యయనాలు జోలపాడి మరీ చెబుతున్నాయి. పసిపిల్లలు రోజుకు 12 నుంచి 16 గంటలు నిద్రించాలని నిపుణుల సూచన. ఏడాది నుంచి రెండేండ్లలోపు పిల్లలు 8 నుంచి 12 గంటలు నిద్రపోవాలట. పసివయసులో సరైన నిద్ర లేకపోతే.. వారి ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. అందుకే, పిల్లలకు నాణ్యమైన నిద్ర అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే!

రోజూ అదే తీరుగా..

చాలామంది తల్లిదండ్రులు పసిపిల్లల నిద్ర విషయంలో సరిగ్గా అంచనా వేయరు. వాళ్లకు పని ఉన్నరోజు.. బుజ్జాయిని భుజాన వేసుకొని తెగ ఊపుతూ, నిద్ర పుచ్చుతారు. ఇంకోరోజు.. కునికిపాట్లు పడుతున్న చిన్నారిని బలవంతాన మేల్కొల్పుతూ ఉంటారు. ఈ రెండు వైఖరులూ తప్పే! కడుపు నిండా తిండి ఉంటే.. కంటి నిండా నిద్రపోవడానికి వాళ్లు సదా సిద్ధంగా ఉంటారు. మీ పిల్లల రెగ్యులర్ నిద్రవేళలను గమనిస్తూ.. అందుకు తగ్గట్టుగా వాళ్లను పడుకోబెట్టాలి. పనులుంటే తర్వాత చక్కబెట్టుకోవచ్చు. మీ తొందర కోసం వారి నిద్రను చిందరవందర చేయొద్దని గుర్తుంచుకోండి.

పరిసరాలు శుభ్రం

కొందరు పిల్లలు చీమ చిటుక్కుమన్నా చటుక్కున లేచిపోతారు. ఇలాంటి పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండటం అవసరం. ముఖ్యంగా ఈగలు, దోమల బెడద లేకుండా చూసుకోవాలి. మెత్తటి పక్క పరచాలి. కాలానికి తగ్గట్టుగా దుస్తులు వేయాలి. మృదువైన దుప్పటి చెవులను మూస్తూ కప్పి నిద్రపుచ్చాలి. అతి వెలుతురు, అనవసరమైన శబ్దాలూ లేకుండా జాగ్రత్తపడాలి.

కథలు చెప్పాలి..

ఏడాదిన్నర, రెండేండ్లు దాటిన చిన్నారుల నిద్ర సమయం సహజంగానే తగ్గుతుంది. మధ్యాహ్నం పూట ఓ రెండు గంటలు పడుకుంటే.. అర్ధరాత్రి దాటేదాకా నిద్రాదేవికి తలొగ్గరు. ఇలాంటి చిచ్చర పిడుగులను కథలతో కట్టిపడేయాలి. చిట్టిపొట్టి కథలు చెబుతుంటే.. ఊఁ కొడుతూ బజ్జుండిపోతారు. పగటి పూట, సాయంత్రాలు పిల్లలను ఆడిస్తే.. రాత్రి త్వరగా పడుకుంటారు. కొందరు పిల్లలకు నిద్రలో పక్క తడిపే అలవాటు ఉంటుంది. పక్క తడిపిన తర్వాత నిద్రాభంగం అవుతుంది. అలాకాకుండా ఉండాలంటే పడుకునే ముందు వాష్‌రూమ్‌కు వెళ్లొచ్చే అలవాటు చేయడం మంచిది.

నమస్తే తెలంగాణ

జిందగీ

హైదరాబాద్ | బుధవారం 14 ఆగస్టు 2024 www.ntnews.com



లోపం లేదు.. పిల్లలూ లేరు.. ఎందుకిలా?

జిందగీ క్లినిక్

హలో డాక్టర్ గారు. ఇటీవల అన్ ఎక్స్‌ప్లెయిన్డ్ ఇన్‌ఫెర్టిలిటీ అనే పదాన్ని వింటున్నాం. అంటే ఏమిటి? ఇది మనదేశంలోని దంపతుల్లోనూ కనిపిస్తున్నదా?

• ఓ పాఠకురాలు

భార్యాభర్తలిద్దరిలో ప్రత్యుత్పత్తి వ్యవస్థకు సంబంధించి ఎలాంటి లోపమూ లేకపోయినా పిల్లలు కలగకపోవడాన్ని 'అన్ ఎక్స్‌ప్లెయిన్డ్ ఇన్‌ఫెర్టిలిటీ' అంటారు. మనదేశంలోనూ ఈ కేసులు ఉన్నాయి. పేరుకు తగ్గట్టే కారణం ఏమిటీ అన్నది అర్థం కాని సమస్య ఇది. పిల్లలు పుట్టడం లేదంటూ మా దగ్గరికి వచ్చే భార్యాభర్తలిద్దరికీ డాక్టర్లుగా మేం కొన్ని పరీక్షలూ, ప్రయత్నాలూ చేయాల్సి ఉంటుంది. అయితే ఎలాంటి సందర్భంలో దాన్ని ఇలా పిలుస్తాం అంటే...



అమ్మాయికి గర్భాశయంలో లోపం లేదు, సరిగ్గా అండం విడుదల అవుతున్నది, గర్భాశయ నాళాలు తెరుచుకునే ఉన్నాయి.. సంభోగానికి ఏ విధమైన అడ్డంకీ లేదు. వయసు 35 లోపే ఉంది. అటు అబ్బాయికి సంభోగ సమయంలో ఎలాంటి సమస్య లేదు, వీర్యంలో కణాల కదలికలు, వీర్యం నాణ్యత.. ప్రామాణికంగానే ఉన్నాయి! తరచుగా సెక్స్‌లో పాల్గొంటున్నారు. పెండ్లయి రెండేండ్లయింది. ఇద్దరిలో షుగర్ లేదు, హార్మోన్‌లు సమతులంగానే ఉన్నాయి! ఇవన్నీ తేలాక... ఆరు నెలలు అండం సరిగ్గా సమయానికి విడుదల అవ్వడానికి మందులు ఇస్తాం. ఆ సమయంలో సంభోగం చేయమని చెబుతాం. ఇలా అండం ఏ సమయంలో విడుదల అవుతుంది అని తెలుసుకునేందుకు ఫాలిక్యులర్ స్టడీ అని ప్రత్యేక పరీక్ష చేస్తాం. ఓవులేషన్ కిట్స్ ద్వారా కూడా ఇది తెలుస్తుంది. ఈ ప్రయత్నం చేసినా ఫలితం రాకపోతే.... అమ్మాయి లోపలి అవయవాలను నేరుగా చూసేందుకు ఎండోస్కోపీ చేస్తాం. గర్భాశయం, గర్భాశయంలోపల ఎలా ఉన్నది అన్నది పరీక్ష చేస్తాం. మరో పద్ధతి ద్వారా గర్భాశయపు లోపలి పొరనూ చూస్తారు. ఇవన్నీ నార్మల్‌గానే ఉన్నాయి. కానీ పిల్లలు కలగడం లేదు అంటే... దాన్ని 'అన్ ఎక్స్‌ప్లెయిన్డ్ ఇన్‌ఫెర్టిలిటీ' అంటారు.

సంభోగం సమయానికి సవ్యంగా జరిగినా అండం ఫలదీకరణ చెందిందా లేదా అన్నది మనకు తెలియదు. అండం విడుదల అవుతున్నదని తెలుసు, వీర్య కణాలు బాగున్నాయని తెలుసు.. కానీ ఎందుకు ఫలదీకరణం చెందడం లేదు, ఎందుకు పిండం ఏర్పడట్లేదు అన్నది మనకు తెలియదు. దానికి ఇంకా పరీక్షలు రాలేదు. ఫెర్టిలిటీ సెంటర్ల వాళ్లు ఇంకాస్త లోపలికి వెళ్లి... జన్యువుల్ని అర్థం చేసుకోవడానికి మగవాళ్లలో డీఎన్ఏ ఫ్రాగ్మెంటేషన్ చేస్తారు. మహిళల్లో అయితే గర్భాశయపు లోపలి పొర తీసి పరీక్ష చేస్తారు. అయినా కొన్నిసార్లు ఏమీ తేలదు. కొన్ని సందర్భాల్లో అండం ఫలదీకరణం చెందుతుంది. కానీ అది ఇమడదు. ఇక అప్పుడు ఫెర్టిలిటీ సెంటర్‌కి వెళ్లమని చెబుతాం. అక్కడ ముందుగా ఐయూఐ చేస్తారు. అంటే ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా అండం విడుదలయ్యేలా చేసి, వీర్యకణాలను సేకరించి శుభ్రపరచి నేరుగా గర్భాశయంలోకి ప్రవేశపెడతారు. అదే అండం క్రమం తప్పకుండా సమయానికి విడుదలయ్యే వారిలో అయితే, ఆ సమయాన్ని గుర్తించి వీర్య కణాలు ప్రవేశపెడతారు. ఇలా మూడుసార్లు చేస్తారు. అయినా నెలతప్పక పోతే... అప్పుడు ఐవీఎఫ్‌కు వెళతారు. అంటే అండాన్ని పరీక్షనాళికలోనే ఫలదీకరణం చెందించి దాన్ని గర్భాశయంలో ప్రవేశపెడతారు. దీన్నే టెస్ట్‌ట్యూబ్ బేబీ అంటారు. అయితే పేరు పొందిన ఫెర్టిలిటీ సెంటర్లలోనూ ఇందులో 50 శాతం కేసులు మాత్రమే విజయవంతం అవుతున్నాయి. అంటే, దానిద్వారా ప్రసవం అయ్యి పాపాయి చేతుల్లోకి రావడానికి అక్కడా సగమే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి ఈ పద్ధతి ద్వారా కూడా బిడ్డలు పుడతారని గ్యారెంటీ ఏమీ లేదు. అయితే... ఇవన్నీ జరిగాయి కాబట్టి ఇక వాళ్లకు పిల్లలే కలగరు అని చెప్పలేం. అన్ని ప్రయత్నాలు చేసి, విసిగిపోయి సాదా జీవితాన్ని గడుపుతున్న వాళ్లకు పిల్లలు కలిగిన సందర్భాలూ ఉన్నాయి. ఎవరో ఒకరిని దత్తత తెచ్చుకున్నాక గర్భం వచ్చిన సందర్భాలూ ఉన్నాయి.



డాక్టర్ పి. బాలాంబ
సీనియర్ గైనకాలజిస్ట్

నిజానికి ఇలా పిల్లలు పుట్టడం లేదు... అని గైనకాలజిస్టు దగ్గరికి వచ్చినప్పుడు మేం పరీక్ష చేసి అండం విడుదల అవుతున్న సమయం గుర్తించి, ఆ సమయంలో కలవమని చెబుతాం. 90 శాతం మంది అప్పుడే నెలతప్పుతారు. కేవలం పది శాతం మందికే ఫెర్టిలిటీ సెంటర్లకు వెళ్లమని సూచిస్తాం.

జన్ షాన్‌షాన్

శాస్త్రీయ నృత్యం రంగమంటపంపై రంజిల్లాలంటే.. ఆంగికం కట్టిపడేయాలి. ఆహార్యం ఆకట్టుకోవాలి. నాట్యకళాకారిణి మనసు తాదాత్మ్యం చెందాలి. అప్పడే ఆ నృత్యం రసికుల హృదయాలపై ఆనంద తాండవం చేస్తుంది. శాస్త్రీయ నృత్యరీతులకు పట్టుగొమ్మ భారతావనిలో లాస్య విన్యాసాలు యథాలాపంగా ఆవిష్కృతం అవుతాయి. ఎల్లలు దాటిన మన కళాకారులు ఎందరో తమ అభినయ వేదంతో విదేశీయుల మనసులు కొల్లగొట్టిన సందర్భాలూ ఉన్నాయి! భారతావనికి వచ్చి.. శాస్త్రీయ నృత్యరీతుల్ని ఉపాసించిన విదేశీయులు ఉన్నారు. అయితే, చైనాలో పుట్టిపెరిగిన చిన్నది, అక్కడే గజ్జెకట్టి, భరతనాట్యంలో పట్టు సాధించి.. చైనా గడ్డపై అరంగేట్రం చేసిన తొలి నర్తకిగా కీర్తి గడించింది మాత్రం లీ ముజి. ఈ పదమూడేండ్ల చిన్నారి ఇప్పుడు సోషల్ మీడియా సెలెబ్రిటీ. ఇండో చైనా సంస్కృతులకు వారధి.

చైనాలో భరతనాట్యం

లీ ముజి

ఆదివారం.. బీజింగ్ నగరంలో ఓ నాట్యమండపం. డ్రాగన్ నృత్యాల దరువుకు అదిరిపడే ఆ వేదికకు కొత్త అనుభూతి! మెత్తటి పాదాలు సుతిమెత్తగా తాకుతున్నాయి. కృష్ణుడి పాదాలు మోదుతున్నప్పుడు పులకించిన కాళీయుడిలా తన్మయానికి లోనైంది ఆ చైనా తలం. ఆ పారవశ్యంలో ఓ పాదాన్ని హత్తుకునే లోపే.. మరో పాదం మరింత మత్తుగా తాకుతున్నది. పాదరసంలా కదులుతున్న ఆమె అడుగులకు మడుగులొత్తడం ప్రారంభించింది ఆ నాట్యవేదిక. మువ్వల మురళి వంత పాడుతూ పరవశించింది. ఘల్ ఘల్ అని ఒకసారి.. ఝుణఝుణ అంటూ మరోసారి! అందెల రవళితో పందెం వేసుకుందేమో... అంబరాన్నంటేలా నాట్యం చేస్తున్నది లీ ముజి. ఆమె నాట్యానికి భారతీయం సరిహద్దులు చెరిపి.. చైనా రాజధాని బీజింగ్ దాకా దూసుకెళ్లింది.

ఎటుచూసినా చీమ కండ్లేసుకున్న చీనీయులే! అక్కడక్కడా భారతీయులు. వారంతా ప్రత్యేక ఆహ్వానితులు. భరతనాట్యంలో దిట్ట అనిపించుకున్న లీలా శాంసన్ ఒక వైపు, చైనాలో భారత రాయబార కార్యాలయం ప్రతినిధులు మరోవైపు. వీరందరికీ లీ ముజిని పరిచయం చేసింది ఆమె గురువు జిన్ షాన్‌షాన్. చీనాంబరాలు కట్టుకున్న చీమకండ్ల చిట్టితల్లికి ఆంగిక అభినయాలు దగ్గరుండి నేర్పించింది ఆవిడే! తన శిష్యురాలు నాట్య విన్యాసాన్ని చూసి పులకించిపోయింది.

ప్రసార మాధ్యమాలు హోరెత్తుతున్న ఈ రోజుల్లో.. సామాజిక మాధ్యమాలు విజృంభిస్తున్న నేటి యుగంలో లీ గజ్జెకట్టిన గంటల్లోనే ఆ నాట్య విన్యాసాలు అంతటా వింతగొలిపాయి. కానీ, ఇప్పటికి 34 ఏండ్ల కిందట 1990లో జిన్ షాన్‌షాన్ భారత్‌లో అడుగుపెట్టింది. చైనాలోని పెకింగ్ విశ్వవిద్యాలయంలో పొందిన ఉపకార వేతనాన్ని వెచ్చించి ఇక్కడికి వచ్చింది. భరత నాట్య కళాకారిణి, నాట్య గురువు లీలా శాంసన్ తలుపు తట్టింది. తనకు నాట్యం నేర్పించమని అభ్యర్థించింది. కుదరదన్నారు గురువు. నిరాశగా వెనుదిరిగింది. నెల తిరగకుండానే మళ్లీ వచ్చింది. నాట్యం నేర్పమని కోరింది. ఈసారీ అవకాశం లేదన్నారు లీలా శాంసన్. మళ్లీ వెనక్కి వెళ్లింది. నెల తిరక్కుండానే మొండిగా వెనక్కి వచ్చింది. 'మీ శిష్యురాలిగా స్వీకరించమ'ని అడిగింది. జిన్ షాన్ తపన గురువుకు నచ్చింది. తన శిష్యబృందంలో ఈ చైనా అమ్మాయికి చోటిచ్చింది. శిక్షణ మొదలైంది. జిన్ ఉత్సాహం చూసి లీలా శాంసన్‌కు ముచ్చటేసింది. మొదట్లో భాష రాకున్నా.. భావాన్ని ఇట్టే పసిగట్టేది. చిట్టి కండ్లతోనే చక్కటి అభినయాన్ని ప్రదర్శించే ఆమె వైనాన్ని చూసి అబ్బురపడ్డారు గురువు. దాదాపు ఎనిమిదిన్నరేండ్ల సాధన. అడపాదడపా స్వదేశానికి వెళ్లి వస్తుండేది. చివరికి 1999లో లీలా శాంసన్ ఆధ్వర్యంలో దిల్లీలో అరంగేట్రం చేసింది జిన్. ఓ చైనా అమ్మాయి భరతనాట్య ప్రదర్శన అప్పట్లో అద్భుతం.



ఒక్కసారి మువ్వలతో జతకట్టిన పాదాలు ఊరికే ఉంటాయా. సొంతూరుకు వెళ్తూ జిన్ భారతీయాన్ని తన వెంటే తీసుకువెళ్లింది. చైనా చేరాక ఆమె ప్రదర్శనలకే పరిమితం కాలేదు. గురువుగా అవతారం ఎత్తింది. తన ఇంట్లోనే అక్కడి చిన్నారులకు నాట్యకళ నేర్పించడం పనిగా పెట్టుకుంది. ఎందరికో నేర్పింది. కొందరు ఆటవిడుపుగా నేర్చుకున్నారు. ఇంకొందరు మధ్యలోనే ఆగిపోయారు. తన కూతురుకు కూడా భరతనాట్యం నేర్పింది. ఈ శిష్యబృందం నుంచి వచ్చిందే లీ ముజి. జిన్‌కు వచ్చిన విద్యనంతా ఆమె ఒడిసిపట్టింది. ఒకటి రెండు సంవత్సరాల్లో పైపైన సాధన చేసి... కిందామీదా పడుతూ ఓ ప్రదర్శన ఇచ్చేసి అరంగేట్రం అనిపించుకోలేదు! పదేండ్లు పరిశ్రమించింది. ప్రతీ వారాంతం రెండు రోజులు గురువు ఇంటికి వెళ్లేది. గంటల కొద్దీ నాట్యం నేర్చుకునేది. మళ్లీ వారానికి వచ్చినప్పుడు.. అంతకుముందు నేర్చుకున్న విద్యనంతా అద్భుతంగా ప్రదర్శించేది. ఇలా భారతంలో ఒడిసిపట్టిన విద్యనంతా చైనాలో తన శిష్యుల పరం చేసింది జిన్ షాన్. లీ ముజి అరంగేట్రంతోనే ప్రపంచాన్ని ఆకట్టుకుంది. లీ మాత్రమే కాదు... మువ్వల కాళ్లతో ముచ్చటగొలుపుతున్న చీనా చిన్నారులు మరెందరో ఉన్నారు. వాళ్లంతా ఆరితేరిన రోజు.. చైనా గోడపై మన అందెలు విందు చేయడం ఖాయం!!

'ఝూంగ్' భళా

లీ ముజి గురువు జిన్ షాన్ మరో గురువు చైనాలో లబ్ధప్రతిష్ఠురాలైన నాట్యకారిణి ఝూంగ్ జున్. 1950 ప్రాంతంలో భారత్‌కు వచ్చిన ఝూంగ్.. ఇక్కడి శాస్త్రీయ నాట్యాన్ని చూసి ముగ్ధురాలైంది. ఏడు పర్యాయాలు భారత్‌కు వచ్చి.. రకరకాల నృత్యరీతులను ఆకళింపు చేసుకున్నది. బిర్జూ మహారాజ్ శిష్యరికంలో కథక్‌లో ఓనమాలు దిద్దింది. చెన్నైలో కొంతకాలం ఉండి భరతనాట్యం అభ్యసించింది. కథాకళిలోనూ ప్రవేశించింది. చైనాలో ఎందరికో శాస్త్రీయ నాట్యం నేర్పింది. 2012లో ఝూంగ్ కాలం చేసింది. ఆమె శిష్యురాలిగా భరతనాట్యంపై పట్టు సాధించిన జిన్.. తన గురువు బాటలోనే పయనిస్తున్నది. జిన్ శిష్యురాలు లీ.. మరో తరానికి భారతీయ కళను చేరువ చేస్తుందనడంలో సందేహం లేదు.


స్మార్ట్ సెక్యూరిటీ



మహిళలు, ఆడపిల్లల సేఫ్టీకి ప్రతి ఒక్కరూ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. నేటి పరిస్థితుల్లో ఇవ్వాలి కూడా. మనకు ప్రియమైన వాళ్లు ఎప్పుడు, ఎక్కడికి వెళ్లినా సేఫ్‌గా ఉన్నారనే భరోసా టెక్నాలజీతో లభిస్తుంది. అందుకే చాలా కంపెనీలు మొబైల్ యాప్స్ తయారీకి ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇప్పటికే చాలా సేఫ్టీ యాప్‌లు వినియోగంలో ఉన్నాయి. సైలెంట్ బీకన్ (Silent Beacon) యాప్ ఈ తరహాదే! మహిళలు, చిన్నపిల్లలు, ఉద్యోగినులకు సెక్యూరిటీ గార్డ్‌గా ఇది పని చేస్తుంది. ముందుగా గూగుల్ ప్లే స్టోర్ నుంచి సైలెంట్ బీకన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. మొబైల్ నంబర్, మెయిల్ ఐడీలతో రిజిస్టర్ అవ్వాలి. తర్వాత పేరు, వయసు సహా తదితర వివరాలు నమోదు చేసుకోవాలి. తర్వాత కుటుంబసభ్యులు లేదా గార్డియన్లకు చెందిన 8 మంది వివరాలను ఎంటర్ చేయాలి. ఎమర్జెన్సీ సమయంలో 911 నంబర్ లేదా మీరు ఎంపిక చేసుకున్న 8 మందికి అలర్ట్ పంపే విధంగా ఆప్షన్ ఎంచుకోవచ్చు. మెసేజ్‌లు, నోటిఫికేషన్లు, మెయిల్స్ ద్వారా కూడా అలర్ట్‌లు అందుతాయి. ఇప్పటికే ఈ అప్లికేషన్‌ను పదిలక్షల మందికిపైగా ఇన్‌స్టాల్ చేసుకుని సేఫ్‌జోన్‌లో జీవన యానం కొనసాగిస్తున్నారు.

గూగుల్ ఫొటోస్‌లో నయా కలెక్షన్స్

హాట్ ఫీచర్!



ఏం చేసినా సెల్ఫీ.. ఎక్కడికి వెళ్లినా ఫొటో. జ్ఞాపకం ఏదైనా అన్నిటినీ ఫోన్‌లోనే భద్రం చేస్తున్నాం. ఆండ్రాయిడ్ యూజర్లు వాటిని కచ్చితంగా గూగుల్ ఫొటోస్‌లోకి సింక్ చేసేస్తారు. దీంతో ఫోన్‌లో బిల్టిన్‌గా ఉన్న ఫొటో గ్యాలరీ ఆప్షన్ కంటే 'గూగుల్ ఫొటోస్' ఫీచర్‌కే ఎక్కువ దగ్గరయ్యారు. అందుకే గూగుల్ ఫొటోస్ ఫీచర్‌ని మరింత కొత్తగా మలిచే పనిలో పడింది సదరు సంస్థ. హాట్ హాట్‌గా 'కలెక్షన్స్' ఫీచర్‌ని యూజర్ల ముందుకు తెచ్చింది. ఇప్పుడున్న 'లైబ్రరీ ట్యాబ్' స్థానంలో ఇది కనిపిస్తుంది. దీంతో మీ మొత్తం ఆల్బమ్స్‌ని కొత్తగా చూడొచ్చు. దీని గురించి సింపుల్‌గా చెప్పాలంటే... ఇంట్లో మన బీరువాలో దుస్తుల్ని కలెక్షన్స్ వారీగా ఎలా సర్దుకుంటామో అలాగే ఫొటోలను కూడా సర్ది మనకు చూపిస్తుందన్నమాట. అన్నీ ఒకేసారి చూసేందుకు 'ఆల్ వ్యూ' ట్యాప్ చేయొచ్చు. మీకు ఎవరైనా షేర్ చేసిన వాటిని 'షేర్డ్ విత్ మి'లో చూడొచ్చు. మొత్తం ఆల్బమ్స్ అన్నీ 'మై ఆల్బమ్స్'లో ఉంటాయి. ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లు ఈ అప్‌డేట్‌ని యాక్సెస్ చేయొచ్చు. ప్రైవసీ నిమిత్తం వాడే 'లాక్ ఫోల్డర్' ఫీచర్‌ని కలెక్షన్స్‌లో ప్రత్యేకంగా సెట్ చేసుకునే వీలుంది.

'ఫొటో అసిస్టెంట్' కూడా..

గ్యాడ్జెట్‌పై ఏదైనా టైపింగ్ చేయడం గానీ, స్క్రీన్‌ను తాకడం గానీ ఇప్పుడు తగ్గించేశాం. మనకు ఏం కావాలన్నా వాయిస్ అసిస్టెంట్‌ను అడుగుతున్నాం. అంతలా పిలిస్తే పలికే అసిస్టెంట్‌లు తాకే తెరపై సిద్ధంగా ఉన్నాయి. అందుకే... ఇకపై గూగుల్ ఫొటోస్‌లో మీ గ్యాలరీలను బ్రౌజ్ చేసేటప్పుడు కూడా 'ఫొటో అసిస్టెంట్'ని అడగొచ్చు. గూగుల్ ఏఐతో ఈ అసిస్టెంట్ పనిచేస్తుంది. అందుకే దీన్ని 'ఆస్క్ ఫొటోస్' ఫీచర్‌గా పిలుస్తున్నారు. త్వరలోనే గూగుల్ జెమిని ఈ ఫీచర్‌ని మోసుకొచ్చేందుకు సిద్ధం అవుతున్నది.